# నీలపు దీపం

## గ్రిమ్స్ కథలు

తెనిగించినది : ఊట్ల కొండయ్య



మంచి పుస్తకం

# నీలపు దీపం

గ్రిమ్స్ కథలు

తెనిగించినది : ఊట్ల కొండయ్య
బొమ్మలు : బాపు

మంచి పుస్తకం

# నీలపు దీపం

గ్రిమ్స్ కథలు


| | | |
|---|---|---|
| తెనిగించినది | : | ఊట్ల కొండయ్య |
| బొమ్మలు | : | బాపు |
| మొదటి ముద్రణ | : | మార్చి, 2015 |
| ప్రతుల సంఖ్య | : | 1000 |

**వెల : రూ. 65/-**

ISBN No. 978-93-83936-17-5

ప్రచురణ, ప్రతులకు :

**మంచి పుస్తకం**

12-13-439, వీధి నెం. 1,

తార్నాక, సికింద్రాబాద్ - 500 017.

ఫోను: 94907 46614

email: info@manchipustakam.in

website: www.manchipustakam.in

ముద్రణ :

చరిత ఇంప్రెషన్స్,

అజామాబాద్, హైదరాబాద్-20.

ఫోన్: 040-2767 8411

# బంగారుకొండ

పూర్వకాలంలో ఒక వర్తకుడుండేవాడు. అతనికి ఒక కూతురు, ఒక కొడుకు ఉన్నారు. వాళ్ళిద్దరూ చాలా చిన్న పిల్లలు.

వర్తకుని రెండు పడవలు  సరుకులు వేసుకొని వస్తూ, సముద్రంలో మునిగిపోయాయి. వర్తకుని దగ్గర ఉన్న డబ్బంతా పెట్టి సరుకులు కొనటంవల్ల, పడవలు మునిగిపోవటంతోటే అతడు దివాలా తీశాడు. ఎంతో లాభం సంపాదించవచ్చు కదా అనుకొంటే ఇలా జరిగింది. తానొకటి తలిస్తే, దైవమొకటి తలచాడు. పాపం! ఆ వర్తకునికి ఇక చిన్న పొలం మాత్రం మిగిలింది. దిగులుగా రోజూ ఆ పొలంలోకి వెళ్ళి పచార్లు చేస్తూ ఉండేవాడు.

ఒకనాడు పొలంలో ఉండగా ఒక మరుగుజ్జు దగ్గరకు వచ్చి, "షావుకారూ! షావుకారూ! ఎందుకు దిగులుగా ఉన్నావు?" అని అడిగాడు. "ఏమి చెప్పను నాయనా! నువ్వేమైనా చేయగలిగితే చెబుతాను," అన్నాడు వర్తకుడు.

"చేయగలనో లేదో ఎలా చెప్పను? అసలు సంగతేమిటో చెప్పు," అన్నాడు మరుగుజ్జు.

అప్పుడు వర్తకుడు ఏ విధంగా తన ఆస్తి అంతా సముద్రం పాలైపోయిందీ చెప్పాడు. ఈ కాస్త పొలం తప్ప తనకిక ఏమీ ఆధారం లేదని కూడా చెప్పాడు.

"నువ్వేమీ విచారపడకు. నీకు కావలసినంత బంగారం ఇస్తాను. ఐతే నువ్విప్పుడు ఇంటికి వెళ్ళగానే ముందు నీ దగ్గరకు ఎవరు వస్తే వాళ్ళను పన్నెండు సంవత్సరాలైన తర్వాత నాకు తెచ్చి ఇస్తానని మాట ఇవ్వు," అన్నాడు మరుగుజ్జు.

"ఇంటికి వెళ్ళగానే ముందు ఎవరు వస్తారు? బహుశా ఇంటికుక్క రావచ్చు," అనుకొన్నాడు వర్తకుడు. కాని తన పిల్లల సంగతి మరిచి పోయాడు. మరుగుజ్జు మాటలు విని చాలా సంతోషించాడు. ఆ షరతుకు ఒప్పుకొని ఆ ప్రకారం కాగితం రాసి ఇచ్చాడు.

కాని, వర్తకుడు ఇంటికి పోగానే అతని కుమారుడు తప్పటడుగులు వేసుకొంటూ వచ్చి తండ్రి కాళ్ళకు చుట్టుకొన్నాడు. వర్తకునికి భయం వేసింది. తాను రాసి ఇచ్చిన కాగితం వల్ల ఏమి జరగబోతుందో తెలుసుకొన్నాడు. అయితే మరుగుజ్జు చెప్పినట్లు బంగారమేమీ ఇంట్లో కనిపించలేదు. మరుగుజ్జు మాటలన్నీ కల్లమాటలే అనుకొన్నాడు.

ఒక నెల గడిచింది. వర్తకుడు మేడ గదిలో ఉన్న పాత ఇనుము అమ్మి సొమ్ము చేసుకుందామని వెళ్ళి గది తలుపు తీశాడు. గది నిండా బంగారం కుప్పలు కుప్పలుగా ఉంది. వర్తకునికి చాలా సంతోషం కలిగింది. ఆ బంగారంతో మళ్ళీ వ్యాపారం సాగించాడు. పూర్వం కంటే పెద్ద ఎత్తున వర్తకం చేసి ఇంకా డబ్బు సంపాదించాడు.

ఈ విధంగా పదకొండేళ్ళు గడిచాయి. వర్తకుని కుమారుడు పెరిగి పెద్దవాడయ్యాడు. పన్నెండవ ఏడు కూడా పూర్తి కాబోతున్నది. వర్తకుని ముఖం విచారంగా ఉంటున్నది. కారణమేమిటని కుమారుడు తండ్రిని అడిగాడు. కొంతకాలంపాటు తండ్రి కారణం చెప్పకుండా దాచాడు. చివరకు ఒకనాడు చెప్పక తప్పింది కాదు. "నేను మాయలో పడిపోయాను నాయనా! మరుగుజ్జు చాలా బంగారం ఇస్తే నిన్ను అతనికి అమ్మాను. పన్నెండేళ్ళు పూర్తి కావచ్చింది," అని వర్తకుడు జరిగిన కథ అంతా కుమారునికి చెప్పాడు.

"చింతించకు నాన్నా! ఆ మరుగుజ్జువాడు నన్నేమీ చెయ్యలేడు. నన్ను నమ్ము," అని కుమారుడు తండ్రిని ఓదార్చాడు.



పన్నెండేళ్ళు పూర్తయ్యాయి. తండ్రీ, కుమారుడు కలిసి పొలంలోకి వెళ్ళారు. కుమారుడు నేలమీద ఒక చక్రం గీసి దానిలో తండ్రిని నిలబెట్టి, తండ్రి పక్కనే తాను నిలుచున్నాడు. ఇంతలో మరుగుజ్జు వచ్చాడు! "నువ్వు ప్రమాణం చేసిన ప్రకారం తెచ్చావా?" అన్నాడు.

"నీకేం కావాలి?" అన్నాడు కుమారుడు.

"నేను నీ తండ్రితో మాట్లాడడానికి వచ్చాను కాని నీతో కాదు," అన్నాడు మరుగుజ్జు.

"నువ్వు మా నాన్నను మోసం చేసి కాగితం రాయించుకొన్నావు. కాగితం తిరిగి ఇవ్వు," అన్నాడు కుమారుడు.

"ఇవ్వను. నా హక్కు వదులుకోను," అన్నాడు మరుగుజ్జు. తర్వాత పెద్ద పోట్లాట జరిగింది. చివరకు ఒక రకంగా తగాదా పరిష్కారమైంది. కుమారుడిని తండ్రి ఒక పడవలో కూర్చోపెట్టి, నదిలో ఆ పడవను తోసేట్లు ఒప్పుకొన్నారు.

కుమారుడు తండ్రి దగ్గర సెలవు తీసుకొని పడవలో ఎక్కి కూర్చున్నాడు. తండ్రి పడవను గట్టిగా తోశాడు. పడవ తలకిందులై నదిలో కొట్టుకు పోయింది. కుమారుడు చచ్చిపోయి ఉంటాడనుకొని తండ్రి ఏడుస్తూ ఇంటికి వెళ్ళిపోయాడు.

పడవ తలకిందులైంది గాని కుమారుడు మాత్రం పడవను వదలలేదు. చాలాసేపటికి పడవ ఒకచోట ఒడ్డుకు చేరింది. ఆ ప్రదేశమంతా చాలా కొత్తగా, వింతగా ఉంది. కుమారుడు ఒడ్డుకు దూకాడు. అతనికి ఎదురుగా అందమైన కోట కనిపించింది. లోపలకి వెళ్ళాడు. కోటలో ఎవరూ లేరు. పాడుపడిన కోటలాగా ఉంది. గబగబ లోపలికి వెళ్ళాడు. చివరకు ఒక గదిలో ఒక తెల్లపాము కనపడింది.

ఆ తెల్లపాము నిజంగా పాము కాదు. ఒక రాకుమారి. శాపం వల్ల అలా పాముగా మారింది. ఆ పాము కుమారుడిని చూసి చాలా సంతోషంతో ఇలా అన్నది: "నా శాపం వదిలించడానికి ఎన్నాళ్ళకు వచ్చావు? నువ్వు మాత్రమే నా శాపం వదిలించగలవు. పన్నెండేళ్ళ నుంచీ నీ కోసం కళ్ళు కాయలు కాచేట్టు ఎదురు చూస్తున్నాను. ఈ రాత్రి పన్నెండుగురు మనుషులు వస్తారు. ఇక్కడ ఏమి చేస్తున్నావని నిన్ను అడుగుతారు. నువ్వు జవాబు చెప్పవద్దు. వాళ్ళేమి చేసినా సరే ఊరుకో – కొట్టినా సరే, హింసపెట్టినా సరే సహించి ఊరుకో. పన్నెండు గంటలకు వాళ్ళు వెళ్ళిపోతారు. రెండవనాడు రాత్రి మరో పన్నెండుగురు వస్తారు. మూడవ రాత్రి ఇరవై నలుగురు వస్తారు. నీ తల నరికి వేస్తారు. కాని పన్నెండు కొట్టేటప్పటికి వాళ్ళకు బలం పోతుంది. నా శాపం తీరుతుంది. నేను నిన్ను ప్రాణం ఇచ్చే నీళ్ళు ఉన్న నది దగ్గరకు తీసుకుపోయి బతికిస్తాను."

కుమారుడు పాము చెప్పినట్లే నడుచుకొన్నాడు. అంతా తు.చ. తప్పకుండా పాము చెప్పిన ప్రకారమే జరిగింది. మూడవనాడు పాము రాకుమారిగా మారింది. కుమారుడిని బతికించింది. అతన్ని కౌగలించుకొని ముద్దుపెట్టుకున్నది. అంతటితో రాకుమారి శాపమే కాకుండా కోటకు చుట్టుకొన్న శాపం కూడా తీరిపోయింది. మహావైభవంగా కుమారుడు

రాకుమారిని పెళ్ళాడాడు. ఆ బంగారుకొండ రాజ్యానికి కుమారుడు రాజయ్యాడు.

కుమారుడు, రాకుమారి సుఖంగా ఉంటున్నారు. కొంతకాలానికి రాకుమారికి కొడుకు పుట్టాడు. ఈ విధంగా ఎనిమిదేళ్ళు సుఖంగా గడిచాయి.

ఒకనాడు రాజుకు తన తండ్రి జ్ఞాపకం వచ్చాడు. వెళ్ళి తల్లినీ, తండ్రినీ చూసి వస్తానని రాణితో అన్నాడు. రాణి ఒప్పుకోలేదు. "నీకేదైనా ఆపద కలుగుతుందేమోనని సందేహంగా ఉంది," అన్నది. కాని రాజు పట్టు విడవలేదు. చివరకు రాణి ఒప్పుకుంది. రాజు బయలుదేరేముందు ఒక ఉంగరం ఇచ్చి, "ఈ ఉంగరం చేతికి పెట్టుకో. నువ్వేమి కావాలని కోరితే దాన్ని ఈ ఉంగరం తీరుస్తుంది. కాని, జాగ్రత్త సుమా! నన్ను మీ నాన్న దగ్గరకు కోరేవు!" అని మందలించింది. "నువ్వు చెప్పినట్లే చేస్తాను," అని రాజు రాణికి మాట ఇచ్చి, ఉంగరం వేలికి పెట్టుకొన్నాడు. 'మా నాన్నగారి ఊరికి వెళ్ళాలి,' అనుకొన్నాడు.

ఉంగరం ప్రభావం వల్ల వెంటనే ఆ వూరు వచ్చి చేరాడు. గబగబా నడిచి, తండ్రి ఇంటి సింహద్వారం దగ్గరకు వెళ్ళాడు. అక్కడి ద్వారపాలకుడు అతని విచిత్రవేషం చూసి, లోపలికి రానివ్వలేదు. సరే, ఇలా కాదని రాజు మళ్ళీ బయలుదేరి ఆ ఊరి చివరి కొండ మీద మందను మేపే గొర్రెల కాపరి దగ్గరకు వచ్చాడు. గొర్రెల కాపరికి తన దుస్తులను ఇచ్చి, అతని దుస్తులను తాను వేసుకొన్నాడు. మెల్లిగా తండ్రి ఇంటికి వచ్చి, "నేను నీ కుమారుడిని," అన్నాడు. వర్తకుడు ఈ మాట నమ్మలేదు. తనకు ఒక్కడే కొడుకున్నాడని, ఆ పిల్లవాడు చాలా కాలం కిందటే చచ్చిపోయాడని అన్నాడు. అతని బికారీ వేషం చూసి, భోజనానికి ఉండమని కూడా అనలేదు. రాజు పట్టు విడవకుండా తాను వర్తకుని కొడుకునేనని అన్నాడు. "మీ కుమారునికి ఏదైనా గుర్తు ఉంటే చెప్పండి," అన్నాడు రాజు. "ఔను, గుర్తు ఉంది. కుడిచేతి మీద పెద్ద పుట్టుమచ్చ ఉంది," అన్నది వర్తకుని భార్య. రాజు చెయ్యి చూపెట్టాడు. నిజంగానే పుట్టుమచ్చ ఉంది. అతడు తమ కొడుకేనని వాళ్ళు గుర్తించారు. తర్వాత రాజు తాను బంగారుకొండకు ఏ విధంగా

రాజైందీ చెప్పాడు. తల్లిదండ్రులు నమ్మలేదు. రాజుకు కోపం వచ్చి ఆ ఉంగరాన్ని తీసి, "నా భార్య, పిల్లవాడు ఇక్కడికి రావాలి," అని కోరాడు. వెంటనే రాణి, పిల్లవాడు హాజరయ్యారు. కాని, రాణి వెక్కివెక్కి ఏడ్చింది. భర్త మాట తప్పినందుకు విచారించింది. ఏమి ఆపద వస్తుందోనని భయపడింది. రాజు ఆమెను ఓదార్చాడు. చివరకు రాణి శాంత పడినట్లు కనిపించింది. కాని, భర్త మోసం చేశాడనే కోపం ఆమె మనస్సులో రాజుకుంది. పగ సాధించడానికి వీలు ఎప్పుడు దొరుకుతుందా అని ఆలోచించసాగింది.

ఒకనాడు రాజు రాణిని పట్టణం వెలుపలికి షికారు తీసుకుపోయాడు. తాను పూర్వం పడవ ఎక్కిన నది ఒడ్డుకు వచ్చాడు. నది ఒడ్డున కూర్చున్నాడు. "నాకు చాలా ఆయాసంగా ఉంది. నీ ఒడిలో తలపెట్టుకుని కొంచెం సేపు పడుకొంటాను," అని భార్యతో అని ఆ ప్రకారమే పడుకొన్నాడు. కొంచెం సేపటికి నిద్రపొయ్యాడు. రాణి అతని వేలి ఉంగరం మెల్లిగా తీసింది. భర్త తల నేల మీదనే పెట్టి లేచి, 'కోటకు వెళ్ళాలి,' అని కోరుకున్నది. వెంటనే బంగారుకొండ కోటకు చేరింది.

రాజు నిద్ర లేచాడు. రాణి కనిపించలేదు. వేలి ఉంగరం కూడా కనిపించలేదు. 'నేనిక ఏ ముఖం పెట్టుకొని నా తండ్రి దగ్గరకు వెళ్ళను. మళ్ళీ బంగారుకొండ రాజ్యం చేరేదాకా ప్రయాణం చేస్తాను,' అనుకొన్నాడు.

ఇలా అనుకుని నడచి వెళుతున్నాడు. వెళ్ళగా వెళ్ళగా ఒక కొండ కనబడింది. అక్కడ ముగ్గురు రాక్షసులు ఆస్తులు పంపకం కుదరక పోట్లాడుకుంటున్నారు. వాళ్ళు రాజును చూశారు. 'మనుషులు మనకంటే తెలివైనవాళ్ళు. ఈ మనిషిని పిలిచి మన ఆస్తి పంచమని అడుగుదాం,' అనుకున్నారు. వాళ్ళకున్న ఆస్తి ఏమిటంటే, ఒక కత్తి, ఒక దుప్పటి, ఒక చెప్పుల జత. ఆ కత్తి పట్టుకుని 'నరుకు' అంటే శత్రువుల తలలు తెగిపోతాయి! ఆ దుప్పటి కప్పుకున్న మనిషి ఇతరులకు కనపడడు, లేదా ఏ రూపం కావాలంటే ఆ రూపం వస్తుంది. ఆ చెప్పుల జోడు తొడుక్కొని ఎక్కడికి పోవాలంటే అక్కడికి పోవచ్చు. రాజు వాళ్ళ ఆస్తి పంచడానికి ఒప్పుకున్నాడు.



కాని ఏది ఎంత విలువైనదో ముందుగా తెలుసుకొంటే గాని పంపకం న్యాయంగా చేయడం కుదరదు. కాబట్టి వాటి ప్రభావం పరీక్ష చెయ్యాలన్నాడు. రాక్షసులు ముందుగా అతనికి దుప్పటి ఇచ్చారు. రాజు దానిని కప్పుకొని "నేను ఈగ అయిపోవాలి," అన్నాడు. ఆ ప్రకారమే అయ్యాడు. మళ్ళీ మామూలు రూపం తెచ్చుకుని, "ఈ దుప్పటి బాగానే ఉంది. ఇప్పుడు కత్తి ఇవ్వండి," అన్నాడు. "జాగ్రత్త సుమా! 'నరుకు' అనేవు? మా తలలు తెగిపోతాయి!" అని రాక్షసులు అన్నారు. చెట్టుమీద ప్రయోగించేటట్లు మాట తీసుకొని రాక్షసులు కత్తిని రాజుకు ఇచ్చారు. తర్వాత రాజు చెప్పుల జోడు ఇవ్వమన్నాడు. ఈ మూడు వస్తువులు చేతికి రాగానే, "నేను బంగారుకొండ దగ్గరకు వెళ్ళాలి," అనుకున్నాడు. ఒక్క క్షణంలో రాజు బంగారుకొండ కోటలో చేరాడు. పాపం! రాక్షసులు విస్తుపోయి చూస్తూ అక్కడే ఉండిపోయారు. ఆస్తే పోతే ఇంకా తగాదా ఏముంది?

రాజు బంగారుకొండ కోట దగ్గరకు వచ్చాడు. కోటంతా అందంగా అలంకరించి ఉంది. మేళాలు, తాళాలు వినబడుతున్నాయి. రాజు అక్కడి వాళ్ళను అడిగాడు. రాణి మళ్ళీ ఒక రాకుమారుడిని పెళ్లి చేసుకోబోతున్నదని వాళ్ళు చెప్పారు. రాజు వెంటనే దుప్పటి కప్పుకొని ఎవ్వరికీ కనబడకుండా రాణి ఉన్న గదిలోపలికి వెళ్ళి ఆమె పక్కనే కూర్చున్నాడు. అతను ఎవ్వరికీ కనబడడం లేదు. రాణికి దాసీలు అన్నం వడ్డించారు. వడ్డించిన పదార్థాలు వడ్డించినట్టుగా రాజు తింటున్నాడు. గిన్నెలో పానీయం పెట్టారు. రాజు వెంటనే తాగి ఖాళీ గిన్నె కిందపెట్టాడు.

ఇదంతా చూసి రాణికి భయం పుట్టింది. తన పడకగది లోపలికి వెళ్ళి వెక్కి వెక్కి ఏడ్చింది. 'అయ్యో ఆనాడు కుమారుడు వచ్చి నా శాపం విడిపించాడు కదా! ఇంకా ఇలా జరుగుతున్నదేమిటి భగవంతుడా!' అని విచారపడింది. రాజు ఆమెకు కనపడకుండా ఆమె పక్కనే కూర్చొన్నాడు. "దుర్మార్గురాలా! కుమారుడు వచ్చి నీ శాపం విడిపించిన మాట నిజమే. అతడు ఇప్పుడిక్కడే ఉన్నాడు. అతడు నీకు చేసిన మేలుకు నువ్వు ఇప్పుడు ఇంత ద్రోహం తలపెట్టావు!" అన్నాడు.

ఈ మాట అని దుప్పటి తీసి, పెళ్ళివాళ్ళను వెళ్ళిపొమ్మన్నాడు.

"పెళ్ళి జరగదు. నేను తిరిగి వచ్చాను. ఈ రాజ్యానికి రాజును నేను. వెళ్ళిపోండి," అని అరిచాడు.

పెళ్ళికుమారుడూ, అతని తరపున వచ్చిన రాజులు, జమీందార్లూ: "అలా వల్లకాదు. పెళ్ళి జరిగి తీరాల్సిందే," అన్నారు. అతన్ని చూసి హేళనగా నవ్వారు. రాజు వాళ్ళతో రెండో మాట మాట్లాడలేదు. "పోతారా, లేదా?" అని అరిచాడు. వాళ్ళు మళ్ళీ పకపకా నవ్వారు. అతన్ని పట్టుకొని కొట్టడానికి తయారయ్యారు. రాజు కత్తి దూశాడు. 'నరుకు' అన్నాడు. వాళ్ళ తలలన్నీ తెగి కిందపడ్డాయి.

రాజు మళ్ళీ బంగారుకొండ రాజ్యం ఏలుతూ భార్యతో సుఖంగా ఉన్నాడు.

# సుందరి, సింహం

ఒక ఊరిలో ఒక వర్తకుడు ఉండేవాడు. అతనికి ముగ్గురు కూతుళ్ళు. చిన్నపిల్ల చాలా అందమైన పిల్ల. తండ్రి ఆమెను 'సుందరీ' అని పిలిచేవాడు.

ఒకనాడు వర్తకుడు వ్యాపారం మీద మరొక పట్టణం వెళ్ళవలసి వచ్చింది. ప్రయాణమై ముగ్గురు కూతుళ్ళను పిలిచి "మీకేమి తీసుకుని రమ్మంటారమ్మా?" అని అడిగాడు. పెద్దకూతురు ముత్యాలు తెమ్మన్నది. రెండవ కూతురు నగలు తెమ్మన్నది. మూడవ కూతురు, "నాన్నా! నాకు గులాబి పువ్వు తెచ్చిపెట్టవూ!" అన్నది. అది గులాబీ పువ్వులు పూసే కాలం కాదు. ఎలా తెస్తాడు? కూతుళ్ళందరిలో సుందరి అంటే తండ్రికి చాలా ప్రీతి. ఆ పిల్లకు పువ్వులంటే తగని ప్రేమ. "ప్రయత్నం చేస్తానమ్మా!" అని చెప్పి, కూతుళ్లను ముగ్గురనూ ముద్దాడి వర్తకుడు బయలుదేరాడు.

తన వ్యాపారం చూసుకొని సొంత ఊరు తిరిగివచ్చేటప్పుడు వర్తకుడు పెద్దకూతురుకు ముత్యాలు, రెండవ కూతురుకు నగలూ కొన్నాడు. కాని ఎంత వెదికినా గులాబిపువ్వు దొరకనే లేదు. పూలతోటలకు వెళ్ళి అడిగాడు. తోటల వాళ్ళు పకపకా నవ్వి, "ఎంత వెర్రివాడవయ్యా! ఈ ఋతువులో గులాబీ పూలు పూస్తాయా?" అని హేళన చేశారు. వర్తకునికి విచారం కలిగింది. సుందరి తనకు చాలా ఇష్టమైన కూతురు. ఆ పిల్ల కోరిక తీర్చలేకపోయానే అని దిగులు పడ్డాడు.

ఇలా విచారపడుతూ ఇంటికి తిరిగి వస్తూండగా దారిలో అందమైన



కోట ఒకటి కనపడింది. ఆ కోట వెనుక తోటలో గులాబీపువ్వులు కనిపించాయి. 'అదృష్టమంటే అలా ఉండాలి,' అనుకొని వర్తకుడు, సేవకుడిని పిలిచి ఒక గులాబిపవ్వు కోయించి తెప్పించాడు. వర్తకుడు సంతోషంగా గుర్రం ఎక్కి ప్రయాణమయ్యాడు.

ఇంతలో ఎక్కడనుండి వచ్చిందో ఒక సింహం దారికి అడ్డంగా నిలుచుని, "నా గులాబీ దొంగిలించినవాడిని చంపి తినేస్తాను," అని అరిచింది. వర్తకుడు భయంతో బదులు చెప్పాడు: "బాబూ! ఆ తోట నీది అని నాకు తెలియదు. నన్ను రక్షించు!" అన్నాడు. "లాభంలేదు. నువ్వు ఇంటికి పోగానే ముందు నీ దగ్గరకు వచ్చినవాళ్లను ఇస్తానని ఒప్పుకొంటే నిన్ను విడిచి పెడతాను. గులాబీ కూడా ఇస్తాను," అని సింహం అన్నది. కాని, వర్తకుడందుకు ఒప్పుకోలేదు. "సుందరికి నేనంటే చాలా ప్రేమ. ఆ అమ్మాయి ముందుగా నా దగ్గరకు వస్తుందేమో!" అన్నాడు. అతని సేవకునికి చాలా భయం పుట్టింది. "సుందరి ముందుగా వస్తుందని నమ్మకం ఏమిటి? కుక్క రావచ్చు. పిల్లి రావచ్చు," అని యజమానికి సలహా చెప్పాడు. చివరకు

వర్తకుడు ఒప్పుకున్నాడు. గులాబీ పువ్వు తీసుకొని ఇంటికి వెళ్ళగానే ముందు తన దగ్గరకు వచ్చిన వాళ్ళను ఇస్తానని సింహానికి మాట ఇచ్చాడు.

వర్తకుడు ఇంటికి వచ్చేటప్పటికి సుందరి పరుగెత్తుకుంటూ తండ్రి దగ్గరకు వచ్చింది. "రా నాన్నా! రా!" అంటూ చెయ్యి పట్టుకొని ఇంటిలోకి తీసుకుపోయింది. గులాబీపువ్వు చూసే సరికి ఆ పిల్ల సంతోషం ఇంత అంత కాదు. కాని తండ్రి మాత్రం విచారంగా ఉన్నాడు. చివరకు వెక్కివెక్కి ఏడుస్తూ ఇలా అన్నాడు: "చిట్టితల్లీ! నిన్ను సింహానికి ఇస్తానని మాట ఇచ్చి ఈ గులాబీ తెచ్చానమ్మా! సింహం నిన్ను చంపి తింటుంది," అని జరిగిన కథ అంతా ఏడుస్తూ వర్తకుడు కూతురితో చెప్పాడు. ఏమైతే అదే అవుతుంది, కూతురును సింహం దగ్గరకు పంపేది లేదన్నాడు.

సుందరి తండ్రిని ఓదార్చింది. "నాన్నా! మాట ఇచ్చి తప్పకూడదు. నేను సింహం దగ్గరకు వెళ్తాను. దాన్ని మచ్చిక చేస్తాను. అది నన్ను చంపదు. తిరిగి ఇంటికి వస్తాను," అన్నది.

రెండవనాటి ఉదయాన సుందరి తండ్రిని అడిగి దారి తెలుసుకొని సెలవు తీసుకొని అడవిలోకి ప్రయాణమైంది. సాయంత్రం అయ్యేటప్పటికి కోట దగ్గరకు వచ్చింది.

ఆ సింహం అసలు సింహం కాదు. ఒక రాజకుమారుడు శాపం వల్ల సింహం అయ్యాడు. పగలంతా అతనూ, అతని పరివారమూ సింహాలై తిరుగుతారు. చీకటి పడగానే మళ్ళీ అందరూ మనుషులౌతారు.

సుందరి కోట లోపలికి వచ్చేటప్పటికి సూర్యుడు అస్తమించాడు. రాకుమారుడు ఆమెను గౌరవంగా లోపలికి తీసుకువెళ్ళాడు. సుందరి రాకుమారుడిని పెళ్ళాడటానికి ఒప్పుకుంది. మహావైభవంగా పెళ్ళి జరిగింది. భార్యాభర్తలు సుఖంగా ఉంటున్నారు. ఐతే రాకుమారుడు రాత్రి మాత్రం రాకుమారితో ఉంటాడు. తెల్లవారగానే కనపడకుండా వెళ్ళిపోతాడు. ఎక్కడికి వెళ్తాడో సుందరికి తెలియదు. సాయంత్రం అయ్యేటప్పటికి మళ్ళీ వస్తాడు.

ఈ విధంగా కొంతకాలం గడిచింది. ఒకనాటి రాత్రి రాకుమారుడు సుందరితో అన్నాడు: "రేపు నీ పెద్ద అక్క పెళ్ళి జరుగుతుంది. నువ్వు వెళ్ళి

చూసి రావాలనుకొంటే నా సింహాలు నిన్ను తీసుకుపోతాయి." ఈ మాటలు విని సుందరి చాలా సంతోషించింది. తన తండ్రినీ, అక్కలను చూడవచ్చు కదా అనుకొన్నది. రెండవనాటి ఉదయం సింహాలతో తండ్రి ఊరు బయలుదేరింది. సుందరిని చూసి అందరూ సంతోషించారు. ఎందుకనంటే ఆమె చాలాకాలం కిందటే చచ్చిపోయి ఉంటుందని అనుకొన్నారు. సుందరి వాళ్ళకు తన కథ అంతా చెప్పింది. పెళ్ళి పూర్తయ్యే దాకా ఉండి తిరిగి కోటకు వచ్చింది.

తర్వాత కొంతకాలానికి సుందరి రెండవ అక్క పెళ్ళి వచ్చింది. సుందరిని కూడా పిలిచారు. సుందరి భర్తతో, "ఈసారి నేను ఒంటరిగా వెళ్ళను. మీరుకూడా వస్తేనే వెళ్తాను," అని అన్నది. కాని రాకుమారుడు అందుకు ఒప్పుకోలేదు. అక్కడికి వెళ్తే చాలా అపాయం వస్తుందన్నాడు. దీపం వెలుగు సోకిందంటే తాను తెల్లని పావురంగా మారిపోతానని అన్నాడు. పావురంగా మారితే ఏడేళ్ళదాకా ఆ శాపం అలాగే ఉంటుందన్నాడు. కాని సుందరి అతన్ని ఊపిరి ఆడనివ్వలేదు. దీపం వెలుతురు పడకుండా అన్ని జాగ్రత్తలూ చేస్తానన్నది.

భార్యాభర్తలు కలిసి పెళ్ళికి బయలుదేరారు. తమ పాపాయిని కూడా వెంట తీసుకువెళ్ళారు. ఒక పెద్దగదికి కిటికీలు, తలుపులూ బిగించి సుందరి భర్తను దానిలో కూర్చోబెట్టింది. పెళ్ళి పందిట్లో దివిటీలు వెలిగించారు. పెళ్ళి మహావైభవంగా జరిగింది. పెళ్ళికొడుకును, పెళ్ళికూతుర్ని పల్లకీలో ఊరేగించారు. ఊరేగింపు తిరిగి ఇంటికి వచ్చింది. దురదృష్టవశాత్తు ఆ పెద్దగది తలుపులో చిన్న సందు ఉంది. దానిగుండా ఒక దివిటీ వెలుగు రాకుమారుని మీద పడింది. వెంటనే రాకుమారుడు తెల్లని పావురంగా మారిపోయాడు. సుందరి తలుపు తీసి గది లోపలికి వచ్చి చూసింది. రాకుమారుడు కనపడలేదు. తెల్లని పావురాయి కనిపించింది. ఆ పావురం సుందరితో ఇలా అన్నది: "ఏడేళ్ళపాటు నేను ఇలా పావురంగా బతకవలసిందే. నేను వెళ్ళే బాటలో నా తెల్లని ఈకలు ఒక్కటొక్కటిగా పడేస్తూ పోతాను. వాటి జాడనే నువ్వు నాతో రా! ఈలోగా నీకు చేతనైతే నన్ను

మామూలు మనిషిగా మార్చు.”

ఈ మాటలు చెప్పి పావురం ఎగిరిపోయింది. అది పోయిన వైపే సుందరి నడుస్తూ ఉంది. అప్పుడప్పుడు దారి గుర్తు తెలియడం కోసం పావురం ఒక్కొక్క తెల్ల ఈక పడవేస్తూ పోతున్నది. ఈ విధంగా సుందరి పావురంతోపాటు ప్రపంచమంతా తిరిగింది. ఆరేళ్ళు గడిచాయి. ఏడవ ఏడు కూడా పూర్తి కావచ్చింది. భర్తతో కలిసి సుఖంగా ఉండే రోజులు దగ్గరకు వచ్చాయని సుందరి సంబరపడింది. ఈ ఏడేళ్ళు విశ్రాంతి ఎరుగదు. దారివైపే కాని ఆ పక్క ఈ పక్క చూసి ఎరగదు. కాని ఆమె దురదృష్టం ఇంకా విడిచిపోలేదు. ఒకనాడు నడుస్తూ నడుస్తూ తెల్లఈక ఏవైపు పడిందో తెలుసుకోలేకపోయింది. దారి తప్పింది. ఆకాశం వైపు అదే పనిగా చూసింది. కాని పావురం కనపడలేదు. ‘ఇక ఇప్పుడు మనుష్య మాత్రులు నాకు సహాయం చెయ్యలేరు,’ అనుకొన్నది. సూర్యుని దగ్గరకు వెళ్ళింది. “సూర్యభగవానుడా! పగలు నువ్వు చూడని చోటంటూ లేదు. ఎక్కడైనా తెల్లపావురం



కనపడిందేమో చెప్పు తండ్రీ!" అని ప్రార్థించింది. "లేదమ్మా నాకు కనపడలేదు. కాని చిన్న పెట్టె బహుమతి ఇస్తాను తీసుకో. అవసరం వచ్చినప్పుడు దాన్ని తెరువు. నీకు సహాయం చేస్తుంది," అని బదులు చెప్పాడు సూర్యుడు.

సుందరి సూర్యునికి నమస్కరించింది. పెట్టె తీసుకొని బయలు దేరింది. సాయంత్రమయింది. చంద్రుడు ఉదయించాడు. సుందరి చంద్రుడిని ప్రార్థించింది: "చంద్ర భగవానుడా! రాత్రి నువ్వు చూడని చోటంటూ లేదు. ఎక్కడైనా తెల్లపావురం కనపడిందేమో చెప్పు తండ్రీ!" "లేదు. కనపడలేదు. కాని నీకు నేనొక గుడ్డు ఇస్తాను. తీసుకో. అవసరం వచ్చినప్పుడు దాన్ని పగులగొట్టు," అని చంద్రుడు సుందరికి గుడ్డు ఇచ్చాడు. సుందరి చంద్రునికి నమస్కరించి మళ్ళీ బయలుదేరింది. అర్ధరాత్రి అయింది. ఉత్తరపుగాలి వీచింది. సుందరి వాయుదేవుడిని ప్రార్థించింది. "వాయుదేవుడా! నువ్వు వెళ్ళని చోటంటూ లేదు. ఎక్కడైనా తెల్లని పావురం కనపడిందేమో చెప్పు తండ్రీ!"

"నాకు కనపడలేదు. ఐనా అన్ని గాలుల్ని అడిగి చూస్తా ఉండు," అన్నది. ఉత్తరపుగాలినీ, తూర్పుగాలినీ, పడమటి గాలినీ పిలిచి అడిగింది. వాళ్ళుకూడా తెల్లపావురాన్ని చూడలేదన్నారు. దక్షిణపు గాలిని పిలిచి అడిగింది. దక్షిణపు గాలి ఇలా చెప్పింది : "నేను చూశాను. తెల్లపావురం ఎర్రసముద్రం దగ్గరకు వెళ్ళింది. ఏడేళ్ళు గడువు ఐపోవడం వల్ల మళ్ళీ సింహంగా మారింది. ఆ సముద్రం దగ్గర ఒక మొసలితో యుద్ధం చేస్తున్నది. ఆ మొసలి ఎవరనుకొన్నారు? అది పూర్వం ఒక రాకుమారి. శాపం వల్ల మొసలి అయింది. ఆ రాకుమారి యువరాజును తీసుకుపోవాలని చూస్తున్నది."

అప్పుడు ఉత్తరపుగాలి సుందరికి ఇలా సలహా చెప్పింది: "ఎర్రసముద్రం దగ్గరకు వెళ్ళు. కుడివైపు ఒడ్డున కొన్ని కర్రలు పాతి ఉంటాయి. వాటిని లెక్క పెట్టు. పదకొండవ కర్ర విరిచి మొసలిని కొట్టు. నీ సింహం గెలుస్తుంది. అప్పుడు వాళ్ళిద్దరూ మనుషులుగా మారతారు. వెంటనే నీ రాకుమారుడిని తీసుకొని ఇంటికి వెళ్ళిపో."

సుందరి ఎర్రసముద్రం ఒడ్డుకు చేరింది. పదకొండవ కర్రను తీసుకొన్నది. మొసలిని కొట్టింది. వెంటనే సింహం రాకుమారుడుగానూ, మొసలి రాకుమారి గాను మారారు. కాని, రాకుమారుడిని వెంటనే అక్కడనుంచి తీసుకపోవాలనే సంగతి మరచిపోయి, సుందరి విస్తుపోయి చూస్తూ ఉంది. రాకుమారి ఇదే సమయం అనుకొన్నది, రాకుమారుని చెయ్యి పట్టుకొని తీసుకుపోయింది.

సుందరి పడ్డ కష్టమంతా పాడయిపోయింది. కాని ధైర్యం తెచ్చుకొని, 'ఎంతకాలమైతే గాలి వీస్తూ ఉంటుందో, ఎంత కాలమైతే కోడిపుంజు కూస్తుందో, అంతకాలం నేను ప్రయాణం చేసి రాకుమారుడెక్కడ ఉన్నదీ తెలుసుకొంటాను,' అని ప్రతిజ్ఞ చేసింది. చాలాకాలం ప్రయాణం చేసి చివరికి ఆ రాకుమారి ఉన్న కోటకు వచ్చింది. కోట అంతా మహా వైభవంగా అలంకరిస్తున్నారు. త్వరలో రాకుమార్తెకూ, రాకుమారుడికీ పెళ్ళి జరుగుతుందని సుందరి తెలుసుకొన్నది.

'భగవంతుడా! రక్షించు తండ్రీ!' అని ప్రార్థించింది. సూర్యుడిచ్చిన పెట్టె తెరిచింది. దానిలో సూర్యునికంటే మిన్నగా మెరిసే జలతారు దుస్తులున్నాయి. సుందరి ఆ దుస్తులు వేసుకొన్నది. కోట లోపలికి వెళ్ళింది. కోటలో ఉన్న వాళ్ళంతా కన్నార్పకుండా ఆమె వంకే చూశారు. పెళ్ళికూతురు రాకుమారి కూడా చూసింది. "అమ్ముతావా?" అని అడిగింది. "బంగారానికీ, వెండికీ అమ్మను. రక్తానికీ, మాంసానికీ అమ్ముతాను," అన్నది సుందరి. రాకుమారికి ఈ మాట అర్థం కాలేదు. "నీ అభిప్రాయం ఏమిటి?" అని అడిగింది. "ఈ రాత్రికి పెళ్ళికొడుకుతో ఒంటరిగా అతని గదిలో మాట్లాడనిస్తే ఈ దుస్తులిస్తాను," అని సుందరి వివరంగా చెప్పింది. రాకుమారి కొంచెం సేపు తటపటాయించి చివరకు ఒప్పుకొన్నది. రాకుమారుడి సేవకుడిని పిలిచింది. ఈ రాత్రి రాకుమారునికి మత్తుకలిగించే పానీయం ఇవ్వమని చెప్పింది.

చీకటి పడింది. రాకుమారునికి మత్తుపానకం ఇచ్చారు. రాకుమారుడు గురకపెట్టి నిద్రపోతున్నాడు. సుందరిని అతని గదిలోపలికి పంపించారు.

రాకుమారుని పాదాల దగ్గర కూర్చుని, "ఏడేళ్ళు నీ వెంట తిరిగాను. నీకోసం సూర్యుడిని ప్రార్థించాను, చంద్రుడిని ప్రార్థించాను, వాయువును ప్రార్థించాను. చివరకు మొసలిబారి నుండి విడిపించాను. నన్ను మరచిపోయావా?" అని ఏడిచింది. రాకుమారుడికి ఈ మాటలేమి వినపడలేదు కానీ, గాలికి చెట్లు కదిలినట్లుగా ఏదో ధ్వని మాత్రం వినిపించింది. కొంచెం సేపటికి సేవకుడు వచ్చి సుందరిని బైటకి తీసుకుపోయాడు. జలతారు దుస్తులు రాకుమారి తీసుకొన్నది.

పాపం! సుందరి ఇంత పరాభవం జరుగుతుందనుకోలేదు. ఊరి బయట బీడులో కూర్చుని ఆ రాత్రి అంతా వెక్కి వెక్కి ఏడ్చింది.

రెండవనాడు సుందరికి చంద్రుడిచ్చిన గుడ్డు సంగతి జ్ఞాపకం వచ్చింది. దాన్ని తీసి పగులగొట్టింది. ఎంత వింత! దానిలోపలినుంచి ఒక బంగారు కోడిపెట్ట, పన్నెండు కోడిపిల్లలు కిచకిచమంటూ తల్లి చుట్టూ అల్లరిగా తిరిగి మళ్ళీ దాని రెక్కల మాటున చేరాయి. సుందరికి ఎంతో సంతోషం కలిగింది. పెట్టనూ, పిల్లనూ మెల్లగా తోలుకుంటూ కోట లోపలికి వచ్చింది. రాకుమారి కిటికీగుండా చూసింది. బైటకి వచ్చి "అమ్ముతావా?" అని సుందరిని అడిగింది. "బంగారానికి అమ్మను. వెండికీ అమ్మను. రక్తానికీ, మాంసానికీ అమ్ముతాను. మళ్ళీ ఈ రాత్రి కూడా రాకుమారునితో ఒంటరిగా మాట్లాడనిస్తే ఇస్తాను," అన్నది సుందరి.

రాకుమారి మళ్ళీ సుందరిని మోసం చెయ్యాలనుకొంది. సుందరి షరతు అంగీకరించింది. రాకుమారుడు ఆ సాయంత్రం తన గది లోపలికి వెళ్ళగానే సేవకుడిని పిలిచి "పోయిన రాత్రి గాలి అలా మోత పుట్టింది ఎందుకూ?" అని అడిగాడు. సేవకుడు నిన్న జరిగిన కథ అంతా పూసగుచ్చినట్లు చెప్పాడు. రాకుమారునికి మత్తుపానకం ఇచ్చిన సంగతీ, ఒక పేదరాలు గదిలోపలికి వచ్చి మాట్లాడిన సంగతి చెప్పాడు. ఈ రాత్రి కూడా ఆమె వస్తుందని చెప్పాడు. రాకుమారుడు ఈసారి జాగ్రత్తపడ్డాడు. మత్తుపానకం పారబోశాడు. సుందరి వచ్చి తన సంగతి అంతా వినిపించటం మొదలుపెట్టింది. రాకుమారుడు తన భార్య గొంతు గుర్తుపట్టాడు. అతనిని



కప్పి ఉన్న మాయ విడిపోయింది. “నువ్వు నన్ను పీడకల నుంచి మేలుకొలిపినట్లు మేలుకొలిపావు, సుందరీ! ఈ రాకుమారి నన్ను మాయలో పెట్టింది. నేను నిన్ను పూర్తిగా మరచిపోయాను. అదృష్టం కొద్దీ భగవంతుడు సమయానికి నిన్నిక్కడికి పంపించాడు,” అన్నాడు.


ఆ రాత్రే చీకటిమరుగున వాళ్ళిద్దరూ కోటదాటి వెళ్ళిపోయారు. ఇల్లు చేరుకొన్నారు. అక్కడ వాళ్ళ కుమారుడు పెరిగి పెద్దవాడై కులాసాగా ఉన్నాడు. రాకుమారుడు, సుందరి, వాళ్ళ కొడుకూ సుఖంగా ఉన్నారు.

# కోడిపెట్ట, కోడిపుంజు

కోడిపుంజు తన భార్య కోడిపెట్టతో ఒకనాడు ఇలా అన్నది, “కొండల మీద ఈ పాటికి కాయలు, గింజలు బాగా పండి ఉంటాయి. వెళ్ళి కడుపునిండా తిందాం పద. ఆలస్యం చేశామంటే ఉడుతలు మనకు ఒక్క గింజకూడా దక్కకుండా తినేస్తాయి.”

“సరే పద. ఈ రోజు కొండలన్నీ షికారు చేసివద్దాం పద,” అన్నది పెట్ట.

భార్యాభర్తలిద్దరూ కలిసి కొండలకు వెళ్ళారు. కాయలూ, గింజలూ కడుపు నిండా తిన్నారు. కడుపునిండా తినటం వల్లనైతేనేమి, తిరిగి తిరిగి అలసిపోవడం వల్లనైతేనేమి, ఇక నడవ లేకపోయారు. ఇంటికి వెళ్ళటం ఎలాగా? కోడిపుంజు అడవిచెట్ల కొమ్మలతో చిన్న బండి కట్టింది. బండి పూర్తికాగానే పెట్ట బండి ఎక్కి కూర్చుంది. “నువ్వు బండి మెడకు కట్టుకుని లాగు,” అన్నది పెట్ట. “మంచి సరసమే! ఆ పని నావల్ల కాదు. ఎలాగో నడిచైనా ఇంటికి పోతాను గాని, బండి లాగడం మాత్రం నావల్లకాదు,” అన్నది పుంజు. ఈ రకంగా ఇద్దరూ మాట్లాడుకొంటూ ఉండగా ఒక అడవిబాతు అక్కడికి వచ్చింది, “దొంగల్లారా! మా పొలాల్లోకి ఎందుకు వచ్చారు? మళ్ళీ ఈ ఛాయలకు రాకుండా మీకు బుద్ధి చెబుతాను ఉండండి,” అని పుంజుమీదకు వచ్చింది. పుంజేనా అంత చేతకానిది. ఎగిరి బాతును అదే పనిగా తన్నింది. “అమ్మోయ్! బాబోయ్! నీ జోలికి రాను. నన్ను



చంపకు," అని బాతు అరిచింది. బండి ఇంటి దాకా లాగేటట్లుగా ఒప్పించి పుంజు కొట్టడం చాలించింది.

పుంజు బండి తోలింది! బాతు బండి లాగుతున్నది. "త్వరగా పరుగెత్తు," అని పుంజు అదిలించింది. బాతు చకచకా పరుగెత్తింది.

కొంచెం దూరం వెళ్ళిన తర్వాత ఒక సూది, ఒక మేకు బండికి ఎదురుగా వచ్చాయి. సూది చెయ్యిచాపి, "ఆగండి, ఆగండి! చీకటి పడింది. మేము నడవ లేకుండా ఉన్నాం. కాస్త మమ్మల్ని కూడా బండి ఎక్కనివ్వండి," అని అడిగింది. సరేనని పుంజు వాళ్ళను బండి ఎక్కమన్నది. సూది, మేకు కూడా బండి ఎక్కారు. "కాని, జాగ్రత్త సుమా! చక్రాల మీద కాలు పెట్టకండి. పెట్ట కాలు మీద పడకుండా ఎడంగా కూర్చోండి," అని కోడిపుంజు అన్నది.

చివరకు ఒక పూటకూళ్ళ ఇంటికి వచ్చారు. చాలాదూరం నడచి రావటం వల్ల బాతు బాగా అలసిపోయింది. ఈ రాత్రి పూటకూళ్ళ ఇంట్లో ఉందామనుకొన్నారు. పూటకూళ్ళ పెద్దమ్మ వీళ్ళ వేషం, మాటలు చూసి, వీళ్ళు పెద్ద మనుషులు కారనుకొని, "మా ఇంట్లో ఖాళీ లేదయ్యా!" అన్నది.

పుంజు, పెట్ట ఆమెను బతిమలాడారు. ఆ రోజు పెట్ట పెట్టిన గుడ్లు ఇస్తామన్నారు. వెళ్ళేటప్పుడు బాతును ఇచ్చి వెళతామన్నారు. బాతు రోజూ గుడ్లు పెడుతుందన్నారు. చివరకు ఎలాగైతేనేమి, పెద్దమ్మ ఒప్పుకొన్నది. వాళ్లకు మంచి మంచి పిండివంటలతో భోజనం పెట్టింది. వాళ్ళు కడుపునిండా తిన్నారు. హాయిగా కంటినిండి నిద్రపోయారు.

తెల్లవారుఝామున ఎవ్వరూ లేవకముందే కోడిపుంజు మేలుకొని, పెట్టను లేపింది. ఇద్దరూ కలిసి గుడ్డు పొడిచి తాగేశారు. డొల్లను పొయ్యిలో వేశారు. తర్వాత సూది, మేకు పడుకున్న చోటుకి వెళ్ళారు. ఇద్దర్నీ మెడపట్టుకుని లేపారు. మేకుని పెద్దమ్మ కూర్చునే పడకకుర్చీలో గుచ్చారు. సూదిని పెద్దమ్మ చేతులు తుడుచుకునే రుమాలులో గుచ్చారు. ఈ పని చేసి, చప్పుడు కాకుండా ఇంటి వెలుపలికి వచ్చారు. బాతు ఇంటి పంచలో పడుకొన్నది. కోళ్ళు లేచిన సంగతి కనిపెట్టింది. అవి బయటకు వచ్చేలోగా మెల్లగా అక్కడనుంచి జారుకొన్నది. పక్కనే ఒక కాలువ ఉంది. బాతు కాలువలో దూకి 'బతికానురా దేవుడా' అనుకొంటూ వెళ్ళిపోయింది.

ఒక గంటసేపైన తర్వాత పూటకూళ్ళ పెద్దమ్మ నిద్రలేచింది. ముఖం కడుక్కొని చేతిరుమాలుతో తుడుచుకున్నది. ఇంకేముంది! సూది దవడకు గుచ్చుకుంది. "అబ్బా!" అంటూ పొయ్యి దగ్గరకు వెళ్ళి నిప్పు రాజేసింది. కోడిగుడ్డు డొల్ల చిటపటమంటూ ముఖంమీద చిందింది. కాస్సేపు ఆమెకు కళ్ళు కనపడలేదు. 'ఇవ్వాళ ఎవరి ముఖం చూసి లేచానో, అంతా అపశకునంగానే ఉంది,' అనుకొంటూ పడకకుర్చీలో కూలబడింది. మేకు గుచ్చుకొంది. పెద్దమ్మకు ఈ మాటు విపరీతంగా కోపం వచ్చింది. ఇదంతా రాత్రి వచ్చిన పెద్దమనుషుల పనే అనుకొని, 'వాళ్ళ భరతం పడతాను వుండు,' అంటూ వెళ్ళి చూసింది. ఎవరు ఉన్నారు అక్కడ? 'కడుపులు పగిలేటట్లు తిన్నారు. ఒక్క రాగికానీ కూడా ఇవ్వకుండా, చెప్పకుండా పెట్టకుండా వెళ్ళారు. ఇలాంటి దిక్కుమాలినవాళ్ళను ఇక గడప తొక్కనివ్వను,' అనుకొన్నది అవ్వ.

మరొకనాడు పుంజూ, పెట్టా కలిసి షికారు వెళ్ళాలనుకొన్నాయి.

నాలుగు ఎర్రటి చక్రాలతో పుంజు ఒక చక్కని బండి తయారుచేసింది. బండికి ఆరు ఎలుకల్ని కట్టింది. భార్యాభర్తలిద్దరూ బండిలో కూర్చున్నారు. బయలుదేరారు.

కొంచెం దూరం వెళ్ళేటప్పటికి ఒక పిల్లి కనిపించింది. "ఎక్కడికయ్యా ప్రయాణం?" అని అడిగింది పిల్లి.

"నక్కబావను చూడడానికి వెళుతున్నాం," అన్నది కోడిపుంజు.

"నన్నుకూడా తీసుకుని వెళ్ళవూ?" అని అడిగింది పిల్లి.

"సరే. బండి వెనక ఎక్కు. పడేవు సుమా! జాగ్రత్త!" అన్నది పుంజు. మరికొంత దూరం వెళ్ళిన తర్వాత ఒక తిరుగలిరాయి, ఒక గుడ్డు, ఒక సూది కనిపించాయి. కోడిపుంజు వాళ్ళందరిని బండిలో ఎక్కించుకొని వెళ్ళింది.

బండి నక్క ఇంటి ముందు ఆగింది. నక్క ఇంట్లో లేదు. అందరూ బండి దిగారు. ఎలుకలు బండిని చావడిలోకి ఈడ్చుకుపోయాయి. పెద్ద మనుషులంతా నక్క ఇంట్లో ప్రవేశించారు. పుంజు, పెట్ట దూలం ఎక్కాయి. పిల్లి పొయ్యిలో కూర్చుంది. గుడ్డు రుమాలులో దూరింది. బాతు నీళ్ళ తొట్టెలో కూర్చుంది. మంచంమీద ఉన్న దిండులో సూది దూరింది. తిరగలిరాయి వాకిటి గుమ్మం మీద కూర్చుంది.

ఇంతలో నక్క వయ్యారంగా ఇంటిలోపలికి వచ్చింది. పొయ్యి వెలిగిద్దామని పొయ్యి దగ్గరకు వచ్చింది. పొయ్యిలో ఉన్న పిల్లి దాని ముఖాన బూడిద కొట్టింది. నక్క కళ్ళనిండా బూడిద పడింది. కళ్ళు కడుక్కోవడానికి నక్క నీళ్ళతొట్టి దగ్గరకు వెళ్ళింది. బాతు నక్క ముఖాన నీళ్ళు కొట్టింది. నక్క లోపలికి వచ్చి రుమాలుతో ముఖం తుడుచుకొంది. గుడ్డు చితికి ముఖంనిండా, కళ్ళనిండా చిందింది. నక్కకు చాలా కోపం వచ్చింది. విసురుగా వెళ్ళి దిండుమీద తల ఆనించి మంచం మీద పడుకొంది. సూది దవడలో దిగింది. నక్కకు కోపం మండిపోయింది. ద్వారం గుండా బైటికి వెళ్ళబోయింది. గుమ్మం దగ్గరకు రాగానే తిరగలి మీద పడి చితికి చచ్చింది.

మరొకనాడు కోడిపుంజు, కోడిపెట్ట కలిసి మేతకోసం కొండకు

బయలుదేరాయి. అక్కడ దొరికిన కాయగాని, గింజగానీ చెరిసగం తినాలనుకున్నాయి. కోడిపెట్టకు ఒక పెద్ద కాయ దొరికింది. అనుకొన్న మాటప్రకారం పుంజును పిలిచి సగం భాగం ఇవ్వాలిగా మరి! పెట్ట పుంజును పిలవకుండా ఆ పెద్దకాయను తానే మింగింది. ఆ కాయ దాని గొంతులో ఇరుక్కుంది. దానికి భయం వేసింది. 'కెక్కెక్కే' అంటూ పుంజును పిలిచింది. "చూడు! నా గొంతు పట్టుకుంది. నదికి వెళ్ళి నీళ్ళు పట్టుకురా, వెంటనే రాకపోతే నేను బతకను," అన్నది. పుంజు నదికి పరుగెత్తింది. "ఓ నదీ! నాకు కొంచెం నీళ్ళివ్వు. నా భార్య కొండమీద ఉంది. ఒక పెద్ద కాయ దాని గొంతున పడింది," అని అడిగింది. ఆ నది అన్నది కదా: "ఐతే త్వరగా వెళ్ళి, నీళ్ళు తోడడానికి పట్టుదారం కావాలని పెళ్ళికూతుర్ని అడుగు." కోడిపుంజు పెళ్ళికూతురు దగ్గరకు వెళ్ళి: "పెళ్ళికూతురా! నువ్వు నాకు పట్టుదారం ఇస్తే, నది నాకు నీళ్ళిస్తుంది. నా భార్య కొండమీద ఉంది. పెద్దకాయ దాని గొంతున పడింది. నీళ్ళు తీసుకుని వెళ్ళి నా భార్యకి ఇస్తాను," అని అడిగింది. పెళ్ళికూతురు అన్నది: "ఐతే త్వరగా పరుగెత్తి,



ఆ తోటలో కొమ్మకు నా పూలమాల తగిలించి ఉందిగానీ అది తీసుకురా! పట్టుదారం ఇస్తాను." కోడిపుంజు తోటలోకి పరుగెత్తుకుంటూ వెళ్ళి, కొమ్మకు తగిలించి ఉన్న పూలమాల తెచ్చి పెళ్ళికూతురుకి ఇచ్చింది. పెళ్ళి కూతురు పట్టుదారం ఇచ్చింది. పట్టుదారం తీసుకొని పుంజు పరుగెత్తుకుంటూ వచ్చి నదికి ఇచ్చింది. నది నీళ్ళిచ్చింది. ఆ నీళ్ళు పెట్ట దగ్గరకు తీసుకుపోయింది. ఈ లోగా పెట్ట ఊపిరాడక చచ్చిపడిపోయింది.

కోడిపుంజు విచారం ఇంత అంత అని చెప్పటానికి వీలులేదు. గోడుగోడున ఏడ్చింది. అడవి జంతువులన్నీ వచ్చి పెట్ట చచ్చిపోయినందుకు ఏడ్చాయి. శవాన్ని స్మశానానికి తీసుకుపోవడానికి ఆరు ఎలుకల బండి వచ్చింది. శవాన్ని బండిమీద పెట్టారు. పుంజు బండి ఎక్కి తోలింది.

తోవలో నక్క కనబడింది: "పుంజా! ఎక్కడికి వెళుతున్నావు?" అని అడిగింది. "నా భార్యను స్మశానానికి తీసుకుపోతున్నాను," అన్నది పుంజు. "నేను కూడా రానా?" అన్నది నక్క. "సరే వెనక ఎక్కు. ముందెక్కితే నా గుర్రాలు లాగలేవు," అన్నది కోడిపుంజు. నక్క బండి వెనక ఎక్కింది! ఇలానే, తోడేలు, అడవిపంది, మేక, తక్కిన అడవి జంతువులన్నీ ఒక్కటొక్కటే వచ్చి బండి ఎక్కాయి.

బండి ఒక సెలయేటి దగ్గరకు వచ్చింది. సెలయేరు మహా వేగంగా ప్రవహిస్తున్నది. "దీన్ని దాటటం ఎలాగా?" అన్నది కోడిపుంజు. రెల్లుగడ్డి వచ్చి ఇలా అన్నది: "నేను సెలయేటికి అడ్డంగా పడుకొంటాను. నా మీదుగా వెళ్ళండి!" రెల్లుగడ్డి మీద ఎలుకలు నాలుగడుగులు వేయకముందే జారి నీళ్ళలో పడి కొట్టుకుపోయాయి. అప్పుడు ఏం చెయ్యాలో కోడిపుంజుకు తోచలేదు. ఒక కొయ్యదూలం వచ్చి: "నేను ఏటికి అడ్డంగా పడుకొంటాను. మీరు వెళ్ళండి," అన్నది. కొయ్యదూలం మీద అడవిజంతువులన్నీ గల్లంతుగా నడిచాయి. కొయ్య జారి నీళ్ళలో పడిపోయింది. జంతువులన్నీ యేటిలో కొట్టుకుపోయాయి. ఒక పెద్ద రాతి దూలం ఈ జరిగిన వ్యవహారమంతా చూసి, కోడిపుంజుమీద జాలిపడి, "నేను ఏటికి అడ్డంగా పడుకొంటాను. నువ్వు సురక్షితంగా బండిని అవతలి ఒడ్డుకు లాక్కుపోవచ్చు," అన్నది. ఆ

రాతి మీదుగా కోడిపుంజు బండిని అవతలి ఒడ్డుకు లాక్కుపోయింది.

కోడిపుంజు స్మశానంలో గొయ్యి తవ్వింది. భార్యను పూడ్చిపెట్టింది. గోతిమీద మట్టిదిబ్బ చేసి, ఆ దిబ్బ పక్కనే ఏడుస్తూ కూర్చుంది. అలాగే చాలాకాలం కూర్చొని ఏడుస్తూ చివరకు ప్రాణాలు విడిచింది.

# బంగారు వెంట్రుకలు

పూర్వకాలంలో ఒక ఊళ్ళో ఒక పేదవాడు ఉండేవాడు. అతనికి ఒక్కగాను ఒక్క కొడుకు పుట్టాడు. ఆ పిల్లవాడు పుట్టిన నక్షత్రం చాలా గొప్పది. పధ్నాలుగేళ్ళు వచ్చేసరికి ఆ రాజ్యం ఏలే రాజు కూతురును పెళ్ళాడతాడని జ్యోతిష్కులు చెప్పారు. అందుకని ఆ పిల్లవాడిని చతుర్దశి అని పిలిచేవాళ్ళు.

ఒకనాడు ఆ రాజ్యం ఏలే రాజు మారువేషంలో ఆ గ్రామం మీదుగా పోతున్నాడు. "ఏమిటి విశేషం?" అని అక్కడి వాళ్ళను అడిగాడు. "విశేషం లేకేం బాబూ! ఈ ఊళ్ళో ఒక పిల్లవాడు పుట్టాడు. వాడు పుట్టినవేళ ఎలాంటిదో గాని పధ్నాలుగోఏడు వచ్చేటప్పటికి ఈ రాజ్యం ఏలే రాజు కూతుర్ని పెళ్ళాడతాడని జ్యోతిష్కులు చెప్పారు. అందరూ ఈ మాటే చెప్పుకొంటున్నారు," అన్నారు వాళ్ళు.

ఈ విషయం వినగానే రాజుకి కోపం వచ్చింది. ఆ పేదవాడి ఇంటికి వెళ్ళాడు, "పిల్లవాడిని అమ్ముతారా?" అని అడిగాడు. తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. కాని రాజు చాలా ప్రాధేయపడి అడిగాడు. చాలా డబ్బులు ఇస్తానని ఆశ పెట్టాడు. వాళ్ళకు కడుపునిండా తినడానికి తిండికూడా లేదాయె! అందుకని మెత్తపడ్డారు. చివరకు ఒప్పుకున్నారు. రాజు ఇచ్చిన సొమ్ము తీసుకున్నారు. పిల్లవాడిని ఇచ్చారు. 'వాడి అదృష్టం బాగుంటే ఎవ్వరూ ఏమీ చెయ్యలేరు,' అనుకొని తృప్తిపడ్డారు.

రాజు చతుర్దశిని ఒక పెట్టెలో పెట్టాడు. గుర్రం మీద పెట్టుకొని స్వారీచేస్తూ వెళ్ళాడు. ఒక పెద్ద నది దగ్గరకు వచ్చాడు. ఆ నదిలో పెట్టె విసిరివేశాడు. అప్పుడు అనుకొన్నాడు: 'నా కూతురికి ఈ పిల్లవాడు ఎలా భర్త అవుతాడో చూస్తాను.'

అయితే ఆ పెట్టె అదృష్టవశాత్తు నీళ్ళలో మునిగిపోలేదు. నీళ్ళు ఒక్క చుక్క కూడా లోపలికి పోలేదు. నదిమీద పెట్టె కొట్టుకు పోతున్నది. ఒక ఊరి సమీపంలో ఆ నది ఒడ్డున బట్టలు ఉతుకుతున్న చాకలి నీళ్ళల్లో కొట్టుకొని వస్తున్న పెట్టెను చూశాడు. గడకర్ర తెచ్చి మెల్లగా ఒడ్డుకు లాగాడు. పెట్టె చాలా బరువుగా ఉంది. దానినిండా బంగారం ఉంటుందని చాకలి ఆశపడ్డాడు. తెరిచి చూసేటప్పటికి బంగారం లేదు కాని, బంగారం లాంటి పిల్లవాడు కనపడ్డాడు. చాకలిని చూసి ఆ బాబు ముసిముసినవ్వులు నవ్వాడు. చాకలి భార్యను పిలిచాడు. వాళ్ళకు సంతానం లేదు. చాకలి భార్య ఆ పిల్లవాడిని ఎత్తుకుని, "నా బాబే! నా తండ్రే! ఎంత చక్కని పిల్లవాడు! భగవంతుడు మన మొర విని ఈ బంగారుకొండను పంపించాడయ్యా!" అంటూ ముద్దుపెట్టుకొంది.

ఇలా పదమూడేళ్ళు గడిచిపోయాయి. ఒకనాడు రాజు ఆ వైపు స్వారీ చేస్తూ చాకలి కొడుకును చూశాడు. అతనికి ఎందుకో అనుమానం కలిగింది. "ఈ పిల్లవాడు నీ కొడుకేనా?" అని అడిగాడు. "కాదు! నాకు ఈ పిల్లవాడు పాపాయిగా ఉన్నప్పుడు నదిమీద ఒక పెట్టెలో దొరికాడు," అని చాకలి సమాధానం చెప్పాడు. "ఎంతకాలం కిందట?" అని రాజు అడిగాడు. "పదమూడేళ్ళ కిందట," అని చాకలి సమాధానం చెప్పాడు. రాజు అర్థం చేసుకొన్నాడు. పూర్వం తాను పెట్టెలో పెట్టి నదిలో వేసిన పిల్లవాడు వీడేనని తెలుసుకొన్నాడు. "రాణికి ఒక జాబు ఇచ్చి రావాలి. ఈ పిల్లవాడిని పంపిస్తావా?" అని రాజు అడిగాడు. "దానికేం మహారాజా! తమ చిత్తం వచ్చినట్లు పంపండి," అన్నాడు చాకలి.

రాజు రాణికి జాబు రాశాడు. జాబులో ఇలా ఉంది, "ఈ జాబు తెచ్చిన వాడిని వెంటనే చంపించి పూడ్చిపెట్టించు. నేను తిరిగి వచ్చేటప్పటికి

అంతా పూర్తికావాలి."

చతుర్దశి జాబు తీసుకొని బయలుదేరాడు. కొంతదూరం నడిచిన తర్వాత దారి తప్పాడు. సాయంత్రానికి ఒక దట్టమైన అడవి లోపలికి వచ్చాడు. అడవి అంతా చీకటిగా ఉంది. ఆ చీకటిలో కొంచెం దూరంలో వెలుతురు కనపడింది. చతుర్దశి ఆ వెలుగు ఉన్నచోటికి వెళ్ళాడు. అక్కడ ఒక చిన్న ఇల్లు ఉంది. లోపలికి వెళ్ళాడు. ఎవ్వరూ లేరు. ఒక ముసలి అవ్వ మాత్రం కూర్చొని ఉంది. చతుర్దశిని చూసి అవ్వ భయపడింది. "ఎవరు నాయనా నువ్వు? ఎక్కడినుండి వస్తున్నావు? ఎక్కడికి పోతున్నావు?" అని అడిగింది. "నేను రాణి దగ్గరకు పోతున్నాను. రాజు దగ్గరనుంచి జాబు తీసుకొనిపోతున్నాను. దారి తప్పాను. ఈ రాత్రి ఇక్కడ పడుకోనివ్వు అవ్వా," అన్నాడు చతుర్దశి.

"నువ్వు చాలా దురదృష్టవంతుడివి నాయనా! రాకరాక దొంగల ఇంటికే వచ్చావు. దొంగలు తిరిగివచ్చి నిన్ను చూశారంటే అపాయం తప్పదు," అన్నది అవ్వ.

"ఏమైనా కానీ అవ్వా! నేను అలసిపోయాను. ఇక నడవలేను," అని చతుర్దశి అక్కడవున్న మేజామీద జాబుపెట్టి పక్కనే ఉన్న బల్లమీద కాళ్ళు చాపుకుని పడుకొని నిద్రపోయాడు.

కొంచెం సేపటికి దొంగలగుంపు వచ్చింది. పడుకొని ఉన్న పిల్లవాడిని చూసి ఎవరని ముసలమ్మని అడిగారు. "పాపం ఎవరో కుర్రవాడు దారితప్పి ఇటు వచ్చాడు. నేను పడుకోమన్నాను," అని బదులు చెప్పింది ముసలమ్మ. దొంగలు మేజాబల్ల మీద ఉన్న జాబు చించి చదివారు. అందులో ఉన్న సంగతులు తెలుసుకొన్నారు. దొంగల నాయకుడు ఆ జాబు చించిపారేశాడు. మరొక జాబు రాశాడు. "ఈ జాబు తెచ్చిన పిల్లవాడికి వెంటనే రాకుమార్తెనిచ్చి పెళ్ళి చెయ్యవలసింది," అని ఆ జాబులో రాశాడు.

తెల్లవారగానే దొంగలు చతుర్దశికి రాజు ఊరికి దారి చూపించారు. అతడు త్వరత్వరగా నడచి కోటకు వచ్చాడు. రాణి జాబు చదివి చాలా సంతోషించింది. వెంటనే పెళ్ళి ఏర్పాట్లన్నీ చేయించింది. చతుర్దశిని



రాకుమారి చూసింది. అతని అందాన్ని చూసి పెళ్ళి చేసుకోవడానికి ఒప్పుకుంది. మహా వైభవంగా పెళ్ళి జరిగిపోయింది.

పెళ్ళి జరిగిన మరునాడు రాజు కోటకు వచ్చాడు. జ్యోతిష్కులు చెప్పిన మాటే నిజమైంది. తాను ఎన్ని మాయలు పన్నినా చివరకు చతుర్దశి తన కూతుర్ని పెళ్ళి చేసుకొన్నాడు. అసలు ఈ పెళ్ళి వ్యవహారమంతా మొదటినుంచీ ఏమి జరిగిందీ తెలుసుకోవాలనుకొన్నాడు. భార్యను అడిగాడు. “అలా అంటారేమండీ! మీ జాబు చూడండి!” అని రాణి రాజుకు జాబు అందించింది. అక్షరాలు తాను రాసినట్లే ఉన్నాయి కాని విషయం మాత్రం అదికాదు. ఈ మార్పు ఎలా వచ్చిందో రాజుకు తోచలేదు. కొత్త అల్లుడిని పిలిచి అడిగాడు. “నాకేమీ తెలియదు! నేను నిద్రపోయేటప్పుడు జాబు మారిందేమో,” అన్నాడు చతుర్దశి.

రాజుకు పట్టరాని కోపం వచ్చింది. “నేను ఒప్పుకోను. దూరాన ఉన్న కొండ గుహలో ఒక రాక్షసుడు ఉన్నాడు. అతని వెంట్రుకలు బంగారపు వెంట్రుకలు. మూడు వెంట్రుకలు నాకు తెచ్చిస్తే నువ్వు నా కూతురు భర్తవని ఒప్పుకుంటాను. అంతవరకూ ఒప్పుకోను,” అన్నాడు.

“అయితే బంగారపు వెంట్రుకలు తెస్తాను,” అని చతుర్దశి బయలు దేరాడు.

నడచినడచి ఒక పట్టణానికి వచ్చాడు. ఆ పట్టణపు సింహద్వారం కాసే కాపలావాడు “నువ్వేం పనిచేస్తావు? నీకేమి తెలుసు?” అని అడిగాడు. “నాకన్నీ తెలుసు,” అన్నాడు చతుర్దశి. “అయితే ఉండు. నీలాంటి మనిషి కోసమే మేం చూస్తున్నాం. మా ఊరు అంగడి దగ్గర ఉన్న బావి ఎండిపోయింది. కారణం చెప్పగలవా? చెప్పగలిగితే నీకు రెండు గాడిదలు మోసేటంత బంగారం ఇస్తాం,” అన్నాడు కాపలావాడు. “తిరిగి వచ్చేటప్పుడు చెబుతాను,” అని చతుర్దశి బయలుదేరాడు.

ప్రయాణం చేసి, చేసి మరొక పట్టణం దగ్గరకు వచ్చాడు. ఆ పట్టణం సింహద్వారం కాసే కాపలావాడు అతన్ని ఆపి అడిగాడు: “నువ్వేం పని చేస్తావు? నీకేమి తెలుసు?” “నాకు అన్నీ తెలుసు,” అన్నాడు చతుర్దశి.

“అయితే దయచేసి మాకొక ఉపకారం చేసిపెట్టు. ఇక్కడ ఒక చెట్టు ఉంది. అది పూర్వం బంగారు పళ్ళు కాసేది. ఇప్పుడు దానిమీద ఒక ఆకుకూడా లేదు. ఎందుకనో చెప్పగలవా?” “ఆ! తప్పకుండా చెబుతాను. తిరిగి వచ్చేటప్పుడు చెప్పి వెళతాను,” అన్నాడు చతుర్దశి.

మళ్ళీ ప్రయాణమయ్యాడు. ఒక పెద్ద సరస్సు ఒడ్డుకు వచ్చాడు. ఆ సరస్సు దాటాలి. అక్కడ పడవ నడిపేవాడు అడిగాడు: “నువ్వేం పని చేస్తావు? నీకేం తెలుసు?” “నాకన్నీ తెలుసు,” అన్నాడు చతుర్దశి. “ఐతే, ఈ పడవ నడిపే పీడ నాకెప్పుడు విరగడ అవుతుందో చెప్పగలవా? నీకు మంచి బహుమానం ఇస్తాను,” అన్నాడు పడవవాడు.

“తిరిగి వచ్చేటప్పుడు ఆ సంగతి యావత్తూ చెబుతాను,” అన్నాడు చతుర్దశి.

సరస్సు దాటాడు. కొండగుహ దగ్గరకు వచ్చాడు. లోపల ప్రవేశించాడు. గుహ అంతా చీకటిగా ఉంది. రాక్షసుడు లేడు. రాక్షసుని అవ్వ పడక కుర్చీలో కూర్చొని ఉంది. “ఎందుకు వచ్చావు?” అని అడిగింది. “రాక్షసుని తల వెంట్రుకలలో మూడు బంగారపు వెంట్రుకలు కావాలి,” అన్నాడు చతుర్దశి. “ఆ పని చాలా అపాయం అబ్బాయీ! వాడు తిరిగి ఇంటికి రాగానే ప్రయత్నం చేసి చూస్తాను,” అన్నది అవ్వ. ఈ మాట అని చతుర్దశిని చీమగా మార్చింది. తన చీర కుచ్చెళ్ళలో నక్కి ఉండమని చెప్పింది. “మంచిది అవ్వా! అలాగే నక్కి ఉంటాను. కాని పట్టణంలో అంగడి దగ్గర బావి ఎందుకు ఎండిపోయిందో, రెండవ పట్టణంలో బంగారుపళ్ళు కాసే చెట్టుకు ఆకులు కూడా ఎందుకు పుట్టడం లేదో, ఆ సరస్సు మీద పడవ నడిపే వాడికి ఆ కర్మ ఎప్పుడు తప్పుతుందో కూడా తెలుసుకొని చెప్పాలి అవ్వా!” అన్నాడు చతుర్దశి.

“అవి చాలా కష్టమైన సమస్యలయ్యా! సరే. మెదలకుండా ఉండి రాక్షసుడేమి చెపుతాడో విను,” అంది అవ్వ.

ఇంతలో సాయంత్రమైంది. చీకటి పడింది. రాక్షసుడు ఇంటికి తిరిగి వచ్చాడు. గుహలోపలికి రాగానే ఇల్లంతా వాసన చూడసాగాడు. “ఇక్కడ



నరవాసన వేస్తుందేమిటి?" అన్నాడు. గుహలో సామానంతా అటుఇటు లాగి చూశాడు. అవ్వకోపంతో అన్నది: "సామానంతా సర్దిపెట్టాను. ఎందుకు అన్నీ తలకిందులు చేస్తావు?" ఈ మాట విని రాక్షసుడు తృప్తిపడ్డాడు. అవ్వ ఒడిలో తలపెట్టి నిద్రపోయాడు. రాక్షసుడు గురక పెట్టడం చూసి అవ్వ అతని తలవెంట్రుక ఒకటి లాగింది. "అబ్బ! ఏమిటదీ?" ఉలిక్కిపడి అన్నాడు రాక్షసుడు.

"ఏమీలేదు నాయనా! నాకేదో పాడుకల వచ్చింది. కలవరిస్తూ నీ జుట్టు పట్టుకొన్నాను. ఆ పట్టణంలో అంగళ్ళ దగ్గర ఉన్న బావి ఎండిపోయినట్టు కల వచ్చింది నాయనా! ఎందుకనో?" అన్నది అవ్వ.

"ఔను, ఔను... ఎండిపోయింది. అది కనుక్కోలేక వాళ్ళు నానా తిప్పలు పడుతున్నారు. బావిలో చిన్న బండ ఉంది. ఆ బండ కింద జల ఉంది. జల రాకుండా ఒక గోదురుకప్ప బండ కింద కూర్చొని ఉంది. దాన్ని చంపివేస్తే సరి, సరిపోతుంది," అంటూ నిద్రమత్తుతో ఆవలించాడు రాక్షసుడు.

ఈ మాట చెప్పి మళ్ళీ గురకపెట్టి నిద్రపోయాడు. అవ్వ మళ్ళీ ఒక వెంట్రుక లాగింది. "నీకేమి వచ్చింది?" అని కోపంతో అరిచాడు రాక్షసుడు. "కోపపడకు నాయనా! నిద్రలో నీ జుట్టు పట్టుకొన్నాను కాబోలు! ఒక రాజ్యంలో పూర్వం ఒక చెట్టు బంగారుపళ్ళు కాస్తున్నట్లూ, ఇప్పుడు దానిమీద ఒక ఆకుకూడా పుట్టకుండా ఉన్నట్లు కలవచ్చింది నాయనా! కారణం ఏమిటో!" అని అవ్వ అన్నది. "ఔను! ఔను! అది వాళ్లకు తెలిస్తేగా? ఆ చెట్టు వేళ్ళను ఒక ఎలుక రోజూ కొరికి వేస్తున్నది. దాన్ని చంపితే సరిపోతుంది," రాక్షసుడు ఆవలిస్తూ ఈ మాట అని మళ్ళీ గురకపెట్టి నిద్రపోయాడు. మళ్ళీ అవ్వ రాక్షసుడి వెంట్రుక లాగింది. రాక్షసునికి ఈ సారి చాలా కోపం వచ్చింది. అవ్వ మంచిమాటలు చెప్పి కోపం చల్లార్చింది. అన్నది కదా... "ఈసారి చాలా విచిత్రమైన కల వచ్చింది నాయనా! ఒక పెద్ద సరస్సు. ఆ సరస్సు మీద పడవ నడిపేవాడు ఉన్నాడు. ఎప్పుడూ పడవ అటూ ఇటూ నడపడమే వాడి పని. పాపం! వాడికి ఆ శాపం ఎందుకు వచ్చిందో! అది తీరే ఉపాయం లేదేమో!"

"వాడొక బుద్ధి తక్కువ వాడు. చేతిలో తెడ్డు ఇంకెవరికైనా ఇచ్చి వేస్తే అతని శాపం తీరిపోతుంది. అప్పటినుండి తెడ్డు తీసుకొన్నవాడికి ఆ పీడ పట్టుకుంటుంది. ఇకనన్నా నిద్రపోనీ," అంటూ రాక్షసుడు గురక పెట్టి నిద్రపోయాడు.

తెల్లవారగానే రాక్షసుడు లేచి వెళ్ళిపోయాడు. అవ్వ చతుర్దశిని మళ్ళీ మనిషిగా మార్చింది. మూడు బంగారపు వెంట్రుకలు ఇచ్చింది. రాక్షసుడు చెప్పిన సమాధానాలు మళ్ళీ జ్ఞాపకం చేసింది. అతన్ని వెంటనే వెళ్ళమని అక్కడనుంచి పంపించింది.

చతుర్దశి మళ్ళీ పడవవాడి దగ్గరకు వచ్చాడు. పడవ వాడు తన ప్రశ్నకు సమాధానం చెప్పమన్నాడు. "ముందు నన్ను అవతలి ఒడ్డుకు చేర్చు, చెబుతాను," అన్నాడు చతుర్దశి. ఆ ప్రకారమే పడవవాడు అవతలి ఒడ్డుకు చేర్చాడు. చతుర్దశి పడవ దిగి, "ఈసారి నీ పడవ ఎక్కినవాళ్ళకు తెడ్డు చేతికిచ్చి పారిపో. అంతటితో నీ పీడ విరగడైపోతుంది," అని చెప్పి బయలుదేరాడు.

ఎండిపోతున్న బంగారు కాయల చెట్టు ఉన్న పట్టణానికి వచ్చాడు. "ఎలుక వేళ్ళను కొరుకుతున్నది. దాన్ని చంపండి. చెట్టు మళ్ళీ బంగారు కాయలు కాస్తుంది," అని అక్కడి వాళ్ళకు చెప్పాడు. వాళ్ళు సంతోషించి చతుర్దశికి ఎన్నో విలువైన బహుమతులిచ్చారు.

ఆ తర్వాత ఎండిపోయి ఉన్న బావి ఉన్న పట్టణానికి వచ్చాడు. ఏమి చెయ్యాలో చెప్పాడు. వాళ్ళు సంతోషించారు. అన్న ప్రకారం రెండు గాడిదల మీద బంగారం వేసి పంపించారు.

చతుర్దశి ఇల్లు చేరుకున్నాడు. అతని భార్య చాలా సంతోషించింది. జరిగిన కథ అంతా విని మరీ మరీ సంతోషించింది.

చతుర్దశి రాజు దగ్గరకు వెళ్ళి మూడు బంగారు వెంట్రుకలు అతనికి ఇచ్చాడు. రాజుకు చాలా సంతోషం కలిగింది. అతడు తెచ్చిన బంగారం అంతా చూసి సంతోషం పట్టలేక అన్నాడు: "నాయనా! ఈ బంగారం అంతా ఎక్కడ దొరికింది?" "సరస్సు ఒడ్డున దొరికింది. ఇంకా అక్కడ చాలా బంగారం ఉంది," అన్నాడు చతుర్దశి. "ఎటు వెళ్ళాలో చెప్పు. నేను కూడా వెళ్ళి బంగారం తెస్తాను," అన్నాడు రాజు. "నీ ఇష్టం వచ్చినంత తెచ్చుకోవచ్చు. సరస్సు మీద పడవ వాడు పడవను నడుపుతుంటాడు – ఆ పడవ ఎక్కి అవతల ఒడ్డుకు వెళ్ళాలి. అక్కడే ఉంది బంగారం," అన్నాడు చతుర్దశి.

రాజు బంగారం ఆశతో బయలుదేరాడు. సరస్సు దగ్గరకు వచ్చాడు. అవతలి ఒడ్డుకు చేర్చమని పడవవాడిని బతిమలాడాడు. పడవవాడు రాజును పడవలోకి ఎక్కనిచ్చాడు. తెడ్డు రాజు చేతికిచ్చాడు. ఒక్క గంతు వేసి ఒడ్డుకు దూకాడు. తాను చేసిన చెడు పనులకు ఫలితంగా రాజుకు పడవ తెడ్డు ప్రాప్తించింది.

"ఐతే ఇప్పటికి కూడా రాజు పడవ నడుపుతూనే ఉన్నాడా?" అని ఎవరైనా అడగవచ్చు. నడపకేం చేస్తాడు? అతని చేతిలోనుంచి తెడ్డు ఎవరు తీసుకొంటారు?

# నీలపు దీపం

ఒక రాజు సైన్యంలో ఒక సైనికుడు ఉండేవాడు. అతడు చాలాకాలం ఆ రాజు సైన్యంలో పనిచేశాడు. చివరకు ఒకనాడు రాజు అతన్ని సైన్యం నుంచి పంపించాడు. పంపేటప్పుడు జీతంగానీ, బహుమతిగానీ ఇవ్వలేదు. ఎలా బతకాలో సైనికునికి తోచలేదు. ఎటూ పాలుపోక దిగులుగా ఇంటిముఖం పట్టాడు. సాయంత్రం అయ్యేటప్పటికి ఒక దట్టమైన అడవి దగ్గరకు వచ్చాడు. దారివెంట నడుస్తూ పోగా కొంతదూరంలో దీపపు వెలుగు కనిపించింది. ఆ వెలుగు ఉన్నచోటికి వచ్చాడు. అక్కడ ఒక చిన్న గుడిసె ఉంది. గుడిసెలో ఒక ముసలి మంత్రగత్తె ఉంది. మరెవరూ లేరు. ఆ రాత్రి గుడిసెలో పడుకోనివ్వమనీ, కొంచెం అన్నం పెట్టమనీ అవ్వను సైనికుడు బతిమలాడాడు. అవ్వ వల్లకాదు పొమ్మన్నది. సైనికుడు ఆ మాటతో అవ్వను వదిలిపెట్టలేదు! మళ్ళీ మళ్ళీ బతిమలాడాడు. అవ్వ చివరకు ఒక షరతుమీద అతనికి అన్నం పెట్టటానికి, ఆ రాత్రి గుడిసెలో పడుకోనివ్వడానికి ఒప్పుకుంది. “నీమీద జాలి వేస్తున్నది. ఈ రాత్రి నీకు భోజనం పెట్టి ఇక్కడ పడుకోనిస్తాను. అయితే పొద్దున్నే నా తోటలో చెట్ల పాదులన్నీ తవ్విపెట్టాలి,” అని అవ్వ అన్నది. సైనికుడు ఒప్పుకొన్నాడు. ఆ రాత్రి అవ్వకు అతిథిగా ఉన్నాడు.

రెండవ రోజు ఉదయమే లేచి సైనికుడు చెట్లపాదులు తవ్వాడు. పనిపూర్తి అయ్యేసరికి సాయంత్రం అయింది. అవ్వ అతన్ని పంపించెయ్యాలని

చూసింది. కాని సైనికుడు, "అవ్వా! నేను చాలా అలసిపోయాను. ఈ రాత్రి ఇక్కడే ఉండనీ," అన్నాడు. అవ్వ వల్ల కాదు పొమ్మన్నది. కాని సైనికుడు వదిలిపెట్టలేదు. అవ్వను అదేపనిగా బతిమలాడాడు. ఆఖరుకు ఎలాగైతేనేమి అవ్వ ఒప్పుకుంది. రెండవ రోజు బండెడు కట్టెలు కొట్టి ఇస్తానంటే ఆ రాత్రి భోజనం పెట్టి, గుడిసెలో పడుకోనిస్తానన్నది. సైనికుడు అందుకు ఒప్పుకున్నాడు. ఆ రాత్రికూడా అతడు అవ్వ అతిథిగా ఉన్నాడు.

ఆ తెల్లవారి సైనికుడు కట్టెలు కొట్టటం మొదలుపెట్టాడు. పని పూర్తి అయ్యేటప్పటికి మళ్ళీ సాయంత్రం అయింది. "అవ్వా, నేను చాలా అలసిపొయ్యాను. ఇక నడవలేను. ఈ రాత్రికూడా నన్నిక్కడే ఉండనీ," అని బతిమలాడాడు. "కాని, సమీపంలో ఉన్న పాడుబడ్డ బావిలో ఒక నీలపుదీపం వెలుగుతూ ఉంది. రేపు దాన్ని తెచ్చి ఇస్తానంటే ఈ రాత్రి నిన్ను ఉండనిస్తాను," అని అవ్వ అన్నది. సైనికుడు అందుకు ఒప్పుకొని ఆ రాత్రికూడా అవ్వ అతిథిగా ఉన్నాడు.

ఉదయం కాగానే, అవ్వ అతన్ని మోకుకు కట్టి పాడుబడ్డ బావిలో దించింది. అవ్వ చెప్పినట్లుగానే బావిలో నీలందీపం ఉంది. సైనికుడు దీపం చేతపట్టుకొన్నాడు. మోకు లాగమని అవ్వకు సైగచేశాడు. అవ్వ మోకు పైకి లాగింది. బావి అంచుకు వచ్చాడు. అవ్వ దీపం అందించమన్నది. ముందు తాను బైటికి వస్తేగాని దీపం ఇవ్వనన్నాడు. అవ్వకు కోపం వచ్చింది. మోకు విడిచిపెట్టింది. సైనికుడు బావిలో పడ్డాడు, "చావు," అంటూ అవ్వ వెళ్ళిపోయింది.

పాపం! సైనికునికేమీ తోచలేదు. కొంచెంసేపు అలాగే బావి అడుగున బురదలో కూర్చొని ఆలోచించాడు. బైటికి వచ్చే ఉపాయం కనిపించలేదు. ఏమీ తోచక జేబులో ఉన్న పొగాకు చిలుము తీసి దీపం వెలిగించి కాలుస్తూ కూర్చున్నాడు. చిలుము పొగ బావి అంతా చుట్టలు చుట్టలుగా కమ్ముకొంది. ఆ పొగలో ఒక మరుగుజ్జు పుట్టాడు. "సైనికుడా! ఏమి కావాలి?" అని అడిగాడు.

"నీతో నాకేం పనయ్యా! పో! పో!" అన్నాడు సైనికుడు.



"నువ్వు నీలపుదీపం యజమానివి. నేను నీ బంటును. నీకేమి కావాలన్నా చేస్తాను," అన్నాడు మరుగుజ్జు.

అప్పుడు సైనికుడు ఆలోచించాడు. మరుగుజ్జుతో అన్నాడు: "అయితే, ముందు నన్ను బావి బయటికి వచ్చేట్లు చూడు."

సైనికుడిని మరుగుజ్జు బైటికి తెచ్చాడు. సైనికుడు నీలపుదీపాన్ని వదిలిపెట్టలేదు. మళ్ళీ మరుగుజ్జుతో అన్నాడు: "ఇంకొక ఉపకారం చేసిపెట్టు. ఆ అవ్వను నూతిలో పడవెయ్యి."

మరుగుజ్జు ఆ ప్రకారమే చేశాడు. అప్పుడు ఇద్దరూ కలిసి అవ్వ ఇల్లంతా వెతికి, దాచి ఉన్న సొమ్ములు, బంగారం, వెండి తీసుకున్నారు. సైనికుడు ప్రయాణం కాగానే, "నీకు నాతో పని ఉన్నప్పుడు ఈ నీలపుదీపంతో నీ పొగాకు చిలుము కాల్చు. వెంటనే నేను వస్తాను," అన్నాడు మరుగుజ్జు.

తనకు పట్టిన అదృష్టానికి సైనికుడు చాలా సంతోషించాడు. పక్క ఊరుకు వెళ్ళి ఒక అందమైన ఇల్లు అద్దెకు తీసుకొన్నాడు. తాను ఉండే

గది అందంగా చేయించాడు. ఆ గదిలో హాయిగా కాలుమీద కాలు వేసుకొని మరుగుజ్జుతో ఇలా అన్నాడు: "రాజు నాకు ఒక కానీ కూడా ఇవ్వకుండా వెళ్ళగొట్టాడు. వాడికి బుద్ధి చెప్పాలి. వెళ్ళి రాజుకూతురిని ఈ రాత్రి ఇక్కడకు తీసుకురా. నాకు దాసీగా ఉండి పనిపాటలు చేస్తుంది."

మరుగుజ్జు, "అది అంత సులభమైన పనికాదు," అంటూ వెళ్ళాడు. రాకుమారిని సైనికుని దగ్గరకు తెచ్చాడు.

రెండవనాడు తెల్లవారుఝామునే మరుగుజ్జు రాకుమారిని మళ్ళీ రాజుకోటలో చేర్చాడు. ఆనాడు రాకుమారి తండ్రి దగ్గరకు వెళ్ళి, "నాకు రాత్రి చిత్రమైన కల వచ్చింది. నన్నెవరో సైనికుని ఇంటికి తీసుకుపోయినట్లు, అక్కడ దాసీపనులు చేసినట్లు అనిపించింది," అన్నది. ఈ కల విని రాజు చాలా ఆశ్చర్యపోయాడు. "ఇది అంతా కల కాదు. ఇందులో ఏదో మాయ ఉంది. ఈ రాత్రి నిద్రపోయేటప్పుడు చెంగున బఠానీలు మూట కట్టుకొని, ఆ మూటకు చిన్న చిల్లి పెట్టు. నిన్నెవరైనా తీసుకుపోతే వెళ్ళినదారిలో బఠానీలు పడతాయి. అప్పుడు మనం దారి కనుక్కోవచ్చు. తర్వాత ఏం చెయ్యాలో అదే చేస్తాను," అన్నాడు రాజు. రాజు చెప్పినట్లు రాకుమారి చేసింది. ఈ ఉపాయం మరుగుజ్జు విన్నాడు. రెండవనాడు రాత్రి సైనికుడు రాకుమారిని తెమ్మని చెప్పినప్పుడు అన్ని వీధులలోనూ బఠానీలు చల్లి వచ్చాడు. తర్వాత రాకుమారిని తెచ్చాడు.

రెండవనాడు ఉదయమే రాకుమారి తండ్రితో "రాత్రి మరి ఒక కల వచ్చింది," అని చెప్పింది. రాజు బఠానీలు పడినదారి కనుక్కోవలసిందిగా భటులకు ఆజ్ఞ ఇచ్చాడు. భటులు వెళ్ళి చూస్తే అన్ని దారులలోనూ, అన్ని వీధులలోనూ బఠానీలు పడి ఉన్నాయి. ప్రజలు విచిత్రంగా చెప్పుకొంటూ బఠానీలు తీసుకొని తింటున్నారు.

రాజు ఈసారి కుమార్తెతో ఇలా అన్నాడు, "ఈసారి నీకాలి చెప్పు ఒకటి నీతో తీసుకుని వెళ్ళు. దాన్ని ఆ గదిలో విడిచిపెట్టిరా." మరుగుజ్జు ఈ విషయం కూడా విన్నాడు. సైనికుడు మళ్ళీ రాకుమారిని తీసుకురమ్మని చెప్పగానే, "ఈసారి నిన్ను నేను కాపాడలేను. రాజు నిన్ను తప్పకుండా

కనుక్కుంటాడు. చాలా ఆపద వస్తుంది," అన్నాడు. కాని సైనికుడు ఆ మాటలు పెడచెవిని పెట్టాడు.

"అయితే నువ్వు జాగ్రత్తపడి ఉదయం కాకముందే ఊరు విడిచి వెళ్ళిపోవాలి. లేకపోతే ఆపద తప్పదు," అని మరుగుజ్జు సలహా చెప్పాడు.

తండ్రి చెప్పిన ప్రకారమే రాకుమారి ఒక చెప్పు సైనికుడి గదిలో దాచింది. యథాప్రకారం మరుగుజ్జు ఉదయం కాకముందే రాకుమారిని కోటలో చేర్చాడు. ఉదయం కాగానే రాకుమారి తండ్రితో జరిగిన సంగతి చెప్పింది. రాజు భటులను పంపించాడు. భటులు చివరకు సైనికుడు ఉన్న గదిలో రాకుమారి చెప్పు కనిపెట్టారు. అయితే, భటులు రాకముందే సైనికుడు పారిపోయాడు. కాని, కొంతదూరం వెళ్ళిన తర్వాత ఇక ఎవరు వస్తారులే అనుకొని మెల్లగా నడుస్తూ పోతున్నాడు. ఇంతలో భటులు తరుముకుంటూ వచ్చి అతన్ని పట్టుకొన్నారు. తీసుకుపోయి జైలులో పడవేశారు. గొలుసులతో కట్టివేశారు. అన్నిటికంటే మించిన ఆపద ఏమిటంటే – సైనికుడు పారిపోయే హడావుడిలో తన బంగారం, నీలపుదీపం, అన్నీ వదిలివచ్చాడు. జేబులో ఒక బంగారు నాణెం మాత్రం ఉంది.

అతని దిగులు ఇంత అంత అని చెప్పడానికి వీలులేదు. విచారపడుతూ జైలు కటకటాలు పట్టుకొని నిలబడి ఉన్నాడు. ఇంతలో అతనికి తెలిసిన సైనికుడు ఒకడు అటు వెళుతూ ఉన్నాడు. అతన్ని పిలిచాడు, "మిత్రమా! నాకు ఒక చిన్న ఉపకారం చేసి పెట్టు. నీకొక బంగారు నాణెం ఇస్తాను. నేను అద్దెకు ఉన్న ఇంట్లో ఒక మూట వదిలిపెట్టి వచ్చాను. దాన్ని తెచ్చి ఇచ్చావంటే నీకు ఇంకా కొన్ని నాణాలు ఇస్తాను," అన్నాడు. ఈ కొంచెం పనికే ఒక బంగారు నాణెం వస్తుందికదా అని సంతోషించి ఆ సైనికుడు వెంటనే వెళ్ళి అతనిమూట తెచ్చి ఇచ్చాడు. బంగారం, నీలపుదీపం రెండూ దానిలోనే ఉన్నాయి.

మన సైనికుడు నీలపుదీపంతో చిలుముగొట్టం వెలిగించాడు. వెంటనే మరుగుజ్జు వచ్చాడు: "నీవేమాత్రం భయపడవద్దు. ధైర్యంగా ఉండు. కాని దీపాన్ని విడిచిపెట్టకు," అని సలహాచెప్పి మాయమయ్యాడు.

రెండవనాటి ఉదయం రాజు సైనికుని నేరాన్ని విచారించి, అతన్ని నేరస్థుడుగా నిర్ణయించి, ఉరిశిక్ష విధించాడు. ఊరివెలుపల ఉన్న ఉరిచెట్టుకు వేలాడతీయమని ఆజ్ఞ ఇచ్చాడు.

దర్బారునుంచి భటులు తీసుకుపోయేటప్పుడు సైనికుడు ఇలా అన్నాడు: “మహారాజా! నాకొక చిన్న కోరిక ఉంది. చచ్చిపోయేముందు ఆ కోర్కె తీర్చండి,” అని ప్రార్థించాడు.

“ఏమిటి ఆ కోరిక?” అన్నాడు రాజు.

“నన్ను చిలుముగొట్టం కాల్చుకోనివ్వండి ప్రభూ!” అన్నాడు సైనికుడు.

“ఒకటి కాదు, రెండు కాల్చుకో,” అని రాజు అన్నాడు. సైనికుడు చిలుముగొట్టం తీసి నీలపుదీపంతో వెలిగించాడు. వెంటనే మరుగుజ్జు వచ్చాడు. “ఏమిటి ఆజ్ఞ?” అన్నాడు.

“వీళ్ళనందర్నీ చంపివెయ్యి. రాజును మాత్రం మూడు ముక్కలుగా నరుకు,” అన్నాడు సైనికుడు. మరుగుజ్జు రాజుగారి భటులమీదికి ఉరికాడు. “చచ్చాంమురా భగవంతుడా!” అని కేకలు వేస్తూ వాళ్ళంతా తలొక వైపుకి పరుగెత్తారు. రాజు, “నన్ను కనికరించు బాబూ!” అని ప్రాధేయపడ్డాడు. “నన్ను విడిచిపెడితే సైనికునికి రాకుమార్తెనిచ్చి పెళ్ళి చేస్తాను. నా అనంతరం రాజ్యం సైనికునికి ఇస్తాను,” అన్నాడు. సైనికుడు అందుకు ఒప్పుకొని రాజును విడిచిపెట్టాడు. రాకుమారిని మహావైభవంగా పెళ్ళాడి సైనికుడు సుఖంగా ఉన్నాడు. రాజు అనంతరం తానే రాజై రాజ్యం చేస్తున్నాడు.

# పిల్లితోలు పిల్ల

పూర్వకాలంలో ఒక గొప్ప రాజు ఉండేవాడు. అతని భార్య చాలా అందగత్తె. అంత అందమైన ఆమె ప్రపంచంలో ఎక్కడా పుట్టలేదు. ఆమె తల వెంట్రుకలు బంగారపు వెంట్రుకలు.

చావు దగ్గరకు వస్తే అందం అడ్డుపడుతుందా? ఆ అందాల రాణి జబ్బు పడింది. చావు దగ్గరకు వచ్చింది. భర్తను దగ్గరకు పిలిచి, "నేను చచ్చిపోతున్నాను. మళ్ళీ మీరు పెళ్ళి చేసుకోదలచుకొంటే, నా అంత అందం, నాలాగా బంగారు తలవెంట్రుకలు ఉన్న అమ్మాయిని తప్ప మరెవ్వరినీ పెళ్ళాడనని నా చేతిలో చెయ్యి వెయ్యండి," అన్నది. భార్య చచ్చిపోతున్నదనే విచారంలో రాజు ఆమె ఇష్టప్రకారమే చేతిలో చెయ్యివేసి ఒట్టు పెట్టుకొన్నాడు. రాణి సుఖంగా కళ్ళు మూసుకొని శాంతంగా చచ్చిపోయింది.

చాలాకాలం గడిచింది. రాజు భార్యపోయిన విచారంలో ఉండి మళ్ళీ పెళ్ళి సంగతి ఆలోచించనే లేదు. కాలం ఎంత పెద్దగాయాన్ని అయినా మాన్పుతుంది. ఇంకా కొంతకాలం గడిచింది. కొంత దుఃఖం మాసిపోయింది, ఐనా పెళ్ళి చేసుకోవాలని కోర్కె కలగలేదు. ఒకనాడు రాజుగారి మంత్రులు, సలహాదార్లు వచ్చి, "మహారాజా! మాకు రాణి కావాలి. మీరు పెళ్ళి చేసుకోవాలి," అని అడిగారు. రాజు ఆలోచించాడు. చచ్చిపోయిన రాణికి ఇచ్చిన మాట జ్ఞాపకం తెచ్చుకొన్నాడు. ఆమె అంతటి అందగత్తె దొరికితే పెళ్ళి చేసుకొంటాను అన్నాడు. మంత్రి దేశదేశాలకు గూఢచారులను పంపించాడు. అంత అందం

గల రాకుమారి ఎక్కడా కనిపించలేదు. ఒకవేళ కనిపించినా బంగారు వెంట్రుకలు గల రాకుమారి మాత్రం కనిపించలేదు. గూఢచారులు తిరిగివచ్చి ఎక్కడా బంగారు తలవెంట్రుకలు గల రాకుమారి లేదని చెప్పారు.

రాజుకు ఒక కూతురు ఉంది. ఆ అమ్మాయి ఈపాటికి పెరిగి పెద్దదయింది. తల్లి అంత అందంగా తయారయింది. తల్లికి ఉన్నట్లుగానే ఆమెకు కూడా బంగారు తల వెంట్రుకలున్నాయి. రాజు ఆమెను చూశాడు. సరిగా ఆమె తల్లిలాగానే ఉంది. ఇంకేముంది? రాజు తలలో ఒక వింత ఆలోచన పుట్టింది. మంత్రులను, సలహాదారులను రప్పించాడు. "నా కూతురును పెళ్ళి చేసుకొంటే ఈ సమస్య తీరిపోతుంది. మూడుమూర్తులా నా కూతురు చచ్చిపోయిన నా భార్య లాగానే ఉంది. ప్రపంచంలో ఎక్కడ వెదికినా నాకు పెళ్ళికూతురు దొరకకపోయె, మీరేమో రాణి కావాలని పోరుపెడుతూ ఉన్నారు," అన్నాడు. ఈ మాటలు విని మంత్రులు, సలహాదార్లు నివ్వెరపోయారు. "ఇంత పాపం ఎక్కడైనా ఉందా? కూతురును తండ్రి పెళ్ళి చేసుకోవడమా? రామ! రామ!" అన్నారు. తండ్రి మాటలు విని రాకుమారి కూడా నివ్వెరపోయింది. త్వరలో తన అభిప్రాయం మార్చుకోకపోతాడా అనుకున్నది. కాని ఎందుకైనా మంచిదని తండ్రితో ఇలా అన్నది: "నాకు కావలసిన వస్తువులు ఎవరు తెస్తారో వాళ్లను పెళ్ళి చేసుకొంటాను. మూడు రకాల చీరలు కావాలి. ఒకటి సూర్యునిలాగా మెరిసే బంగారపుచీర, రెండవది చంద్రునివంటి తెల్లని వెండిచీర, మూడవది చుక్కలలాగా తళతళలాడే చీర. ఈ మూడింటికి తోడుగా వెయ్యిరకాల జంతువులు చర్మంతో చేసిన పచ్చడం కావాలి." ఇక తండ్రి ఈ మాట మళ్ళీ నోటికి తెచ్చుకోడని రాకుమారి అనుకొన్నది. కాని, రాజు పట్టుదల మానలేదు. తన రాజ్యంలో ఉన్న నేర్పరులైన సాలీలను రప్పించాడు. మూడు రకాల చీరలు నేయించాడు. తన వేటగాళ్ళనందరినీ అడవి అడవికి పంపి ప్రపంచంలో ఉన్న అన్నిరకాల జంతువులను చంపించి, వెయ్యిరకాల చర్మంతో పచ్చడం తయారు చేయించాడు.

మూడురకాల చీరలు, పచ్చడమూ రాజు రాకుమారికి పంపించాడు.

అర్ధరాత్రివేళ అందరూ నిద్రపోతుండగా రాకుమారి లేచింది. తన ఆభరణాలలో ఉంగరం, హారం, రవ్వలపుడక ఈ మూడింటిని మాత్రం తీసుకొన్నది. సూర్యుని చీర, చంద్రుని చీర, చుక్కల చీర చిన్నపెట్టెలో పెట్టి, చేత పట్టింది. వెయ్యి జంతువుల పచ్చడం కప్పుకొంది. చేతులకు, ముఖానికి నల్లరంగు పూసుకొంది. ఎవ్వరికంటా పడకుండా కోట వెలుపలికి వచ్చింది. వేటగాడు తరుముతున్న లేడిలాగా వణికిపోతూ భగవంతుడిని ప్రార్థిస్తూ రాకుమారి ఆ రాత్రంతా గబగబా నడిచి తండ్రి రాజ్యం దాటి మరొక రాజ్యంలో ఒక అడవి చేరింది. సూర్యోదయమైంది. రాకుమారి అలసిపోయింది! ఇక నడవలేక ఒక పెద్ద చెట్టు తొర్రలో పడుకొని మధ్యాహ్నం వరకు నిద్రపోతూ ఉంది.

ఆ అడవి ఉన్న రాజ్యం ఏలే రాజు, ఆ మధ్యాహ్నం ఆ అడవికే వేటకు వచ్చాడు. కుక్కలు రాకుమారిని పసిగట్టి చెట్టుతొర్ర దగ్గరకు వచ్చాయి. వాసన చూస్తూ, చెట్టుచుట్టూ తిరిగాయి. "ఆ చెట్టు దగ్గరకు వెళ్ళండి. అక్కడ ఏదో జంతువు ఉన్నట్లుంది," అని రాజు వేటగాళ్ళతో అన్నాడు. వేటగాళ్ళు చెట్టు దగ్గరకు వచ్చారు. రాకుమారిని చూశారు. రాజుదగ్గరకు వెళ్ళి, "ఆ చెట్టు తొర్రలో చాలా వింతజంతువు ఉంది. దాని చర్మం వెయ్యి రకాలుగా ఉంది, ఆ జంతువు నిద్రపోతున్నది," అన్నారు. "అంత వింత జంతువు అంటున్నారు. కాబట్టి ప్రాణంతో పట్టుకోండి. కోటకు తీసుకుపోదాం," అని రాజు అన్నాడు. వేటగాళ్ళు వచ్చి రాకుమారిని పట్టుకొన్నారు. రాకుమారి మేలుకొని చూసింది, ఆమెకు చాలా భయం పుట్టింది. "నన్ను కనికరించండి. తల్లి, తండ్రి లేని పేదపిల్లను. నన్ను మీతో తీసుకునివెళ్ళండి," అని రాకుమారి వాళ్ళను బతిమలాడింది. "తప్పకుండా తీసుకుపోతాం. పిల్లితోలు పిల్లా! రాజుగారి వంట ఇంట్లో పనిచేద్దువుగాని," అని వాళ్ళు అన్నారు. బండి ఎక్కించి, కోటకు తీసుకు పోయారు. వంట ఇంటి పక్కన ఉన్న ఒక చిన్న చీకటిగది చూపించి, "ఇదిగో పిల్లా! ఇది నీ గది. ఇందులో ఉండు," అన్నారు. వంట ఇంటి చాకిరి అంతా ఆ పిల్లమీద పెట్టారు. కట్టెలు తీసుకురావడం, నీళ్ళు

తీసుకురావడం, పొయ్యి వెలిగించడం, కూరలు తరగడం, ఇల్లు ఊడ్చడం, బియ్యం బాగుచెయ్యడం, పొయ్యిలో బూడిద ఎత్తిపొయ్యటం, అంట్లు కడగడం – ఇలాంటి మురికిపనులన్నీ ఆ అమ్మాయి చేస్తూ ఉంది. పిల్లితోలు పిల్ల పాపం తనలో తాను ఇలా అనుకొంటుండేది. 'ఓ అందాల రాకుమారీ! నీకెంత కర్మపట్టింది? నీ బతుకు ఏమౌతుంది?' ఇలా తన్ను తాను ప్రశ్నించుకొంటూ విచారపడుతుండేది.

ఇలాగే కొంతకాలం జరిగింది. ఒకనాటి రాత్రి కోటలో పెద్ద విందు ఏర్పాటయింది. కోట అంతా చక్కగా అలంకరించారు. ఎక్కడ చూసినా మహా సందడిగా ఉంది. పిల్లితోలు పిల్ల వంటగత్తె దగ్గరకు వెళ్ళి, "కొంచెంసేపు మేడమీదికి వెళ్ళి అదేమిటో చూసిరానా? తలుపుచాటున ఉండి చూస్తాలే. ఎవరికీ కనపడనుగా!" అని అడిగింది. "సరే వెళ్ళు. అరగంటలో మళ్ళీ రావాలి సుమా!" అని వంటగత్తె అంది. పిల్లితోలు పిల్ల దీపం చేతబట్టుకొని తన గది లోపలికి వెళ్ళింది. వెయ్యిచర్మాల పచ్చడం తీసి వేసింది. చేతులు, ముఖం శుభ్రంగా కడుగుకొంది. దీపపు కాంతిలో ఆమె ముఖం, మబ్బుల చాటునుండీ బైటపడ్డ సూర్యునిలాగా ప్రకాశించింది. ఆమె మూటవిప్పి సూర్యునిచీర కట్టుకొన్నది. విందుకు వెళ్ళింది. ఆమెను చూసి అందరూ తప్పుకొని దారి ఇచ్చారు. ఎవరో రాకుమారి అయి ఉంటుందనుకొన్నారు. రాజు ఎదురు వచ్చి ఆమె చెయ్యి పట్టుకొని తీసుకునివెళ్ళాడు. తన పక్కన కూర్చోబెట్టాడు. విందు అయిపోయింది. ఆమె రాజుకు నమస్కరించింది. రెప్పపాటులో ఎటో వెళ్ళిపోయింది. ఎక్కడకు పోయిందో ఎవ్వరికీ తెలియలేదు.

అసలు జరిగింది ఏమంటే, ఆ అమ్మాయి ఎకాయకి తన గదికి వచ్చింది. ముఖానికి, చేతులకు మళ్ళీ రంగు పూసుకొంది. సూర్యుని చీర విప్పి మాసిన తన దుస్తులు వేసుకొంది. పచ్చడం కప్పుకున్నది. మళ్ళీ పిల్లితోలు పిల్లలాగా తయారయింది. వంట ఇంటికి పరుగెత్తింది. "రాజుగారికి పాలు కలిపి తీసుకుని వెళ్ళి పెట్టిరా!" అని వంటగత్తె ఆ అమ్మాయికి హుకుం జారీ చేసింది. ఆ పిల్ల చటుక్కున మళ్ళీ తన గది



లోపలికి వచ్చి ఉంగరం తీసుకొని వంటగదిలోపలికి వెళ్ళింది. పొయ్యిమీద పాలు దించి, బంగారు గిన్నెలో పోసి, పంచదార కలిపింది. ఉంగరం గిన్నెలో వేసింది. రాజుగారి పడక దగ్గర పెట్టి వచ్చింది. రాజు వచ్చి పాలు తాగాడు. గిన్నె అడుగున ఉంగరం చూసి వంటగత్తెకు కబురు పంపాడు.

రాజుగారు రమ్మన్నారనగానే, వంటగత్తె ప్రాణాలు నిలువునా లేచిపొయ్యాయి. "ఏమే పిల్లా! పాలలో వెంట్రుకలేమీ పడలేదు కదా!" అని పిల్లితోలు పిల్లను అడిగి వెళ్ళింది. "ఈ పాలు కలిపిందెవరు?" అని రాజు అడిగాడు. "చిత్తం. నేనేనండి," అన్నది వంటగత్తె. "నిజం చెప్పు," అన్నాడు రాజు. "చిత్తం, నేను కాదండి! పిల్లితోలు పిల్ల కలిపిందండి!" అన్నది వంటగత్తె. "ఐతే ఆ పిల్లను పంపించు," అన్నాడు రాజు. పిల్లితోలు పిల్ల రాజు దగ్గరకు వచ్చింది. పాలు తనే కలిపానని, ఆ పిల్ల ఒప్పుకుంది. "నువ్వెవరవి?" అన్నాడు రాజు. "తల్లీ, తండ్రీ లేని పేదపిల్లను," అన్నది ఆ పిల్ల. "ఇక్కడ ఏమి చేస్తున్నావు?" అని రాజు అడిగాడు. "వంట ఇంట్లో పనిగత్తెగా ఉన్నాను," అని ఆ పిల్ల బదులు చెప్పింది. "గిన్నెలో ఉంగరం వేసింది నువ్వేనా?" అని రాజు అడిగాడు. ఆ పిల్ల తనకు తెలియదంటే తెలియదన్నది. "సరే, వెళ్ళు," అన్నాడు రాజు.

కొంతకాలానికి మళ్ళీ కోటలో విందు జరిగింది. విందు చూడడానికి వెళ్ళనివ్వమని మునుపటిలాగే పిల్లితోలు పిల్ల వంటగత్తెను అడిగింది. "అరగంటలో తిరిగిరావాలి సుమా! రాజుగారికి పాలుకలిపి ఇవ్వాలి," అన్నది వంటగత్తె. పిల్లితోలు పిల్ల తన గదిలోపలికి వెళ్ళి చేతులు ముఖం కడుక్కున్నది. ఈసారి చంద్రుని వంటి వెండిచీర కట్టుకుంది. అందరూ ఆమెని చూసి ఎవరో రాకుమారి అనుకొన్నారు. రాజు ఎదురు వచ్చి చేయిపట్టుకొని తీసుకునిపోయి, తన పక్కన కూర్చోబెట్టుకున్నాడు. విందయి పోగానే, ఆ పిల్ల చల్లగా తప్పుకొని తన గది చేరుకొంది. మళ్ళీ మామూలు పిల్లితోలు పిల్ల లాగా తయారై వంటఇంటికి వెళ్ళింది. పాలుకలిపి, బంగారు గిన్నెలో పోసి, తన బంగారు కంఠహారం దానిలో వేసింది. రాజుగారి పడక గది దగ్గర పాలగిన్నె పెట్టి వచ్చింది. రాజువచ్చి, పాలు తాగి, గిన్నె అడుగున ఉన్న బంగారు గొలుసును చూసాడు. వంటగత్తెను పిలిపించి అడిగాడు. పాలు తను కలపలేదనీ, పిల్లితోలు పిల్ల కలిపిందనీ వంటగత్తె చెప్పింది. రాజు పిల్లితోలు పిల్లను పిలిపించాడు. ఎంత అడిగినా ఆ పిల్ల తనకు తెలియదంటే తెలియదన్నది.

మళ్ళీ కొంతకాలానికి మూడవ విందు జరిగింది. పిల్లితోలు పిల్ల వంటగత్తెకు చెప్పి, ఈసారి నక్షత్రాల చీర కట్టుకొని విందుకు వెళ్ళింది. రాజు ఆమె అందం చూసి మురిసిపోయాడు. ఆమెను చెయ్యిపట్టుకొని తీసుకునివచ్చి తన పక్కనే కూర్చోబెట్టాడు. ఈసారి ఎలాగయినా ఈ రాకుమారి ఎవరో తెలుసుకోవాలనుకున్నాడు. గాయకులచేత పాడిస్తూ, నాట్యగత్తెల చేత నృత్యం చేయిస్తూ రాజు చాలా కాలయాపన చేయించాడు. ఆ పిల్ల నృత్యం చూస్తూ ఉండగా, ఆమె చెయ్యి పట్టుకొని, "నీ చేతులెంత అందంగా ఉన్నాయి?" అన్నాడు. ఆ పిల్ల నృత్యం చూస్తూ ఆ సంతోషంలో రాజు మాటలు వినిపించుకోలేదు. ఇదే సమయమని రాజు ఆమె చిటికెన వేలికి ఒక ఉంగరం తొడిగి ఏమీ ఎరగనట్లు కూర్చున్నాడు. విందు పూర్తి అయ్యేటప్పటికి అర్ధరాత్రి అయింది. ఈసారి రాజు ఆమె పోతుండగా జాగ్రత్తగా చూస్తున్నాడు. కాని, రాజు అటు తిరిగి ఎవరితోనో మాట్లాడే సమయం చూసి రాకుమారి మెల్లగా అక్కడనుంచి తప్పించుకొని వచ్చి, తన గదికి చేరింది. చాలా పొద్దుపోయినందుకు వంటగత్తె కోపపడుతుందేమో అనే భయంతో గబగబా ముఖానికి చేతులకు రంగు పూసుకొని, చుక్కలచీరె విప్పకుండానే, పచ్చడం కప్పుకొని వంటఇంటికి పరుగెత్తింది. త్వరత్వరగా బంగారుగిన్నెలో పాలు కలిపి, అందులో రవ్వల ముక్కుపుడక వేసి, రాజుగారి పడక దగ్గర పెట్టి వచ్చింది. ఆ అమ్మాయి ఈ గాభరాలో ఒక వేలికి సరిగ్గా రంగు పూసుకోలేదు. ఆ వేలు తెల్లగా కనపడుతూనే ఉంది.

రాజు పాలు తాగి, గిన్నె అడుగున ఉన్న రవ్వల ముక్కపుడక చూశాడు. పిల్లితోలు పిల్లను పిలిపించాడు. తాను విందులో తొడిగిన ఉంగరం ఆ పిల్ల చిటికెన వేలుకు ఉండడం చూశాడు. రంగు పూయని తెల్లని వేలు కూడా చూశాడు. రాజు ఆ పిల్ల చెయ్యి పట్టుకొన్నాడు. చెయ్యి విడిపించుకొని పోవాలని ఆ పిల్ల ప్రయత్నించింది. పచ్చడం ఒక పక్కకు తొలిగింది. చుక్కలచీర తళతళ మెరిసింది. రాజు పచ్చడం చించిపారేశాడు. ఇప్పుడు రాకుమారి నిజస్వరూపం బయటపడింది. ఆమె బంగారు వెంట్రుకలు రాజు చూశాడు. ఆమె అందం చూశాడు. ఇక రాకుమారి పూర్వంలాగా

నటించడానికి వీలు లేకపోయింది. ముఖం, చేతులు కడుగుకొని వచ్చి రాజు ముందు నిలిచింది. ప్రపంచంలోకెల్లా అందమైన రాకుమారిని రాజు తనివితీరా చూసి, “నిన్ను నేను పెళ్ళి చేసుకొంటాను. ఇక నన్ను విడచిపెట్టి నువ్వు వెళ్ళలేవు,” అన్నాడు. పెళ్ళి చాలా వైభవంగా జరిగింది. మళ్ళీ పెద్ద విందు కూడా జరిగింది.

# తోటకూర

ఒకనాడు ఒక వేటగాడు ఒక అడవిలో గబగబా నడచి వెళుతున్నాడు. ఒక ముసలమ్మ అతనికి ఎదురుగా వచ్చి, “బాగున్నావా నాయానా? చాలా హుషారుగా ఉన్నావే! నాకు చాలా ఆకలిగా ఉంది. తినటానికి ఏమైనా ఉంటే ఇచ్చిపో నాయనా!” అని అడిగింది. పాపం ఆ ముసలమ్మను చూసి వేటగాడు జాలిపడ్డాడు. తాను తెచ్చుకున్న అన్నంమూట ఆమెకిచ్చాడు. వెళ్ళబోతుండగా ముసలమ్మ అతని చెయ్యి పట్టుకొని ఆపింది, “నేనొక సంగతి చెప్తాను విను నాయనా! నువ్వు నాకు మేలు చేశావు కదా! నేను నీకొక మేలు చేస్తాను. విను. ఈ దారినే వెళ్ళు. కొంచెం దూరం వెళ్ళిన తర్వాత ఒక చెట్టు కనపడుతుంది. ఆ చెట్టుమీద తొమ్మిది పిట్టలు ఒక దుప్పటిమీద కూర్చొని ఉంటాయి. ఆ పిట్టల మధ్య బాణం వదులు. ఒక పిట్ట చచ్చి పడిపోతుంది. దుప్పటికూడా దానితోనే పడుతుంది. దుప్పటి తీసుకో. అది ఏమి దుప్పటి అనుకొన్నావు? వరాల దుప్పటి. దాన్ని కప్పుకొని ఎక్కడకు వెళ్ళాలని కోరితే అక్కడకు వెళ్ళవచ్చు. చచ్చిపోయిన పిట్టను కోసి దాని గుండెకాయ తీసి దగ్గర ఉంచుకో. ఆ గుండెకాయ నీ దగ్గర ఉన్నంతకాలం ప్రతిరోజూ ఉదయం లేవగానే నీ తలగడ దిండు కింద ఒక బంగారపు నాణెం ఉంటుంది.’’ ఈ మాటలు చెప్పి ముసలమ్మ వెళ్ళిపోయింది.

వేటగాడు ముసలమ్మ దగ్గర సెలవు తీసుకొని బయలుదేరాడు.

'ముసలమ్మ చెప్పిందంతా జరిగితే ఇంకా కావలసిందేముంది?' అనుకొంటూ నడుస్తున్నాడు. వంద గజాలైనా నడిచాడో లేదో, ఒక చెట్టుమీద పిట్టలరెక్కల చప్పుడు వినిపించింది. వేటగాడు పైకి చూశాడు. ఆ చెట్టు కొమ్మ మీద తొమ్మిది పిట్టలు ఉన్నాయి. అరుస్తూ, పోట్లాడుకొంటూ, ఒకదాన్ని ఒకటి అటు ఇటూ తోస్తూ ఒక దుప్పటిని ముక్కులతోనూ, కాళ్ళతోనూ లాగుతున్నాయి. ఆ దుప్పటి కోసమే అవి కీచులాడుకొంటున్నాయని అతడు అనుకొన్నాడు. సరిగ్గా ముసలమ్మ చెప్పినట్లుగా జరిగిందనుకొన్నాడు. ఆ పిట్టల మధ్యగా బాణం వదిలాడు. పిట్టల ఈకలు రాలి అటు, ఇటు పడ్డాయి. కీచుకీచుమంటూ పిట్టలన్నీ ఎగిరిపోయాయి. ఒక పిట్టమాత్రం చచ్చి కింద పడింది. దానితోపాటు దుప్పటికూడా పడింది. వేటగాడు ముసలమ్మ చెప్పినట్లే చేశాడు. పిట్టను కోసి గుండెకాయ తీసుకొన్నాడు. దుప్పటి తీసుకొన్నాడు. ఇంటికి వెళ్ళాడు.

మరునాటి ఉదయం లేవగానే వేటగాడు దిండు ఎత్తి చూశాడు. ఒక బంగారు నాణెం మెరుస్తూ కనబడింది. రెండవనాడూ అలాగే జరిగింది. మూడవనాడు కూడా అలాగే జరిగింది. రోజూ అలాగే జరగుతూ ఉంది. కొంతకాలానికి అతని ఇంట్లో బంగారం కుప్పలు పడ్డాయి. ఒకనాడు అతను, "ఈ బంగారమంతా నేనేం చేసుకోను? ఇంటిలో ఎంతకాలం ఉన్నా రోజూ పెరగడమే కాని, తరగడం లేదాయె! సరదాగా దేశంమీద యాత్రకి బయలు దేరతాను," అనుకొన్నాడు.

ఇలా ఆలోచించి, బంగారం సంచీ, విల్లు భుజాన తగిలించుకొని బయలు దేరాడు. ఒకనాడు అడవి మార్గాన వెళుతూ ఉండగా, ఆ అడవి చివర ఒక కోట, దానిచుట్టూ చక్కని పచ్చిక బయలు కనిపించింది. వేటగాడు కోటవైపు నడిచాడు. కోటగుమ్మం ముందొక ముసలమ్మ ఉంది. ఆ ముసలమ్మను ఆనుకొని ఒక అందమైన అమ్మాయి ఉంది. వాళ్ళు నాలుగువైపులా చూస్తున్నారు. వేటగాడు రావడం ముసలమ్మ చూసింది. ఆ ముసలమ్మ ఎవరనుకొన్నారు? గొప్ప మంత్రగత్తె. కూతురుతో ముసలమ్మ అన్నదికదా, "అటు చూడమ్మా! వేటాడే కుర్రవాడు ఇటే వస్తున్నాడు. అతని



దగ్గర చాలా విచిత్రమైన వస్తువులున్నాయి. వాటిని మనం కాజెయ్యాలి. అవి మనకైతే ఎక్కువ పనికి వస్తాయి. అతనికి ఎందుకవి? అతని దగ్గర ఒక పిట్ట గుండెకాయ ఉంది. అది ఉండడం వల్ల ప్రతి ఉదయం అతని తలగడ దిండు కింద ఒక బంగారు నాణెం పుడుతుంది.” ఇంతలో వేటగాడు వాళ్ళ దగ్గరకు వచ్చాడు. ‘పొద్దుట నుంచి నడుస్తూనే ఉన్నాను గాని, ఈ రాత్రికి ఈ కోటలో విశ్రాంతి తీసుకొంటాను. వాళ్ళు ఎంత డబ్బు కావాలంటే అంత ఇస్తాను,’ అనుకొన్నాడు. కాని నిజమైన కారణం అది కాదు. ఆ అందమైన అమ్మాయి మీద అతని కళ్ళు పడ్డాయి.

కోట దగ్గరకు రాగానే ఆ ఇద్దరు ఆడవాళ్ళూ అతనిని ఆదరించి లోపలికి తీసుకుపోయారు. వేటగాడు ఆ అమ్మాయి ప్రేమలో పడి, ఆమె కళ్ళవంకే కన్నార్పకుండా చూస్తూ కూర్చున్నాడు. ఇక రెండవ ఆలోచన అతనికి లేదు. మోసం చెయ్యటానికి ఇదే సమయమని ముసలమ్మ గ్రహించి

కూతురు చెవిలో చెప్పింది, "ఇదే మంచి సమయం. పిట్టగుండెకాయ తీసుకోవడానికి," అని. ఆ అమ్మాయి మెల్లగా పిట్ట గుండెకాయ కాజేసింది. వేటగాని తలగడ కింద బంగారం పుట్టడం లేదు. ఎందుకని అంటారా? పిట్టగుండెకాయ ఇప్పుడు ముసలమ్మ కూతురు దగ్గర ఉంది. కాబట్టి ఆ అమ్మాయి తలగడ కిందే పుడుతున్నది. రోజూ ఉదయం ముసలమ్మ వచ్చి ఆ అమ్మాయి తలగడ కింద పుట్టే బంగారునాణెం తీసుకుపోతూ ఉండేది. ప్రేమలో పడి వేటగాడు బంగారం నాణాల సంగతి మరచిపోయాడు.

ఇలా కొన్నిరోజులు జరిగిన తర్వాత ముసలమ్మ కూతురుతో మళ్ళీ: "పిట్ట గుండెకాయ తీసుకొన్నాం కదా! ఇక ఆ వరాల దుప్పటి సంగతి చూడు. అది కూడా మనం తీసుకోవాలి," అన్నది. కూతురు తల్లితో ఇలా అన్నది: "దాన్ని అతన్నే ఉంచుకోనివ్వమ్మా! పాపం అతని పిట్టగుండెకాయ కాజేశామాయె! చాలదూ!" ఈ మాటలు విని ముసలమ్మ అగ్గి అయిపోయింది. "ఆ దుప్పటిలాంటిది ప్రపంచంలో ఎక్కడా లేదు. అది నాకు కావాలి. తప్పదు," అని అరిచింది. ఆ అమ్మాయి ఏం చేస్తుంది పాపం! తల్లి చెప్పినట్లే చేసింది. కిటికీలో కూర్చుని విచారంగా బైటికి చూస్తూ ఉంది. వేటగాడు వచ్చి, "ఎందుకు విచారంగా ఉన్నావు?" అని అడిగాడు. ఆ అమ్మాయి ఇలా బదులు చెప్పింది, "ఏమి చెప్పను? చాలాదూరాన రత్నాలకొండ ఉంది. ఆ కొండను చూడాలని ఎంత కాలంనుంచో అనుకొంటున్నాను. అది జ్ఞాపకం వస్తే నాకు తగని దిగులు వేస్తుంది. అక్కడికి ఎలా వెళ్ళగలం? పిట్టలలాగా మనకేమైనా రెక్కలు ఉన్నాయా?"

"ఓస్! ఇందుకేనా నీ దిగులంతా? ఒక్క క్షణంలో నిన్ను అక్కడకు తీసుకునిపోతాను," అన్నాడు వేటగాడు. దుప్పటి బైటికి తీశాడు. కప్పుకొన్నాడు. ఆ అమ్మాయికి కూడా దుప్పటి కప్పాడు. 'రత్నాల కొండకు వెళ్ళాలి,' అని కోరుకున్నాడు. వెంటనే ఇద్దరూ రత్నాల కొండమీద ఉన్నారు. ఆ కొండమీద ఎక్కడ చూసినా రత్నాలు తళతళ మెరుస్తున్నాయి. మంచి మంచి రత్నాలు ఏరుకొని మూటకట్టుకొన్నారు. ఈ సమయానికే కోటలో ఉన్న ముసలి మంత్రగత్తె వేటగాని మీద మత్తుమంత్రం వేసింది. వేటగానికి

నిద్ర మైకం కమ్మింది. ఆ అమ్మాయితో ఇలా అన్నాడు: "ఇక్కడ కొంచెం సేపు కూర్చొని విశ్రాంతి తీసుకొందాం. నాకు చాలా బడలికగా ఉంది. నిలుచోలేకుండా ఉన్నాను." ఇద్దరూ కూర్చున్నారు. వేటగాడు ఆమె ఒడిలో తల పెట్టి నిద్రపోయాడు. బాగా నిద్రపోనిచ్చి ఆమె అతని భుజం మీద ఉన్న దుప్పటి తీసుకొంది! మెల్లగా అతని తల నేలమీద పెట్టింది. రత్నాలమూట పట్టుకొని దుప్పటి కప్పుకొంది. 'మా కోటకు వెళ్ళాలి,' అనుకొన్నది. కోటకు వచ్చి చేరింది.

వేటగాడు నిద్రలేచాడు. ఆ అమ్మాయి చేసిన మోసం గ్రహించాడు. 'భగవంతుడా! లోకంలో ఎంత మోసం ఉంది?' అనుకొన్నాడు. అతనికి చాలా భయం వేసింది. ఏడుపు పొర్లి వచ్చింది. ఎంత విచారిస్తే ఏమి లాభం? అలాగే దిగులుగా కూర్చున్నాడు. ఇంతలో ఆ కొండమీద ఉండే తాటిచెట్టంత రాక్షసులు ముగ్గురు అటు రావడం చూశాడు. 'నిద్రపోతున్నట్లు నటించడం కంటే ఉపాయం లేదు,' అనుకొన్నాడు. కాళ్ళు చాపి పడుకొని కళ్ళు గట్టిగా మూసుకొన్నాడు. ముగ్గురు రాక్షసులు అతని దగ్గరకు వచ్చారు. ఒక రాక్షసుడు కాలితో వేటగాడిని తోసి, "ఇదేమి పురుగు, ఇలా ఉంది?" అన్నాడు. "పాదం వేసి తొక్కు. చస్తుంది," అని రెండవ రాక్షసుడు అన్నాడు. "ఎందుకంత శ్రమ? అక్కడే ఉండనివ్వండి. అది పాకుతూ కొండపైకి పోతుంది. మేఘాలు వచ్చి తీసుకుపోతాయి," అని మూడవ రాక్షసుడు అన్నాడు. ముగ్గురు రాక్షసులు వెంటనే వెళ్లిపోయారు. ఈ మాటలన్నీ వేటగాడు విన్నాడు. వాళ్ళు వెళ్ళగానే కొండపై భాగం మీదకి ఎక్కాడు. అక్కడ కూర్చున్నాడు. కొంచెం సేపటికి ఒక నల్లని మేఘం అతని నలువైపులా దొర్లుతూ వచ్చింది. సుడిగాలితో అతనిని కప్పివేసింది. మేఘం అతనిని అలాగే సుడిగాలితో పట్టుకొని కొంతసేపటికి ఒక తోటలో వాలింది. వేటగాడు మెల్లగా పచ్చని కూరగాయల చెట్ల మధ్య దిగాడు.

అతనికి బాగా ఆకలి వేస్తున్నది. ఏమిచేస్తాడు? ఎటు చూసినా ఆకులూ, కూరలూ తప్ప మరేమీ లేవు. తోటంతా వెదికి చూశాడు. ఒక్క దుంప గానీ, ఒక్క కాయగానీ, పండుగానీ కనపడలేదు. ఆకలి మండిపోతున్నది.

అతనికేమీ తోచలేదు. విచారంగా తోటకూర మడి దగ్గర కూర్చున్నాడు. యధాలాపంగా తోటకూర కాడ గిల్లి నోటిలో పెట్టుకొని కొరికాడు. వెంటనే గాడిదగా మారాడు. అతని ఆశ్చర్యం వర్ణించలేం. గాడిదగా మారితే మాత్రం ఆకలి ఎక్కడికి పోతుంది? తోటకూర మడి మేస్తున్నాడు. ఈ చివరినుంచి ఆ చివరివరకు మేశాడు. ఆ చివర తోటకూర మేసే సరికి మళ్ళీ మామూలు మనిషి అయ్యాడు. ఈ చివర తోటకూర కాడలు కొన్ని, ఆ చివర తోటకూర కాడలు కొన్ని వేరువేరుగా మూటకట్టుకొని బయలుదేరాడు. 'ఆ దుర్మార్గురాళ్ళ పనిచెప్తాను ఉండు!' అనుకొని గబగబా నడచి రాత్రికి ముసలమ్మ కోట దగ్గరకు వచ్చాడు. వేషం మార్చుకొన్నాడు. ముఖానికి నల్లరంగు పూసుకొన్నాడు. కోటలోపలకి వచ్చి: "చాలా దూరంనుంచి వస్తున్నాను. బడలిపోయాను. ఇక నడవలేను. ఈ రాత్రికి ఇక్కడ పడుకొని వెళ్తాను. కాస్త కనికరించండి. మీకు మంచి తోటకూర ఇస్తాను," అన్నాడు. ముసలమ్మకు తోటకూర మాట వినేసరికి నోరూరింది. "అలాగే పడుకో నాయనా! ఎవరు వద్దంటారు? ఏదీ ఆ తోటకూర! ఎన్నాళ్ళనుంచో తోటకూర తిందామనుకొంటున్నాను. ఈ పాడుదేశంలో తోటకూర కరవైంది. ఇవ్వు నాయనా, ఈ పూట నీ పేరు చెప్పుకొని వండుకొని తింటాం," అన్నది. వేటగాడు గాడిదగా మారే తోటకూర తీసి ఇచ్చాడు.

ముసలమ్మ తోటకూర తీసుకొని వంటచేసే పిల్ల చేతికిచ్చింది. వంటపిల్ల తోటకూర వండి, కొంచెం రుచి చూసింది. వెంటనే గాడిదగా మారిపోయి, ఇంటి బయటకు వచ్చింది. ఆ వేటగాడు గాడిదను చూశాడు. "పాడు గాడిద కోట లోపలికి వచ్చిందే," అంటూ దాని మెడకు తాడుకట్టి చెట్టుకు కట్టాడు. వంటపిల్ల తోటకూర వండిందో లేదోనని ముసలమ్మ వంట ఇంట్లోకి వెళ్ళింది. తోటకూర గిన్నె మూత తీసి చూసింది. కమ్మనివాసన గుమ్మున ముక్కుల్లో దూరింది. వేలితో కొంచెం తీసుకొని నాలుకకు రాసుకుంది. వెంటనే గాడిదగా మారి బయటికి వచ్చింది. వేటగాడు ఆ గాడిదను కూడా కట్టివేశాడు. తర్వాత, తల్లి రాలేదేమా అని కూతురు వంట ఇంటి లోపలికి వెళ్ళింది. తోటకూర గిన్నె మూత తీసి ఉండడం చూసి, 'మూత కూడా పెట్టకుండా వంటపిల్ల ఎక్కడికి పోయింది?' అనుకొంటూ కొంచెం తోటకూర గరిటెతో తీసుకొని

రుచి చూసింది. ఆవిడ కూడా వెంటనే గాడిద అయిపోయి బైటికి పరుగెత్తింది. వేటగాడు దానిని కూడా పట్టుకొని కట్టివేశాడు. ఆ రాత్రి సుఖంగా భోజనం చేసి, ఆ కోటలో నిద్రపోయాడు.

తెల్లవారింది. మూడు గాడిదల మెడతాళ్ళు పట్టుకొని పశువుల కాపరి దగ్గరకు తీసుకుపోయాడు. "నువ్వు ఎంత డబ్బు అడిగితే అంత ఇస్తాను. వీటిని కొంతకాలం మేపు," అన్నాడు. పశువుల కాపరి ఒప్పుకున్నాడు. "ఈ ముసలి గాడిదను మూడు పూటలా చావబాది ఒక పూట గడ్డి వెయ్యి. ఈ రెండవ గాడిదను ఒక పూట చావగొట్టి, మూడుపూటలా గడ్డి వెయ్యి. ఈ అందమైన గాడిదను కొట్టకుండా మూడుపూటలా గడ్డి వేసి శ్రద్ధగా చూడు," అని వేటగాడు పశువుల కాపరికి సలహా చెప్పాడు. పశువుల కాపరి అలాగే చేస్తానని చెప్పి గాడిదలను తీసుకొని కట్టివేశాడు.

వేటగాడు కోటలో మకాం పెట్టాడు. సుఖంగా ఉంటున్నాడు. కొన్ని రోజులు గడిచిన తర్వాత పశువుల కాపరి వచ్చి, "అయ్యా! మీ గాడిదలను మీకే తోలి పెడతాను. ముసలి గాడిద చచ్చిపోయింది. తక్కిన రెండు గాడిదలు బొత్తిగా గడ్డి పరక ముట్టడం లేదు. అవి కూడా రేపో మాపో చచ్చేట్లు ఉన్నాయి," అన్నాడు. వేటగాడికి జాలివేసింది. తక్కిన రెండు గాడిదలను కోటకు తోలి పెట్టమన్నాడు. పశువుల కాపరి అలాగే చేశాడు. రెండు గాడిదలకూ వేటగాడు రెండవ రకం తోటకూర తినిపించాడు. రెండు గాడిదలూ, ఒకటి వంట పిల్లగానూ, రెండవది ముసలమ్మ కూతురుగానూ మారాయి. ముసలమ్మ కూతరు అతని కాళ్ళ మీద పడి, "నా తప్పేమీ లేదు. నన్ను క్షమించు. మా అమ్మ బలవంతంతో నీకు చాలా కష్టాలు కలిగించాను. నాకు నిజంగా ఇష్టం లేదు. నువ్వంటే నాకు ఎంతో ప్రేమ. నీ వరాల దుప్పటి పెట్టెలో ఉంది. నీ పిట్ట గుండె కూడా ఇస్తాను. తీసుకో. నన్ను క్షమించు," అని వెక్కి వెక్కి ఏడ్చింది. "పిచ్చిదానా! ఏడవకు! అవి నీ దగ్గర ఉంటే ఒకటి, నా దగ్గర ఉంటే ఒకటీనా! లే! నిన్ను పెళ్ళి చేసుకొంటాను," అని వేటగాడు ఆమెను లేవదీశాడు.

వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకొని సుఖంగా ఉన్నారు.

# పాపం! పెళ్ళికొడుకు!

ఒక కలప వర్తకుడు - ఒక అడవిదాపు గ్రామంలో ఉండేవాడు. అతని కూతురు చాలా అందగత్తె. 'ఎవరైనా మంచి కుర్రవాడు కనిపిస్తే అమ్మాయిని ఇచ్చి పెళ్ళి చేసి, నా నెత్తిమీద బరువు దించుకొంటాను,' అని వర్తకుడు అనుకొంటూ ఉండేవాడు. వర్తకుడు కోరుకున్నట్లుగానే ఒకనాడు ఒక యువకుడు వచ్చాడు. డబ్బున్న వాడిలాగా, మర్యాదస్తుడిలాగా కనిపించాడు. చూపులకు కూడా బాగానే ఉన్నాడు. వర్తకునికి నచ్చాడు. కూతురునిచ్చి పెళ్ళి చేస్తానని మాట ఇచ్చాడు. కాని కూతురుకెందుకో ఆ యువకుడు నచ్చలేదు. అతనిని చూసినా, అతడు జ్ఞాపకం వచ్చినా ఆమెకెందుకో తగని అసహ్యం పుట్టేది. కాని అతను మాత్రం కాబోయే మామగారింటికి అప్పుడప్పుడు వచ్చి పోతూ ఉండేవాడు.

ఒకనాడు కాబోయే పెళ్ళికొడుకు కాబోయే పెళ్ళికూతురితో ఇలా అన్నాడు: "నేను రోజూ మీ ఇంటికి వస్తున్నాను కదా! ఒక్కసారైనా నువ్వు మా ఇంటికి రాలేదు!" "మీ ఇంటికి దారి నాకు తెలియదాయె!" అన్నది కాబోయే పెళ్ళి కూతురు. "నీకు తెలియదూ! మా ఇల్లు అడవిలో ఉంది," అన్నాడు కాబోయే పెళ్ళికొడుకు. ఎలాగైనా వెళ్ళకుండా తప్పించుకోవాలని కాబోయే పెళ్ళి కూతురు: "దారి ఎటో నాకేం తెలుసు?" అన్నది. "సరే, ఏమైనా కానీ, వచ్చే ఆదివారం నువ్వు తప్పక రావాలి. కొందరు చుట్టాలను కూడా రమ్మని కబురు చేశాను. నీకోసం ఎదురు చూస్తుంటాం. నీకు

గుర్తుకోసం దారిలో బూడిద చల్లి ఉంచుతాను," అని చెప్పి కాబోయే పెళ్ళికొడుకు వెళ్ళాడు.

ఆదివారం వచ్చింది. ఆ అమ్మాయి అయిష్టంగానే బయలుదేరింది. కాని, మనస్సులో మాత్రం సంతోషంగా ఉంది. ఎందుకైనా మంచిదని, రెండు చిన్న సంచులు తీసుకొని, ఒక దానిలో బటానీ గింజలు, మరొక దానిలో చిక్కుడు గింజలు వేసుకొని వెళ్ళింది. అడవి సమీపానికి వెళ్ళింది. బూడిద చల్లిన దారి కనిపించింది. ఆ దారినే నడుస్తూ, ఒక వైపు చిక్కుడు గింజలూ, రెండవ వైపు బటానీ గింజలూ పడేస్తూ వెళ్ళింది. నడచి, నడచి, సాయంత్రం అయ్యేటప్పటికి, అడవి మధ్య ఉన్న ఒక ఇంటికి చేరింది. ఇంట్లో ఎవ్వరూ లేరు. సడీ చప్పుడూ లేదు.

ఇంతలో ఎవరో ఇలా అన్నారు:

"ఏ పాప మెరుగని
ఓ పెళ్ళికూతురా!
పామున్న ఇల్లు ఇది,
పోవమ్మ, నాయమ్మ!"

ఆమె ఆశ్చర్యంతో చుట్టూ చూసింది. గుమ్మానికి వేలాడుతున్న పంజరంలో ఉన్న చిలుక, ఒకసారి రెక్కలు అల్లార్చి మళ్ళీ అరిచింది:

"ఏ పాప మెరుగని
ఓ పెళ్ళికూతురా!
పామున్న ఇల్లు ఇది,
పోవమ్మ, నాయమ్మ!"

ఆమె ఇంటి లోపలికి వెళ్ళింది. అన్ని గదులూ చూసింది. ఒక్క పురుగు కూడా లేదు. చివరి గదిలో ఒక అవ్వ కూర్చొని ఉంది. "అవ్వా! నా పెళ్ళికొడుకు ఇక్కడేనా ఉండేది?" అని ఆ అమ్మాయి అడిగింది. "అయ్యో! బంగారుతల్లీ! ఐతే దొంగలవలలో పడ్డావన్నమాట! నీ పెళ్ళి ఎవరితోనో తెలుసా? చావుతో. నా మాట విను. విననంటావా? నీకు చావు తప్పదు," అన్నది అవ్వ.

అవ్వ ఆ అమ్మాయిని ఒక పెద్దపీపా వెనుక దాచి పెట్టి ఇలా చెప్పింది: "ఇక్కడే కూర్చో. కదలకూడదు. మెదలకూడదు. కొంచెం సేపటికి దొంగలు వస్తారు. వాళ్ళు చూశారా? నీ పని సున్నా. వాళ్ళు నిద్రపోయే దాకా అలాగే ఉండు. తర్వాత ఇద్దరం కలిసి వెళ్ళిపోదాం. నేను కూడా చాలాకాలం నుంచి పారిపోవాలనుకుంటున్నాను."

అవ్వ చెప్పటం అయిందో, లేదో, దొంగలు లోపలికి రానే వచ్చారు. వాళ్ళు ఒక చక్కని అమ్మాయిని మోసం చేసి తెచ్చారు. దొంగలు కడుపునిండా సారాయి తాగారు. వెర్రిమొర్రి కేకలు వేస్తున్నారు. ఆ అమ్మాయి ఏడుపు వాళ్ళ చెవికి సోకనేలేదు. మూడు లోటాలతో వాళ్ళు ఆ పిల్లకు మూడు రకాల సారాయి ఇచ్చారు. ఒక లోటాలో సారాయి తెల్లగా ఉంది, రెండవ లోటాలో సారాయి ఎర్రగా ఉంది, మూడవ లోటాలో సారాయి పసుపుపచ్చగా ఉంది. మూడు లోటాల సారాయి తాగగానే ఆ పిల్ల తల తిరిగి పడిపోయి, చచ్చిపోయింది. ఇదంతా చూసేటప్పటికి పీపా వెనుక ఉన్న కాబోయే



పెళ్ళికూతురుకు ముచ్చెమటలు పోశాయి. తన గతికూడా ఇలాగే అయ్యేది కదా అనుకొన్నది. అప్పుడు కాబోయే పెళ్ళికొడుకు, చచ్చిపోయిన అమ్మాయి చేతి వేలికి ఉన్న ఉంగరం చూశాడు. వంగి ఉంగరం లాగాడు. ఆ ఉంగరం ఎగిరి పీపా వెనుక కూర్చున్న కాబోయే పెళ్ళికూతురు ఒడిలో పడింది. ఇక చూడు స్వామీ! కాబోయే పెళ్ళికూతురు గుండెలు ఎలా కొట్టుకున్నాయని చెప్పను! కాబోయే పెళ్ళికొడుకు దీపం చేత పట్టుకొని ఇల్లంతా వెదికాడు. ఉంగరం కనిపించలేదు. అప్పుడు ఒక దొంగ ఇలా అన్నాడు: “ఆ పీపా వెనుక చూశావా? వెళ్ళిచూడు!” ఇంతలో అవ్వ వచ్చి, “ఏడిచినట్టే ఉంది. ఉంగరం ఎక్కడికి పోతుంది? నేనెక్కడికి పోతాను? రేపు చూసి ఇస్తాలే. అన్నం చప్పగా ఆరిపోయింది. ముందు అన్నం తినండి,” అని అంటూ కాబోయే దొంగ పెళ్ళికొడుకు చేతిలో దీపం తీసుకొని, అన్నం వడ్డించింది. అందరూ కంచాల ముందు కూర్చున్నారు. అవ్వ కొంచెం మత్తుమందు నీళ్ళలో కలిపి లోటాల్లో పోసింది. దొంగలందరూ కడుపునిండా తిని, మంచినీళ్ళు తాగారు. చేతులు తుడుచుకొంటూనే ఆవలిస్తూ ఎక్కడి వాళ్ళక్కడ నేలమీద పడి నిద్రపోయారు. వాళ్ళ గురక విని కాబోయే పెళ్ళికూతురు పీపా వెనకనుంచి లేచి బైటపడింది. అవ్వకూడా ఆమె వెంట వచ్చింది. ఇద్దరూ కలిసి దారి చూశారు. బూడిద గాలికి ఎగిరిపోయింది. కాని, బటానీలు, చిక్కుడు గింజలూ అక్కడక్కడ కనిపిస్తూనే ఉన్నాయి. వెన్నెలలో వాటి గుర్తులను చూసుకొంటూ వాళ్ళు ఆ రాత్రి అంతా నడచి ఇల్లు చేరారు. తండ్రికి కూతురు జరిగిన కథ అంతా చెప్పింది.

ఆ రెండవ నాడు మళ్ళీ పెళ్ళి బేరానికి వర్తకుని ఇంటికి దొంగ వచ్చాడు. ఆ సాయంత్రం వర్తకుడు పెద్ద విందు ఏర్పాటు చేశాడు. చుట్టపక్కాలను, స్నేహితులను చాలామందిని పిలిచాడు. అందరూ వచ్చారు. భోజనాలైన తర్వాత అందరూ ఇష్టాగోష్ఠిగా మాట్లాడుకొంటుండగా, ఒకరు అన్నారు కదా: “ఎవరికి వచ్చిన కథ వాళ్ళు చెప్పండి.” అందరూ సరేనంటే సరేనన్నారు. కాబోయే పెళ్ళికొడుకు, కాబోయే పెళ్ళికూతురు వంక చూసి: “ముందు నువ్వు చెప్పు,” అన్నాడు. అలాగే చెబుతానని కాబోయే

పెళ్ళికూతురు ఇలా చెప్పింది: "మొన్నటి రాత్రి నాకొక చిత్రమైన కల వచ్చింది. ఆ కల చెబుతాను. ఏమంటే– నేనొక అడవిలో పోతున్నానట. పోయి పోయి ఒక ఇంటికి వచ్చాను. ఆ ఇంటిలో ఎవరూ లేరు. ఒక పంజరంలో చిలుక ఉంది. అది రెండుసార్లు ఇలా అరిచింది:

*"ఏ పాప మెరుగని*
*ఓ పెండ్లికూతురా!*
*పామున్న ఇల్లు ఇది,*
*పోవమ్మ, నాయమ్మ!"*

"ఇదంతా కలే సుమా, నిజమనుకునేరు! తర్వాత ఇల్లంతా చూశాను. ఎవ్వరూ లేరు. చివరకు ఒక గదిలో ఒక ముసలమ్మ కూర్చొని ఉంది. నేనామెను: 'నా పెండ్లికొడుకు ఉండేది ఈ ఇల్లేనా?' అని అడిగాను. 'అయ్యో తల్లీ, దొంగల మోసంలో పడ్డావు. నీ పెళ్ళికొడుకు నిన్ను తప్పకుండా చంపుతాడు,' అని అవ్వ చెప్పింది. ఇదంతా కలే సుమండీ! నిజమనుకునేరు. తర్వాత ఏం జరిగిందంటే ఆ అవ్వ నన్నొక పెద్దపీపా వెనుక దాచిపెట్టింది. వెంటనే దొంగల గుంపు ఒక అమ్మాయిని ఈడ్చుకువచ్చారు. తెల్లని సారాయి, ఎర్రని సారాయి, పసుపుపచ్చ సారాయి – మూడు లోటాలలో ఆ అమ్మాయికి ఇచ్చారు. ఆ అమ్మాయి తాగి చచ్చి పడిపోయింది. ఇదంతా కలే సుమండీ, నిజమనుకునేరు! ఆ అమ్మాయి వేలికి బంగారపు ఉంగరం ఉంది. ఒక దొంగ చూశాడు. ఉంగరం లాగాడు. అది ఎగిరి నా ఒడిలో పడింది. ఇదిగో ఆ ఉంగరం," అంటూ కాబోయే పెళ్ళికూతురు ఉంగరం తీసి అందరికీ చూపించింది.

ఈ కథ అంతా విని, ఉంగరం చూసేటప్పటికి కాబోయే పెళ్ళికొడుకు ముఖం కత్తివేటు వేస్తే నెత్తురుచుక్క లేకుండా పోయింది. భయంతో అతడు గజగజ వణికిపోయాడు. లేచి పారిపోవాలని చూశాడు. అక్కడి వాళ్ళంతా అతన్ని పట్టుకొని రాజు దగ్గరకు తీసుకుపోయారు. రాజు తక్కిన దొంగలను కూడా పట్టుకున్నాడు. అందరికీ ఉరిశిక్ష వేశాడు.

పాపం! పెళ్ళికొడుకు!

# నక్క, గుర్రం

ఒక రైతు దగ్గర ఒక మంచి గుర్రం ఉండేది. అది అతనికి చాలాకాలం సేవ చేసింది. ఇప్పుడు ముసలిదైపోయింది. బండి లాగలేకుండా ఉంది. అందుకని రైతు దానికి దాణా వెయ్యటం మాని ఇలా అన్నాడు: "నీతో నాకు పనిలేదు. నా ఇంటినుంచి వెళ్ళిపో. నీకు మళ్ళీ సింహమంత బలం వస్తేగాని తిరిగి రానివ్వను." ఈ మాట అని గుర్రాన్ని రైతు ఇంటినుంచి తరిమివేశాడు.

పాపం! ఆ గుర్రం చాలా విచారంతో అడవిలో అటుఇటు తిరుగుతూ ఉంది. ఇంతలో ఒక నక్క దాని దగ్గరకు వచ్చి, "ఎందుకు అంత దిగులుగా ఉన్నావు?" అని అడిగింది. "ఏమి చెప్పను నక్కా! న్యాయమూ, కోపమూ రెండూ ఒకేచోట ఉండవని పెద్దలంటారు. ఇన్ని సంవత్సరాల నుంచి నేను చేసిన చాకిరి అంతా యజమాని మరచిపోయాడు. ఇప్పుడు నేను ముసలితనం వచ్చి, పనిచేయటం లేదని ఇంటినుంచి తరిమివేశాడు. మళ్ళీ సింహం అంత బలం వస్తేనే తిరిగి ఇంటికి రానిస్తానన్నాడు. అంత బలం నాకు ఎలా వస్తుంది? నాకు అంత బలం లేదని ఆయనకు తెలుసు. నాకే అంత బలం ఉంటే ఆయన అలా ఎందుకు మాట్లాడతాడు చెప్పు," అన్నది గుర్రం.

నక్క అన్నది: "కష్టాలు వచ్చినప్పుడు ధైర్యంగా ఉండాలంటారు పెద్దలు. నాకు చేతనైన సహాయం చేస్తాను. చచ్చిపోయినట్లు కాళ్ళు బిగదీసుకొని

పడుకో. ఆ తర్వాత సంగతి నేను చూస్తాను."

నక్క చెప్పినట్లే గుర్రం నేలమీద పడుకొన్నది. ఆ సమీపంలోనే ఒక గుహలో సింహం ఉంటున్నది. నక్క సింహం దగ్గరకు పరుగెత్తి వెళ్లింది: "మృగరాజా! మృగరాజా! ఇక్కడికి కొంచెం దూరంలో ఒక గుర్రం చచ్చి పడిపోయింది. తిందువుగాని రా!" అని పిలిచింది. సింహానికి చాలా సంతోషం కలిగింది. నక్కతో గుర్రం ఉన్న చోటికి వచ్చింది. నక్క అన్నది కదా, "ఇక్కడ హాయిగా కూర్చొని తినలేవు. నీ గుహ లోపలికి తీసుకుపోయి తిను. నేను ఒక ఉపాయం చెబుతాను. నీ కాళ్ళకు గుర్రం తోక కడతాను. గుహ లోపలికి లాక్కుపో."

ఈ ఉపాయం సింహానికి బాగా నచ్చింది. పడుకొని కాళ్ళు ఎత్తింది. నక్క ఉపాయంగా దాని నాలుగుకాళ్ళూ గట్టిగా బిగించి గుర్రం తోకకు కట్టింది. సింహం బలమంతా చూపి లాగినా సరే ఊడిపోనంత గట్టిగా కట్టింది. గుర్రం భుజం తట్టి, "మిత్రమా! ఉరుకు! ఉరుకు!" అన్నది. గుర్రం దిగ్గున లేచింది. సింహాన్ని ఈడుస్తూ నడిచింది. సింహం అడవి దద్దరిల్లిపోయేటట్లు అరిచింది. అడవిలో ఉన్న పిట్టలన్నీ భయంపుట్టి



ఎగిరిపోయాయి. గుర్రం మాత్రం తాపీగా సింహాన్ని ఈడ్చుకొంటూ అడవిదాటి, పొలాలు దాటి యజమాని ఇంటికి వెళ్ళింది.

"అయ్యా! ఇదిగో చూడండి. సింహం కంటే ఎక్కువ బలం సంపాదించానో లేదో! సింహాన్నే కట్టి తెచ్చాను," అని గుర్రం యజమానితో అన్నది. రైతుకు గుర్రాన్ని చూడగానే చాలా సంతోషం కలిగింది. ఇరుగుపొరుగు వాళ్ళ సహాయంతో సింహాన్ని చంపివేసి, తర్వాత గుర్రంతో ఇలా అన్నాడు: "సెబాష్, పరువు నిలిపావు. హాయిగా ఇక్కడే ఉండు." నాటినుంచి గుర్రం కావలసినంత మేత, దాణా తింటూ బతికినంత కాలం చీకూచింతా లేకుండా బతికింది.

# పన్నెండుగురు రాకుమార్తెలు

ఒక రాజు ఉండేవాడు. అతనికి పన్నెండుగురు అందమైన కుమార్తెలు ఉన్నారు. వాళ్ళందరూ ఒకే గదిలో పన్నెండు మంచాల మీద పడుకొనేవారు. వాళ్ళు పడుకోగానే రాజు ఆ గదికి తాళం వేయించేవాడు. తెల్లవారి చూసేటప్పటికి వాళ్ళ కాళ్ళజోళ్ళు బాగా అరిగిపోయి ఉండేవి. ఈ మాయ ఏమిటో ఎవరికీ అర్థం కాలేదు. రాకుమార్తెలు రోజూ రాత్రి ఎక్కడికి వెళ్ళేవారో, ఏమి చేస్తుండేవారో ఎవరికీ బోధపడలేదు.

రాజు తన రాజ్యం అంతటా చాటించాడు. రోజూ రాత్రిపూట రాకుమార్తెలు ఎక్కడికి వెళుతున్నారో, వాళ్ళ కాలిజోళ్ళు ఎందుకు తెల్లవారేటప్పటికి అరిగిపోతున్నాయో తెలిసికొని చెప్పినవాళ్లకు, వాళ్ళు కోరుకున్న రాకుమార్తెను ఇచ్చి పెళ్ళి చేసి, తన తర్వాత రాజ్యం ఇస్తానని చాటించాడు. మూడు రోజుల్లో కనిపెట్టకపోతే తల నరికిస్తానన్నాడు.

ఒక రాకుమారుడు వచ్చాడు. అతనిని రాజు మర్యాద చేశాడు. రాకుమార్తెలు పడుకొనే గది పక్కన ఉన్న గదిలో అతడికి పడక ఏర్పాటు చేశారు. రాకుమార్తెల నడవడి కనిపెట్టడానికి వీలుగా ఆ గదికీ ఈ గదికీ మధ్య తలుపు తెరచి ఉంచారు. కాని, ఆ రాకుమారునికి పడుకోగానే నిద్రపట్టింది. తెల్లవారి లేచి చూసేటప్పటికి రాకుమార్తెల కాలిజోళ్ళు ఎప్పటిలాగా అరిగి చిల్లులు పడి ఉన్నాయి. రెండవ నాటి రాత్రి, మూడవ నాటి రాత్రి కూడా ఇలాగే జరిగింది. రాజు ఆ రాకుమారుడి తల

నరికించాడు. ఆ తర్వాత ఇలాగే చాలామంది వచ్చారు. అందరికీ అదే గతి పట్టింది.

కొంతకాలానికి యుద్ధంలో గాయపడి, సైన్యంలోనుంచి విడుదల పొందిన ఒక సైనికుడు ఆ రాజు రాజ్యంలో ప్రయాణం చేస్తూ ఒక అడవి లోపలికి వచ్చాడు. ఆ అడవిలో అతనికి ఒక ముసలమ్మ కనిపించింది. "ఎక్కడికి పోతున్నావు నాయనా?" అని అవ్వ అడిగింది. "ఎక్కడికి పోతున్నానో నాకే తెలియదు. ఏం చేస్తానో కూడా తెలియదు. ఈ రాజ్యం ఏలే రాజు కుమార్తెలు ప్రతిరోజూ రాత్రి ఎక్కడికి వెళతారో తెలిస్తే బాగుండును. రాజు తర్వాత నేనే రాజునౌతాను," అన్నాడు సైనికుడు.

"అది ఎంత పని నాయనా! రాకుమార్తెలు ఇచ్చే మత్తుపానకం తాగకుండా ఉంటే సరి. ఆ తర్వాత గురకపెట్టి నిద్రపోతున్నట్లు నటిస్తే సరి. రహస్యం అంతా అదే తెలుస్తుంది," అని సలహా చెప్పింది అవ్వ. అంతేకాకుండా ఒక దుప్పటికూడా అతనికి ఇచ్చింది. "ఈ దుప్పటి కప్పుకుంటే ఎవ్వరికీ కనబడవు. అప్పుడు రాకుమార్తెల వెంట కనపడకుండా వెళ్ళి వాళ్ళేం చేస్తారో చూడవచ్చు," అన్నది.

ఈ సంగతులన్నీ విన్న తర్వాత సైనికుడు తన అదృష్టం ఎలా ఉందో ప్రయత్నం చేసి చూద్దామని నిశ్చయించుకొని రాజు దగ్గరకు వెళ్ళాడు. రాజు పూర్వం వచ్చిన వాళ్ళను మర్యాద చేసినట్లే ఈ సైనికుడిని కూడా మర్యాద చేశాడు. అతనికి రాజకుమారులు వేసుకొనే విలువైన దుస్తులు ఇప్పించాడు. సాయంత్రం అయ్యే సరికి రాకుమార్తెల పక్కనున్న గదిలోపలికి అతన్ని తీసుకుపోయారు.

సైనికుడు పడుకోబోతుండగా పెద్ద రాకుమార్తె వచ్చి గిన్నెతో మత్తుపానకం ఇచ్చింది. తాగినట్టే నటించి, ఆమెకు కనపడకుండా పానీయమంతా పారబోశాడు. పడకమీద పడుకొని, నిద్రపోతున్నవాడిలాగా గురకపెట్టాడు. రాకుమార్తెలు ఇతని గురక విన్నారు. పకపక నవ్వారు. పెద్దరాకుమార్తె అన్నది కదా! "ఈ సైనికుడికి పానీయం ఇవ్వడం కూడా దండుగే. ఇవ్వకపోయినా గురకపెట్టి నిద్రపోయేవాడే!"

రాకుమార్తెలు పన్నెండుగురు లేచారు. పెట్టెలు తెరిచారు. అందమైన జరీ దుస్తులు తీశారు. అందరూ అద్దాల ముందు నిలబడి అలంకరించు కొన్నారు. కొత్తజోళ్ళు కాళ్లకు తొడుగుకున్నారు. బయలుదేరారు. కాని, చిన్న రాకుమార్తెకు ఎందుకో సందేహం కలిగింది. "ఎందుకోగాని నాకు భయంగా ఉంది. ఏదో ఆపద వస్తుందేమోనని సందేహంగా ఉంది," అన్నది. "ఓసి వెర్రిదానా! నీకు ఎప్పుడూ భయమే. ఎంతమంది రాకుమారులు ఇంతకు ముందు మన రహస్యం కనిపెట్టాలని రాలేదు? వాళ్ళ గతి ఏమైంది? ఇతనికేం కొమ్ములు మొలిచాయా? పిచ్చివాడు! బతికి ఉంటే బలుసాకు తినవచ్చునని సామెత. కాలం దగ్గరకు వచ్చి ఇక్కడకు వచ్చాడు," అని పెద్ద రాకుమారి అన్నది.

రాకుమార్తెలు పన్నెండుగురు వచ్చి ఒకమాటు సైనికుడిని చూశారు. అతడు కదలకుండా మెదలకుండా గురకపెట్టి నిద్రపోతున్నాడు. రాకుమార్తెలు ధైర్యం తెచ్చుకొన్నారు. పెద్ద రాకుమార్తె తన మంచం దగ్గరకు వెళ్ళి, చేతులతో చరిచింది. మంచం నేలమీదకు జారింది. నేలనుంచి ఒక తలుపు



తెరచుకొంది. ఈ తలుపుగుండా రాకుమార్తెలు వెళ్ళటం సైనికుడు చూశాడు. ముందు పెద్ద రాకుమార్తె వెళ్ళింది. తర్వాత వరసగా అందరూ వెళ్ళారు. సైనికుడు వెంటనే లేచాడు. అవ్వ ఇచ్చిన దుప్పటి కప్పుకొన్నాడు. వాళ్ళ వెంటే బయలుదేరాడు. మెట్లు దిగుతుండగా చిన్నరాకుమార్తె చీర అంచుమీద సైనికుడి కాలు పడింది. ఆమె అరిచింది: "నాకేదో భయంగా ఉంది. నా చీర అంచు ఎవరో పట్టుకున్నట్లుగా ఉంది," అన్నది. "వెర్రిపిల్లా గోడలో మేకు పట్టుకుని ఉంటుందిలే, రా!" అని పెద్దరాకుమార్తె మందలించింది.

అందరూ భూమిలోపలికి వెళ్ళారు. అక్కడ ఒక అందమైన తోట ఉంది. ఆ తోటలో చెట్ల ఆకులన్నీ వెండి ఆకులులాగా అందంగా మెరుస్తున్నాయి. సైనికుడు ఒక కొమ్మ విరిచాడు. చప్పుడైంది. మళ్ళీ చిన్న రాకుమార్తె అన్నది: "నిజంగా ఏదో ప్రమాదం వచ్చేటట్లు ఉంది. ఆ చప్పుడు వినపడలేదా మీకు? ఇలా ఎప్పుడూ చప్పుడు కాలేదే!" పెద్ద రాకుమార్తె మందలించింది, "మన రాకుమారులు మనం వస్తున్నామని సంతోషంతో అరుస్తున్నారులే."

తర్వాత వాళ్ళు మరొక తోట లోపలికి వచ్చారు. అక్కడ చెట్ల ఆకులన్నీ బంగారపు ఆకులు. ఆ తర్వాత మరొక తోటలోపలికి వచ్చారు. అక్కడ చెట్ల ఆకులన్నీ మణులతో చేసి ఉన్నాయి. మిలమిల మెరుస్తున్నాయి. సైనికుడు బంగారు ఆకుల కొమ్మ ఒకటి, మణుల ఆకుల కొమ్మ ఒకటి విరిచాడు. పెద్దగా చప్పుడైంది. చిన్న రాకుమారి భయపడింది. పెద్దరాకుమారి మొదట చెప్పిన సమాధానమే చెప్పి మందలించింది. రాకుమార్తెలంతా నడిచి ఒక సరస్సు దగ్గరకు వెళ్ళారు. ఆ సరస్సు ఒడ్డున పన్నెండు పడవలు ఉన్నాయి. పన్నెండు పడవల్లో పన్నెండుగురు అందమైన రాకుమారులు కూర్చుని ఉన్నారు. వాళ్ళు రాకుమార్తెల కోసం కాచుకొని ఉన్నారు.

ఒక్కొక్క రాకుమార్తె ఒక్కొక్క పడవ ఎక్కింది. సైనికుడు చిన్న రాకుమారి ఎక్కిన పడవ ఎక్కాడు. రాకుమారులు పడవలు నడుపుతున్నారు. చిన్న రాకుమార్తె పడవ నడుపుతున్న రాకుమారుడు కొంచెం దూరం వెళ్ళిన తర్వాత ఇలా అన్నాడు: "కారణం తెలియటం లేదు గాని, ఈ రోజు పడవ

బరువుగా ఉంది. ఎంత బలంగా తెడ్డు వేసినా రోజూలాగా నడవడం లేదు. నాకు చాలా ఆయాసంగా ఉంది.”

“గాలి వేడిగా ఉంది. అందుకనే నీకలా అనిపిస్తున్నది. నాకు కూడా ఎందుకో బడలికగానే ఉంది,” అని బదులు చెప్పింది చిన్నరాకుమారి.

సరస్సుకు అవతలి ఒడ్డున అందమైన కోట ఉంది. ఆ కోట లోపలి నుంచి తియ్యని సంగీతం వినిపిస్తున్నది. పడవలన్నీ అవతలి ఒడ్డున ఆగాయి. అందరూ దిగి కోట లోపలికి వెళ్ళారు. పన్నెండుగురు రాకుమార్తెలు, పన్నెండుగురు రాకుమారులతో నాట్యం చేశారు. సైనికుడు కూడా హుషారుగా నాట్యం చేశాడు. కొంచెం సేపు నాట్యం చేసిన తర్వాత అందరూ పానీయాలు పుచ్చుకొంటున్నారు. రాకుమార్తెలు గిన్నెలు పక్కనపెట్టుకొని అటు చూడగానే సైనికుడు చటుక్కున తాగి వట్టి గిన్నె పేట్టేశాడు. రాకుమార్తెలు తిరిగి చూసేసరికి గిన్నె ఖాళీగా ఉండేది. పన్నెండుగురు రాకుమార్తెలకూ ఇలాగే జరిగింది. ఇదంతా చూసి చిన్న రాకుమార్తెకు భయం పుట్టింది. కాని పెద్ద రాకుమార్తె మందలించింది. రాత్రి మూడు గంటల వరకు వాళ్ళు అలాగే నాట్యం చేస్తున్నారు. కాలిజోళ్ళతోనే నాట్యం చేశారు. జోళ్ళు అరిగిపోయి, చిల్లులు పడ్డాయి.

రాకుమారులు రాకుమార్తెలను పడవల మీద ఈ ఒడ్డుకు చేరవేశారు. ఈ మాటు సైనికుడు పెద్దరాకుమారి ఎక్కిన పడవలో ఎక్కాడు. రాకుమార్తెలు రాకుమారుల వద్ద సెలవు తీసుకొన్నారు. మళ్ళీ రేపు వస్తామని మాట ఇచ్చారు.

ఇంటి లోపలికి వచ్చే మెట్లు ఎక్కేటప్పుడు సైనికుడు రాకుమార్తెల కంటే ముందుగా పరుగెత్తి వెళ్ళి తన మంచం మీద ఏమీ ఎరగనట్లు పడుకొన్నాడు. రాకుమార్తెలు అలసిసొలసి ఉన్నారు. మెల్లగా మెట్లెక్కి వచ్చి సైనికుడిని చూశారు. అతడు గురకపెట్టి నిద్రపోతున్నాడు. రాకుమార్తెలు దుస్తులు విప్పి మామూలు దుస్తులు వేసుకొని పడుకొన్నారు.

ఉదయమైంది. సైనికుడు నోరు మెదపలేదు. మొదటి రాత్రి లాగానే, రెండవ రాత్రి, మూడవ రాత్రి కూడా జరిగింది. మూడవ రాత్రి సైనికుడు

రాకుమార్తెలు, రాకుమారులు పానీయాలు సేవించిన బంగారు గిన్నె పట్టుకు వచ్చాడు.

నాలుగవ నాడు తెల్లారింది. సైనికుడిని భటులు రాజు దగ్గర హాజరు పెట్టారు. సైనికుడు బంగారుగిన్నె, వెండి, బంగారు, మణుల ఆకులు గల కొమ్మలు తీసుకొని రాజు దగ్గరకు వచ్చాడు. అతడేమి చెబుతాడో విందామని రాకుమార్తెలు తలుపు చాటున నిలిచారు. సైనికుడిని రాజు అడిగాడు, "రాకుమార్తెలు రాత్రి ఎక్కడికి వెళ్ళారు?" "భూమిలో ఉన్న ఒక కోటలో పన్నెండు మంది రాకుమారులతో నాట్యం చేస్తున్నారు," అన్నాడు సైనికుడు. జరిగిన కథ అంతా చెప్పాడు. తాను తెచ్చిన చెట్లకొమ్మలు, బంగారుగిన్నె గుర్తుగా చూపించాడు. రాజు రాకుమార్తెలను పిలిపించాడు. సైనికుడు చెప్పింది నిజమేనా అని అడిగాడు. రాకుమార్తెలు తమ గుట్టు బయట పడిందని తెలుసుకొన్నారు. ఇక దాచి లాభం లేదని అనుకొన్నారు. నిజమేనని ఒప్పుకొన్నారు. రాజు సైనికునితో, "ఈ రాకుమార్తెలలో నీకెవరు కావాలి?" అన్నాడు. "మహారాజా! నేను పెద్దవాడిని. పెద్దరాకుమార్తెను ఇప్పించండి," అన్నాడు సైనికుడు. పెద్దరాకుమార్తెను సైనికునికిచ్చి పెళ్ళి చేశారు. తన అనంతరం సైనికుడు రాజు కావాలని ప్రకటించాడు రాజు.

# నలుగురు గాయకులు

పూర్వం ఒక మంచి చాకలి ఉండేవాడు. అతనికి ఒక గాడిద ఉంది. చాలా సంవత్సరాలుగా అది అతని దగ్గర ఉంది. ఇప్పుడు ముసలిదై పోయింది. బట్టల మూటలు మోయలేకుండా ఉంది. ఈ ముసలి గాడిదను మేపడం దండగని చాకలి విచారపడుతుండేవాడు. ఏదో ఒక విధంగా దానిని విడుదల చెయ్యాలని అప్పుడప్పుడు అంటుండేవాడు. గాడిద యజమాని ఉద్దేశం గ్రహించింది. 'బతికి ఉంటే బలుసాకు తినవచ్చు,' అనుకొంది. పైగా ఆ రాజ్యం ఏలే రాజుగారికి సంగీతం అంటే మహాప్రీతి. పాటగాళ్లను బాగా ఆదరించి, చాలా బహుమతులు ఇస్తుండేవాడు. ఆ రాజుగారి కొలువులో సంగీత విద్వాంసుడిగా చేరలేకపోతామా అని గాడిద అనుకొంది. ఒకనాడు ఇల్లు విడిచి, రాజుగారి పట్టణం దారి పట్టింది.

కొంతదూరం వెళ్ళిన తర్వాత బాట పక్కన ఒక కుక్క రొప్పుతూ రోజుతూ పడుకొని ఉంది. ఆ కుక్క దగ్గరకు వెళ్ళి గాడిద అడిగింది: "మిత్రమా! ఎందుకు అలా ఆయాసపడుతున్నావు?" "ఏమి చెయ్యమంటావు గాడిద అన్నా! నేను ముసలివాడినై పోయాను. తనకెందుకూ పనికిరానని నా యజమాని కర్ర తీసుకొని నెత్తిమీద కొట్టబోయాడు. అప్పుడేం చెయ్యమంటావు చెప్పు? 'బతుకు జీవుడా' అని పరుగెత్తి వచ్చాను. ఇక ఎలా బతకాలో దేవుడికి తెలియాలి," అని కుక్క బదులు చెప్పింది. "ఇందుకేనా భయపడుతున్నావు? మన రాజుగారి కొలువులో సంగీత

విద్వాంసుడుగా చేరాలని నేను వెళుతున్నాను. నువ్వుకూడా రాకూడదూ? నీ అదృష్టం ఎలా ఉందో!" అని గాడిద గప్పాలు కొట్టింది. సరేనని కుక్క కూడా బయలుదేరింది.

మరికొంచెం దూరం వెళ్ళేసరికి, ఒక పిల్లి దారికడ్డంగా పడుకొని వాళ్ళ వంక దిగులుగా చూసింది. "పిల్లిమామా! పిల్లిమామా! ఎందుకలా దిగులుగా ఉన్నావు?" అని గాడిద అడిగింది. "ఏం చెయ్యమంటావు గాడిద అల్లుడా! ఆపద వచ్చినప్పుడు దిగులు కాక మరేమిటి? నేను బొత్తిగా ముసలివాడనై పోయాను. ఎప్పుడూ పొయ్యి బూడిదలో వెచ్చగా కూర్చోవాలని అనిపిస్తుంది కాని, ఎలుకలను వేటాడడానికి ఓపిక ఉంటేగా? నా యజమానురాలు విసుగుపుట్టి నన్ను చెరువులో పడవెయ్యటానికి తీసుకు పోయింది. ఇంకా నేల మీద నూకలు ఉండి, తప్పించుకుని వచ్చాను ఇక ఎలా బతకను?" అని పిల్లి విచారపడింది. "ఈ మాత్రానికేనా ఇంత దిగులు? మాతో రాజుగారి కోటకు రా! నువ్వు రాత్రివేళల మంచి సంగీతం పాడతావాయె. రాజు నిన్ను కొలువులో పెట్టుకుంటాడు కూడా! ఎవరి అదృష్టం ఎలా ఉందో ఎవరు చెప్పగలరు?" అని గాడిద మళ్ళీ బడాయి కొట్టింది. పిల్లి కూడా వాళ్ళతో కలిసి బయలుదేరింది.

కొంచెం సేపైన తర్వాత వాళ్ళు ముగ్గురూ ఒక తోటలో వెళుతుండగా, ఒక చెట్టు కొమ్మమీద కోడిపుంజు చెవులు చిల్లులు పడేటట్లు అరిచింది. గాడిద కోడిపుంజును చూసి ఇలా అన్నది: "సెబాష్ కోడిపుంజా! సెబాష్! ఎంత చక్కగా అరిచావయ్యా! ఏమిటీ నీ గొడవ? చెప్పు వింటాను." "ఏమి చెప్పను గాడిద బావా! రోజూ తెల్లవారకముందే అందర్నీ గొంతుచించుకొని లేపుతానా? వాన వస్తుందో, ఎండ కాస్తుందో చెబుతుంటానా? ఇంటిచుట్టూ పురుగుపుట్రా లేకుండా తింటూ ఉంటానా? ఎంత చేసీ ఏమి లాభం? రేపు చుట్టాలు వస్తారట. నన్ను కోసి మా ఇంటి యజమానురాలు వాళ్ళకు విందు చేస్తుందట. లోకంలో న్యాయం ఎక్కడ ఉందంటావు?" అన్నది కోడిపుంజు.

"హరిహరీ, హరిహరీ! ఎంత కష్టం వచ్చిందయ్యా నీకు? సరే. మాతో

రా! ఇక్కడ ఉండి తల నరికించుకోవడం ఎందుకు? ఎవరి అదృష్టానికి ఎవరు కర్తలు. నీ గొంతు ఇంపైన గొంతు. మనమంతా కలిసి పాటకచేరి పెట్టామంటే రాజుగారు తప్పకుండా మనలను కొలువులో చేర్చుకొంటాడు," అన్నది గాడిద. "అంతకంటేనా? పదండి పోదాం!" అంటూ కోడిపుంజు కూడా వాళ్ళతో బయలుదేరింది.

ఎంత త్వరగా నడిచినా మొదటి రోజు పట్టణం చేరలేకపోయారు. పొద్దు వాలిపోయింది. పడుకోవడానికి నలుగురు గాయకులు పక్కనున్న అడవికి వెళ్ళారు. ఒక పెద్ద చెట్టు కింద గాడిద, కుక్క పడుకొన్నాయి. పిల్లి చెట్టు కొమ్మల్లో కుదురుగా కూర్చుంది. ఎందుకైనా మంచిదని కోడి చెట్టు చిటారు కొమ్మ ఎక్కి నిద్రపోయే ముందు అలవాటు ప్రకారం నాలుగువైపులా తేరిపార చూసింది. దూరంగా మినుకు మినుకుమంటూ దీపపు కాంతి కనిపించింది. తక్కిన మిత్రులను పిలిచి కోడిపుంజు ఇలా అన్నది: "దగ్గరలో ఇల్లు ఉన్నట్లుంది. దీపం కనిపిస్తోంది." గాడిద అన్నది కదా, "ఐతే అక్కడికే పోయి పడుకొందాం పదండి. ఈ అడవిలో పడుకోవడం క్షేమం కాదు." కుక్క అంది కదా, "అంతేకాక, ఏమైనా తినటానికి కూడా దొరకవచ్చు. పదండిపోదాం." కోడిపుంజు దీపం చూసిన ఇంటివైపు నలుగురూ నడిచారు. దగ్గరకు వచ్చే కొద్దీ దీపం కాంతిగా పెద్దదిగా కనపడుతూ ఉంది. ఇంటి దగ్గరకు చేరారు. ఆ ఇంట్లో దొంగలముఠా కాపురం ఉంటోంది.

అందరిలో ఎత్తుగా ఉండడంవల్ల గాడిద కిటికీ దగ్గరకు పోయి తొంగి చూసింది. "గాడిద బావా! ఏమిటి విశేషం?" అని కోడిపుంజు అడిగింది. "ఏమిటంటావా? విను – బల్లమీద రకరకాల తినుబండారాలు పెట్టుకొని దొంగలముఠా చుట్టూ కూర్చొన్నారు," అని గాడిద బదులు చెప్పింది. "అయితే మరీ మంచిది," అన్నది కోడిపుంజు. "కాని లోపలికి పోవటం ఎలాగ?" అన్నది గాడిద.

నలుగురూ కూర్చొని, దొంగలను వెళ్ళగొట్టడం ఎలాగా అని ఆలోచించారు. కొంచెం సేపటికి ఒక మంచి యుక్తిపన్నారు. గాడిద ముందుకాళ్ళు రెండూ ఎత్తి కిటికీ అంచున పెట్టి నిలబడింది. దాని వీపు



మీద కుక్క నిలిచింది. దాని వీపు మీద పిల్లి నిలిచింది. దాని వీపు మీద కోడి నిలిచింది. నలుగురూ ఒక్కమాటు అమాంతంగా సంగీతం ఆరంభించారు. గాడిద ఓండ్రపెట్టింది. కుక్క మొరిగింది. పిల్లి అరిచింది. కోడికూసింది. వెంటనే నలుగురూ కిటికీ అద్దాలు బద్దలుకొట్టి లోపలికి దూకారు. బ్రహ్మాండం పగిలినంత ధ్వనిపుట్టింది. సంగీతం విన్నప్పుడే దొంగల గుండెలు కొట్టుకున్నాయి. వెంటనే ఈ రద్దీ వినగానే, ఏవో దయ్యాలు ఇంట్లో దూరాయనుకొని ఎటున్నవాళ్ళు అటు పరుగెత్తారు.

దొంగలు పోగానే, మన సంగీత విద్వాంసులు నలుగురూ తాపీగా బల్లచుట్టూ చేరి పదార్థాలన్నీ కడుపునిండా ఆరగించారు. ఇక నెలదాకా అక్కర్లేదన్నంత తిన్నారు. కడుపులు బరువెక్కే సరికి కండ్లుకూడా బరువెక్కాయి. దీపం ఆర్పి పడుకొన్నారు. ఎవరికి అనువైన చోట వాళ్ళు పడుకొన్నారు. పెరటిలో గడ్డికుప్ప మీద గాడిద పడుకున్నది. తలుపు వెనుక చాపమీద కుక్క పడుకొన్నది. పొయ్యి బూడిదలో పిల్లి పడుకొన్నది. కోడి ఎత్తుగా

ఉన్న దూలం మీద కూర్చుంది. చాలా దూరం ప్రయాణం చేసి అలసి ఉన్నారేమో వెంటనే నిద్రపోయారు.

అర్ధరాత్రి అయింది. దొంగలుదూరంగా ఉండి చూశారు. ఇంటిలో దీపం లేదు. అలికిడి లేదు. తొందరపడి పారిపోయి వచ్చామనుకొన్నారు. వాళ్ళలో అందరికంటే ధైర్యం గల దొంగ ఒకడున్నాడు. వాడు చూసి వస్తానని బయలుదేరాడు. ఇంటి దగ్గరకు వచ్చాడు. అంతా నిశ్శబ్దంగా ఉంది. పొయ్యి దగ్గరకు వెళ్ళాడు. అగ్గిపెట్టెకోసం అటుఇటు చేతితో తడిమి చూశాడు. అగ్గిపెట్టె దొరకలేదు కాని, ఒక అగ్గిపుల్ల దొరికింది. దానితో దీపం వెలిగించాలంటే ఎలాగ? పొయ్యిలో పిల్లి కళ్ళు చింతనిప్పుల్లాగా మెరుస్తున్నాయి. ఆ నిప్పుతో అగ్గిపుల్ల మండించి దీపం వెలిగించవచ్చని అనుకొన్నాడు. పాపం! పిల్లికి ఈ సంగతి ఏమి తెలుసు? తన కన్ను పొడవటానికి వస్తున్నాడనుకొని ఒక్క ఎగురు ఎగిరి, ముఖమంతా గోళ్ళతో పీకింది. ఆ దొంగ భయంతో గజగజ వణికాడు. దొడ్డిగుమ్మం గుండా పరుగెత్తాడు. దొడ్డి గుమ్మం దగ్గరకు రాగానే, కుక్క ఎగిరి కాలు కొరికింది. పెరడులో కాలుపెట్టేసరికి గాడిద వెనక కాళ్ళు ఎత్తి ఒక్క తన్ను తన్నింది. ఈ గోల అంతా విని కోడిపుంజు లేచి ఇల్లు అదిరిపోయేటట్లు అరిచింది.

పాపం! కాళ్ళ సత్తువ కొద్దీ దొంగ పరుగెత్తి దొంగల నాయకుడితో ఇలా అన్నాడు: "ఎన్ని పెద్ద భూతాలు ఇంట్లో దూరాయనుకొన్నారు? ఒకటి గోళ్ళతో ముఖమంతా పీకింది. మరొకటి తలుపు చాటున ఉండి, నా కాలుమీద కత్తితో పొడిచింది. ఇంకొక నల్లటి భూతం పెరడులో నిలబడి కర్రతో బాదింది. అన్నింటికంటె పెద్దభూతం 'వాడిని నా దగ్గరకు లాక్కురాండి!' అని ఎంత పెద్దగా అరిచిందనుకొన్నారు?" ఈ సంగతులన్నీ విన్న తర్వాత దొంగలు ఆ ఇంటి ఛాయలకు పోలేదు. నలుగురు గాయకులకు ఆ ఇల్లు అనువుగా ఉండడంతో అందులోనే అప్పటినుంచి ఇప్పటివరకూ సుఖంగా ఉన్నారు.

# పాపయ్య అదృష్టం

పాపయ్య ఏడేళ్ళు యజమాని దగ్గర పనిచేశాడు. "అయ్యా, నాకు సెలవిప్పించండి. ఇంటికి వెళతాను. నాకు రావలసిన జీతం అంతా లెక్క కట్టి ఇప్పించండి," అని పాపయ్య యజమానిని అడిగాడు.

"నువ్వు ఇంతకాలం చాలా నమ్మకంగా పనిచేశావు. జీతమే కాదు. ఇంకా ఎక్కువే ఇస్తాను తీసుకువెళ్ళు," అని యజమాని పాపయ్యకు పాపయ్య తలకాయంత వెండిముద్ద ఇచ్చాడు.

పాపయ్య ఆ వెండిముద్దను రుమాలులో కట్టుకొని, భుజంమీద పెట్టుకొని బయలుదేరాడు. మెల్లగా కాళ్ళీడ్చుకుంటూ దారి వెంట నడుస్తున్నాడు. ఇంతలో పెద్ద గుర్రం ఎక్కి ఒకడు వస్తున్నాడు. అతనిని చూసి, "ఆహా! గుర్రం మీద స్వారీ చేయడం ఎంత సుఖమైన పని! కుర్చీలో కూర్చున్నట్లుగా హాయిగా కూర్చోవచ్చు. ఒళ్ళు కదలకుండా పోవచ్చు. రాళ్ళూ రప్పలు కాళ్ళకు కొట్టుకోవలసిన పనే ఉండదు," అని పాపయ్య అన్నాడు.

గుర్రపు రౌతు ఈ మాటలు విన్నాడు. "పాపయ్యా! మరి ఎందుకు నడిచి వెళుతున్నావు?" అని అతడు పాపయ్యను అడిగాడు.

"ఏం చెయ్యమంటావు బాబూ! ఈ మూట ఒకటి భుజం మీద ఉందే! నిజానికి ఇది వెండిమూటేననుకో! ఐతేమాత్రమేమి? దీని తస్సాదియ్యా ఎంత బరువుగా ఉంది! తల ఎత్తి నడవలేకుండా ఉన్నాను. భుజం పీకుతున్నది. కర్మం కాక ఏమిటి ఇది," పాపయ్య విచారపోతూ అన్నాడు.

"అయితే మనం మారకం చేసుకోకూడదూ! నువ్వు గుర్రాన్ని తీసుకో. నాకు నీ వెండిమూట ఇవ్వు. సరేనా?" అన్నాడు గుర్రపురౌతు. పాపయ్య అన్నాడు కదా! "మనస్ఫూర్తిగా ఇచ్చేస్తాను తీసుకో. కాని, ఆ తరవాత బరువుగా ఉన్నదని నన్నంటే లాభంలేదు."

గుర్రపురౌతు గుర్రం దిగాడు. వెండిమూట తీసుకొన్నాడు. పాపయ్యను గుర్రం మీద ఎక్కించాడు. కళ్ళెం చేతికిచ్చాడు. ఇలా చెప్పాడు: "వేగంగా గుర్రాన్ని పరుగెత్తించాలనుకొంటే బిగ్గరగా 'జిప్' అని అరువు."

గుర్రం మీద కూచోగానే పాపయ్యకు ఏనుగు ఎక్కినంత సంబరం కలిగింది. మహాసంతోషంగా స్వారి చేస్తున్నాడు. కొంచెం దూరం వెళ్ళిన తరవాత గుర్రాన్ని వేగంగా పరుగెత్తించాలనుకొన్నాడు. 'జిప్' అని బిగ్గరగా అరిచాడు. గుర్రం నాలుగు కాళ్ళ మీద లేచింది. పాపయ్య తలకిందులుగా పడి దొర్లిదొర్లి దారి పక్కనున్న మురుగుగుంటలో ఆగాడు. ఎదురుగా ఆవును తోలుకువస్తున్న పశువుల కాపరి ఆపకపోయినట్లయితే గుర్రం పారిపోయేదే. కొంచెం సేపటికి పాపయ్యకి తెలివి వచ్చి లేచాడు. అతడి ప్రాణం బాగా



విసిగిపోయింది. పశువుల కాపరితో ఇలా అన్నాడు: "ఇలాంటి గుర్రం మీద స్వారీ చేయటమంటే పరిహాసం కాదు. దీని దుంపతెగ, ఎగిరెగిరి పడుతోంది. పడవేస్తుంది. ఇక దీని జోలికి పోను బాబూ! దీనికంటే నీ ఆవు ఎంతో మేలు. కడుపులో నీళ్ళు కదలకుండా తోలుకుపోవచ్చు. పాలు తాగవచ్చు. పెరుగు తినవచ్చు. నెయ్యి తాగవచ్చు. నువ్వు ఏమి ఇస్తే ఆవును ఇస్తావు?"

"సరే. నీకు నా ఆవు మీద అంత మోజుగా ఉంటే, గుర్రాన్ని ఇచ్చి ఆవును తీసుకో," అన్నాడు పశువుల కాపరి.

"అలాగే," సంతోషంగా అన్నాడు పాపయ్య.

పశువుల కాపరి గుర్రం ఎక్కి వెళ్ళిపోయాడు. పాపయ్య మంచి లాభసాటి బేరం చేశానని మురిసిపోతూ మెల్లగా ఆవును తోలుకు పోతున్నాడు. నడుస్తూ ఇంకా ఇలా అనుకొన్నాడు: 'అనుకొన్నప్పుడల్లా ఒక రొట్టెముక్క గనుక ఉంటే, మీగడ రాసుకొని తినవచ్చు. దాహం వేస్తే తియ్యని పాలు తాగవచ్చు. ఇంకేం కావాలి అంతకంటే?'

కొంచెం దూరం రాగానే ఒక దుకాణం కనిపించింది. అక్కడ తన జేబులో ఉన్న చిల్లర అంతా ఇచ్చి, రొట్టె, మీగడ తీసుకొని తిన్నాడు. ఆకలి తీరిన తర్వాత మళ్ళీ స్వంత ఊరి వైపు ప్రయాణం సాగించాడు. మధ్యాహ్నం అయింది. ఎండ వేడి పెరిగింది. ఒక చిట్టడివి దాటవలసి వచ్చింది. చిట్టడివి దాటడానికి దాదాపు గంటసేపు పట్టింది. నోరు ఎండిపోయింది. నాలుక ఆరిపోయింది.

'ఇప్పుడు ఆవు పాలు పిండి తాగుతాను,' అనుకొని పాపయ్య ఆవును ఒక చెట్టుకు కట్టాడు. నోరు తెరచిపట్టి పాలు పిండనారంభించాడు. ఒక చుక్క పాలు కూడా రాలేదు సరికదా, ఆవు అతని తలమీద ఒక్క తన్ను తన్నింది. పాపయ్య స్పృహతప్పి పడిపోయాడు. కొంచెం సేపటికి ఒక కసాయివాడు పంది మెడలో తాడుకట్టి లాక్కుపోతూ పాపయ్యను చూసి, అక్కడకు వచ్చాడు. పాపయ్యను లేపి, "ఏమి జరిగిందేమిటి?" అని అడిగాడు. పాపయ్య జరిగిన సంగతి యావత్తూ చెప్పాడు. కసాయివాడు అన్నాడు

కదా: "ఆవు ముసలిదై పోయింది. ఇంకేం పాలిస్తుంది? కోసుకు తినడానికి తప్ప, ఇంకెందుకూ పనికి రాదు." ఈ మాట అని తన దగ్గర ఉన్న నీటిచెంబును పాపయ్యకు అందించాడు.

"రామ! రామ! ఆ సంగతి నాకేం తెలుసు? నేను దాన్ని చంపి ఏం చేసుకొనేది? ఆవు మాంసం నేను తినను. పంది మాంసమైతే నాకు ఎంతో ఇష్టం," అన్నాడు పాపయ్య. "అయితే మంచిదే. ఈ పందిని తీసుకొని, ఆవుని ఇవ్వు," అన్నాడు కసాయివాడు.

"ఎంత దయగలవాడవు. నిన్ను భగవంతుడు కూడా మెచ్చుకొంటాడు," అంటూ పాపయ్య ఆవునిచ్చి పందిని తీసుకొన్నాడు.

పాపయ్య పందిని తోలుకుంటూ వెళుతున్నాడు. అన్ని చిక్కులూ, అదృష్టం కొద్దీ తీరిపోయాయనుకొన్నాడు. తన శ్రమకు తగిన ఫలం దొరికిందనుకొన్నాడు. ఇంతలో ఒక రైతు పెద్ద బాతును చంకలో పెట్టుకొని వస్తున్నాడు. రైతు పాపయ్యను పిలిచి సమయం ఎంతైందని అడిగాడు. పాపయ్య సమయం చెప్పటం సంగతి అలా ఉంచి, తాను ఎన్నెన్ని బేరాలు చేసిందీ, ఏ విధంగా చేసిందీ వర్ణించి చెప్పాడు. రైతు అన్నాడు కదా: "నేను బాతును అమ్మటానికి తీసుకుపోతున్నాను. ఇది రెండు నెలల పిల్ల. ఎంత బరువుందో చూడు. అంతా కొవ్వే. కోసుకు తింటే ఎంత మజాగా ఉంటుందో ఏం చెప్పను."

పాపయ్య బాతును పట్టుకుని చూశాడు. "నువ్వు చెప్పిన మాట నిజమే. అయితే నా పంది తక్కువదనుకొన్నావా?" అన్నాడు.

రైతుకు కొంచెం చిరాకు పుట్టింది. ఎలాగైనా పందిని కాజేయాలని అనుకొన్నాడు. అన్నాడు కదా: "ఆగు! ఆగు! ఈ పక్క ఊళ్ళో ఒక ఆసామి పందిని ఎవరో దొంగలు తీసుకుపోయారని వెదుకుతున్నారు. నిన్ను చూశారంటే కొంప మునుగుతుంది. తప్పదు. నువ్వే దొంగవని పట్టుకొంటారు. కాళ్ళూ చేతులు కట్టివేసి జైలుకొట్లో తోస్తారు."

పాపం! పాపయ్యకు అపరిమితమైన భయం పుట్టింది. "బాబూ! ఎలాగైనా నన్ను కాపాడు. ఈ ఊరికి నేను కొత్తవాడిని. నన్నేమి చేసినా

చేస్తారు. దయవుంచి పందిని తీసుకొని బాతును నాకివ్వు," అని పాపయ్య రైతును బతిమలాడాడు. "పాపం! నిన్ను చూస్తే నాకు జాలివేస్తున్నది. నువ్వు పందినిచ్చి ఎదురు డబ్బులిస్తే గాని బాతును ఇవ్వకూడదనుకున్నాను. కాని నువ్వు కష్టంలో ఉన్నావు. నిన్ను ఇబ్బంది పెట్టడానికి నాకు మనస్సు ఒప్పడం లేదు," అని రైతు అన్నాడు. రైతు పందిని తీసుకొని బాతును పాపయ్యకి ఇచ్చాడు. ఆపద గడచాను కదా అని పాపయ్య సంతోషిస్తూ దారిపట్టాడు.

'ఆఖరుకు బాతు దొరకడం మేలే ఐంది. హాయిగా బాతుమాంసం వేపుడు చేసుకొని తింటాను. దాని ఈకలతో మంచి దిండు చేసుకొని సుఖంగా పడుకొంటాను,' అనుకొంటూ, లొట్టలు వేస్తూ పాపయ్య బాతును చంకన పెట్టుకొని నడుస్తున్నాడు.

చివరికి ఊరికి వచ్చేటప్పటికి వీధిలో కత్తులు సానబట్టే వాడు సానరాయి తిప్పుతూ పాడుతున్నాడు:

*"కొండమీదను, కోనల మీద*
*పాటు తక్కువ, సుఖం ఎక్కువ*
*ప్రపంచమెల్లను నా ఇల్లే*
*ఇలపై నాకు మించిన సుఖము*
*ఎవ్వరికైనా లేనే లేదు."*

పాపయ్య కత్తులు సానపట్టడం చూస్తూ కొంచెం సేపక్కడ నిలబడ్డాడు. కత్తులు సానపట్టే వాడితో: "నిర్విచారంగా బతుకుతావులా ఉందే! ఎంతో సంతోషంగా పనిచేస్తున్నావు," అన్నాడు.

"ఔను ఔను. నాది బంగారం లాంటి వృత్తి. కత్తులు సానబట్టే వాడికి ఎప్పుడు జేబులో చెయ్యిపెడితే అప్పుడు డబ్బులు దొరుకుతాయి. అయితే, ఆ బాతును ఎక్కడ కొన్నావు?" అని అడిగాడు కత్తులవాడు.

"కొనలేదు. పందిని ఇచ్చి తీసుకొన్నాను."

"అయితే పంది ఎలా వచ్చింది?"

"ఆవునిచ్చి తీసుకొన్నాను."

"ఆవు ఎలా వచ్చింది?"

"గుర్రం ఇచ్చి తీసుకొన్నాను."

"గుర్రం ఎలా వచ్చింది?"

"నా తలకాయ అంత వెండిముద్ద ఇచ్చి తీసుకొన్నాను."

"మరి వెండి ఎలా వచ్చింది?"

"ఏడు సంవత్సరాలు చాకిరిచేస్తే వచ్చింది."

"ఇంత వరకూ నీకు బాగా కలిసివచ్చిందనే మాట ఖాయం. ఇక ఎప్పుడు జేబులో చెయ్యిపెడితే అప్పుడు డబ్బులు దొరికేట్లు చేసుకొన్నావంటే నీ అదృష్టం పండినట్లే," అన్నాడు కత్తులవాడు.

"నిజమే. కాని అది ఎలా జరుగుతుంది?"

"నాలాగే నువ్వు తయారైతే సరి. నీకు కావలసింది సానపట్టే రాయిమాత్రమే. తక్కిన పని దానంతట అదే జరుగుతుంది. నా దగ్గర ఒక మంచిరాయి ఉంది. నీకు కావాలంటే ఇస్తాను. దానికి బదులు నాకు బాతునిస్తే చాలు. ఏమంటావు? కొంటావా?" అని కత్తులవాడు ఆశపెట్టాడు.

"సందేహం ఎందుకయ్యా? ఎప్పుడు జేబులో చెయ్యిపెడితే అప్పుడు డబ్బులు వచ్చే పని దొరికితే ఇంకేం కావాలి? తీసుకో. బాతును తీసుకొని సానరాయి ఇలా ఇవ్వు," అని ఉత్సాహంతో పాపయ్య అన్నాడు.

ఒక పనికిరాని రాయిని పాపయ్య చేతికిచ్చి, "ఇది చాలా గొప్ప సానరాయి. తుప్పుపట్టిన మేకైనా సరే, సానపట్టావంటే వజ్రాయుధంలా తయారవుతుంది," అని సానవాడు మళ్ళీ కోతలుకోశాడు.

పాపయ్య బాతును ఇచ్చి, రాయిని తీసుకొని సంబరపడుతూ బయలు దేరాడు. అతని కళ్ళు సంతోషంతో మెరిశాయి. ఇలా అనుకొన్నాడు: 'నేను పుట్టినవేళ ఎంత మంచిదో! ఏది కావాలనుకొంటే అది దానంతట అదే వస్తోంది.'

ఉదయం నుంచి నడుస్తూ ఉండడం వల్ల పాపయ్య బాగా అలసి పోయాడు. ఆకలి వేస్తోంది. దాహంగా కూడా ఉంది. పైగా రాయి బరువుగా కూడా ఉంది. మెల్లగా ఒక చెరువు దగ్గరకు వచ్చాడు. నీళ్ళు తాగి, కొంచెంసేపు చెరువు గట్టు మీద విశ్రాంతి తీసుకుందామనుకున్నాడు. చెరువు

గట్టున సానరాయి పెట్టి నీళ్ళు తాగడానికి వెళ్ళాడు. వెళ్ళటంలో రాయి కాలికి తగిలింది. దొర్లుతూ వెళ్ళి చెరువులో పడింది. పాపయ్య అది నీళ్ళలో మునిగిపోయేదాకా చూశాడు. మోకరించి కన్నీళ్ళు పెట్టుకొని భగవంతుడిని ప్రార్థించాడు, "స్వామీ! ఎంత దయ నీకు నామీద? ఈ పాడు బరువు తప్పించావు. నాకిక ఏ కష్టమూ లేదు. ఇప్పుడు నాకెంత సుఖంగా ఉంది? నా అంత అదృష్టవంతుడు ప్రపంచంలోనే లేడు."

పాపయ్య లేచి, సంతోషంగా నడిచి తన తల్లి ఉన్న ఇల్లు చేరుకొన్నాడు.

# మసిబొగ్గు

ఒక ధనికుని భార్య జబ్బు పడింది. ఇక కొంచెం సేపటికి చచ్చిపోతుందనగా తన కూతురును మంచం దగ్గరకు పిలిచి, "అందరితోనూ మంచిగా ఉండమ్మా! నేను స్వర్గంలో ఉండి నిన్ను కనిపెట్టి ఉంటాను," అని చెప్పి ఆమె కళ్ళుమూసుకుంది. ప్రాణాలు విడిచింది. భర్త ఆమెను తోటలో పూడ్చిపెట్టించాడు. కూతురు రోజూ తల్లిని పూడ్చిపెట్టిన గుంట దగ్గరకు వెళ్ళి వెక్కివెక్కి ఏడుస్తుండేది. తల్లి చెప్పిన ప్రకారం అందరికీ తలలో నాలుకలాగా మెలుగుతుండేది.

సంవత్సరం తిరగకముందే ఆ ధనికుడు మరొక భార్యను పెళ్ళి చేసుకొన్నాడు. ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. ఈ పిల్లలిద్దరి ముఖాలు అందంగానే ఉంటాయి కాని, వాళ్ళ మనస్సు అంతా విషమే. అక్కమీద ఎప్పుడూ కారాలు మిరియాలు నూరుతుండేవారు. "ఈ పాడుముండ ఇంట్లో కూర్చుని ఏం చేస్తుంది? ఊరికే ఉంటే తినటానికి ఎక్కడనుంచి వస్తుంది? వంటమనిషిని పంపించేద్దాం," అన్నారు. ఆ పిల్ల తొడుక్కున్న మంచి దుస్తులన్నీ విడిపించి, పాత బట్టలు కట్టించారు. పకపకా నవ్వారు. వంట ఇంట్లోకి పంపించారు. వంటగత్తెను చేశారు.

పాపం! ఆ అమ్మాయిని తెల్లవారుఝామునే లేపేవారు. నీళ్ళు తెప్పించేవారు. పొయ్యి వెలిగించమనే వారు. అంట్లు తోమించేవారు. వంటచేయించే వాళ్ళు. ఇన్ని పనులు చేస్తున్నా ఆ పిల్లను సవతి కూతుళ్ళిద్దరూ

రాచిరంపాన పెడుతుండేవాళ్ళు. ఎప్పుడూ ఎగతాళి చేస్తుండేవాళ్ళు. రాత్రి పనిపాటలన్నీ అయ్యేటప్పటికి ఆ పిల్ల చాలా అలసిపోయేది. కాని పడుకోవడానికి మంచం కూడా ఇచ్చేవాళ్ళు కాదు. చింకిచాప ఇచ్చి పొయ్యి దగ్గరే నేలమీద పడుకోమనే వారు. ఇలా రేయింబవళ్ళు ఊడిగం అంతా చేస్తూ, మురికిలోనే తిరుగుతూ, మురికిలోనే పడుకొంటూ ఉండడంతో ఆ పిల్ల బట్టలంతా, ఒడలూ మురికి పట్టి ఉండేవి. అందుకని సవతితల్లి కూతుళ్ళు ఆ పిల్లను 'మసిబొగ్గు' అని పిలిచేవారు.

ఒకనాడు పక్కనున్న ఊళ్ళో సంత జరుగుతున్నది. తండ్రి సంతకు ప్రయాణమై తన రెండవ భార్య పిల్లలను ఏమి కావాలని అడిగాడు. పెద్దపిల్ల "నాకు మంచి బట్టలు తీసుకురా నాన్నా!" అన్నది. రెండవ పిల్ల, "నాకు ముత్యాలు, రత్నాలు కొనుక్కురా నాన్నా!" అని అడిగింది. తర్వాత తండ్రి మొదటి భార్య కూతురు దగ్గరకు వచ్చి, "నీకేమి కావాలమ్మా?" అని అడిగాడు. "నాన్నా, నాకు తెల్లగన్నేరు కొమ్మ తెచ్చి పెట్టు," అన్నది ఆ అమ్మాయి.

తండ్రి సంతనుంచి మంచిబట్టలు, ముత్యాలు, రత్నాలు తెచ్చి ఇద్దరు కూతుళ్లకూ ఇచ్చాడు. తోవలో ఒక పెద్ద తెల్లగన్నేరు కొమ్మ తెచ్చి మసిబొగ్గు అనే అమ్మాయికి ఇచ్చాడు. ఆ అమ్మాయి ఆ కొమ్మను తీసుకుపోయి తల్లిని పూడ్చిపెట్టిన గుంటమీద పాతింది. పాపం! ఆ పిల్ల తల్లిని తలుచుకొని గోడుగోడున ఏడ్చింది. రోజురోజుకు ఆ కొమ్మ వేళ్ళు నాటుకొని, పెరిగి, పెరిగి, కొంతకాలానికి పెద్ద చెట్టయింది. రోజూ మూడు పూటలా మసిబొగ్గు ఆ చెట్టు దగ్గరకు వెళ్ళి తాను పడే పాట్లన్నీ చెప్పుకొని ఏడుస్తుండేది. మరి కొంతకాలానికి ఒక పిట్ట వచ్చి ఆ చెట్టు కొమ్మ మీద గూడు కట్టుకుంది. ఆ పిట్ట రోజూ మసిబొగ్గుతో మాట్లాడుతుండేది. మసిబొగ్గును కనిపెట్టి చూస్తూ ఉండేది. ఆ పిల్ల ఏమి కావాలంటే అది తెచ్చి ఇస్తుండేది. ఇలా కొంతకాలం గడచిపోయింది.

ఒకనాడు ఆ పట్టణం ఏలే రాజు పెద్ద విందు తలపెట్టాడు. విందు మూడు రోజులు జరుగుతుంది. ఆ విందుకు వచ్చిన ఆడపిల్లలలో అందమైన అమ్మాయిని రాకుమారుడు పెళ్ళాడుతాడు. మసిబొగ్గు చెల్లెళ్ళిద్దరికీ ఆహ్వానం

వచ్చింది. వెంటనే ఆ ఇద్దరూ మసిబొగ్గును పిలచి, "ఏయ్ మా తల దువ్వు. చెప్పులు తుడువు. పట్టుబట్టలు తీసి ఇవ్వు. మేము రాజుగారి విందుకు పోతున్నాం," అని దాష్టీకం చేశారు. ఆ అమ్మాయి వాళ్ళు చెప్పిన పనులన్నీ చేసింది. అంతా అయిన తర్వాత ఆమెకు ఏడుపు ఆగలేదు. వెక్కి వెక్కి ఏడ్చింది. తానుకూడ విందుకు వెళ్ళాలనుకొంది. ఎలాగో ధైర్యం తెచ్చుకొని సవతితల్లిని అడిగింది. "నువ్వా? రాజుగారి విందుకా? నీకసలు బట్టలేవి? ఏం వేసుకుపోతావు? ఏం చోద్యంగా ఉందే తల్లీ?" అంటూ విసుక్కుపోయింది సవతితల్లి. మసిబొగ్గు పట్టుదల విడవలేదు. తల్లిని మళ్ళీ మళ్ళీ జాలిగా బతిమలాడింది. ఈ పీడ ఎలా వదలించుకోవటమా అని తల్లి ఆలోచించింది. ఆమెకొక మంచి ఉపాయం తోచింది, "చూడు! మానెడు రాగులు బూడిద కుప్ప మీద పోస్తా. రెండు గంటలలో నువ్వు అన్నీ ఏరి చేటలో పోయగలిగితే అలాగే నువ్వూ విందుకు వెళుదువుగాని," అన్నది. మానెడు రాగులు బూడిద దిబ్బమీద పోసింది. వెంటనే ఆ పిల్ల దొడ్డివాకిలి గుండా తోటలోకి పరుగెత్తి గన్నేరుచెట్టు దగ్గరకు వెళ్ళి, ఆకాశం వంక చూస్తూ ఇలా పిలిచింది:

*"చెట్టులను గుట్టలను*
*పట్టి నావలెనే అ*
*నాథలై తిరిగేటి*
*సాధు పక్షుల్లార!*
*చిన్న ఉపకారమ్ము*
*చేసి పెట్టండమ్మ!*
*చిన్నారిపొన్నారి*
*అన్నదమ్ముల్లార!*
*దయచేయు డిచ్చటికి*
*దయచేయు డిచ్చటికి!"*

ముందుగా రెండు తెల్లటి పావురాలు వచ్చాయి. ఆ తర్వాత ఒక్కటొక్కటే అన్నిరకాల పిట్టలూ రెక్కలు టపటప కొట్టుకుంటూ వచ్చి బూడిద దిబ్బ మీద వాలాయి. ముందు పావురాళ్ళు పని ప్రారంభించాయి. వాటిని చూసి

తక్కినవన్నీ పనిలో మునిగాయి. గంట కాకముందే మానెడు రాగులూ ఏరి చేటలో పోశాయి. మళ్ళీ ఎక్కడి పిట్టలక్కడ ఎగిరిపోయాయి. మసిబొగ్గు చేట తెచ్చి తల్లి దగ్గర పెట్టింది. ఇక విందుకు పోనిమ్మని అడిగింది. "అలా వీలులేదు. దౌర్భాగ్యురాలా! బట్టలూ గిట్టలూ లేకుండా ఎలా వెళతావు?" అని కోపగించుకుంది తల్లి. ఆ పిల్ల పట్టువిడవకుండా తల్లిని మరీ మరీ బతిమలాడింది. "అయితే ఈసారి రెండు మానికలు రాగులు బూడిదలో నుంచి ఒక గంటసేపులో ఏరి తెస్తే పంపిస్తాను," అని చివరకు తల్లి అన్నది. ఆ ప్రకారమే రెండు మానికల రాగులు బూడిదలో కలిపింది. మసిబొగ్గు దొడ్డిగుమ్మం గుండా తోటలోకి పరుగెత్తుకు వచ్చి మళ్ళీ పిట్టలను ఇలా పిలిచింది:

*"చెట్టులను గుట్టలను*
*పట్టి నావలెనే అ*
*నాథలై తిరిగేటి*
*సాధు పక్షుల్లార!*
*చిన్న ఉపకారమ్ము*
*చేసి పెట్టండమ్మ!*
*చిన్నారిపొన్నారి*
*అన్నదమ్ముల్లార!*
*దయచేయు డిచ్చటికి*
*దయచేయు డిచ్చటికి!"*

మళ్ళీ రెండు తెల్లపావురాళ్ళు ముందు వచ్చాయి. ఆ తర్వాత అన్ని పిట్టలూ వచ్చాయి. రాగులన్నీ ఏరి అరగంట కాకముందే చేటలో పోశాయి. ఎక్కడి పిట్టలక్కడ ఎగిరిపోయాయి. మసిబొగ్గు చేట తెచ్చి తల్లి ముందు పెట్టింది. ఇక నన్ను పోనిమ్మని అడిగింది. "లాభం లేదు. నీకు బట్టలేవి? ఏమి వేసుకు వస్తావు? నువ్వు వస్తే మా పరువు పోతుంది," అని తిట్టి తల్లి తన ఇద్దరు పిల్లలనూ వెంటపెట్టుకొని విందుకుపోయింది. వాళ్ళ వెంటనే తండ్రికూడా వెళ్ళాడు.



అందరూ వెళ్ళిపోయేదాకా ఉండి, పాపం! ఆ అమ్మాయి విచారపడుతూ వెళ్ళి గన్నేరు చెట్టు కింద కూర్చొని ఇలా పిలిచింది.

*"పడవేయుము, పడవేయుము*
*పడవేయుము, గన్నేరా!*
*పైడిబట్టలు, వెండిబట్టలు*
*పడవేయుము గన్నేరా!"*

ఆమె స్నేహితురాలు వెంటనే చెట్టునుంచి ఎగిరిపోయింది. బంగారు, వెండి దుస్తులు, ముఖమల్ చెప్పులు తెచ్చింది. మసిబొగ్గు ఆ దుస్తులు వేసుకుంది. చెప్పులు తొడుక్కుంది. తన చెల్లెళ్ళ వెనకనే విందుకు వెళ్ళింది. కాని, ఆ పిల్లలు ఈ అమ్మాయిని గుర్తుపట్టలేకపోయారు. ఆ దుస్తుల్లో ఆమె ఎంతో అందంగానూ, నాజూకుగానూ ఉంది. వాళ్ళామెను ఎవరో రాకుమారి అనుకొన్నారు.

విందుకు వెళ్ళగానే రాకుమారుడు ఆమె చేయి పట్టుకొని తీసుకొని వెళ్ళి తన దగ్గరే కూర్చోబెట్టుకున్నాడు. విందయ్యే వరకూ రాకుమారుడు ఆమెతో ఏవో కబుర్లు చెబుతూ ఉన్నాడు. అర్ధరాత్రి అయిపోయింది. ఆమె వెళతానని లేచింది. రాకుమారుడు ఆమె ఇల్లు తెలుసుకోవాలనుకొని, "మీ ఇంటి దగ్గర నిన్ను దింపి వస్తాను. పద," అన్నాడు. జనంలో ఆమె మెల్లమెల్లగా రాకుమారునికి కనబడకుండా తప్పించుకొని వెళ్ళిపోయింది. రాకుమారుడామె వెంట బయలు దేరాడు. ఆమె ఇంటికి వచ్చి కోళ్ళ ఇంట్లో దాగి, తలుపు బిగించింది. ఆమె తండ్రి వచ్చేదాకా రాకుమారుడు అక్కడ కాపలా కాశాడు. తండ్రి రాగానే, "ఎవరో తెలియని అమ్మాయి విందుకు వచ్చింది. తిరిగివచ్చి ఈ కోళ్ళ గుడిసెలో దాగింది," అన్నాడు. తలుపు ఎంత నెట్టినా రాలేదు. తలుపులు పగలగొట్టారు. లోపల చూస్తే ఎవ్వరూ లేరు.

ఈ లోపల మసిబొగ్గు కోళ్ళ ఇంటి వెనకగుమ్మం గుండా గన్నేరు చెట్టు దగ్గరకు పరుగెత్తింది. తన బంగారు బట్టలు చెట్టు కింద పడవేసి మామూలు మాసిన బట్టలు కట్టుకొంది. తిరిగి వంటింట్లోకి వచ్చి చింకిచాప పరచుకొని పడుకొన్నది. రాకుమారుడూ, తండ్రి వచ్చి చూసేటప్పటికి మసిబొగ్గు వంటింట్లో పడుకొని నిద్రపోతున్నది.

మళ్ళీ రెండవనాడు విందు జరుగుతున్నది. సవతితల్లి, ఆమె పిల్లలూ, తండ్రీ విందుకు వెళ్ళగానే, మసిబొగ్గు గన్నేరు చెట్టు దగ్గరకు వెళ్ళి ఇలా అడిగింది:

*"పడవేయుము, పడవేయుము*
*పడవేయుము, గన్నేరా!*
*పైడిబట్టలు, వెండిబట్టలు*
*పడవేయుము గన్నేరా!"*

పిట్ట ఎగిరిపోయి నిన్నటికంటే చక్కని బట్టలు తెచ్చి ఇచ్చింది. ఆమె విందుకు రాగానే అందరూ ఆమెవైపే చూశారు. రాకుమారుడు ఆమెకోసం ఎదురు చూస్తున్నాడు. చేయి పట్టుకొని తీసుకుపోయి తన పక్కనే

కూర్చోపెట్టుకున్నాడు. కులాసాగా ఆమెతో కబుర్లు చెప్పాడు. అర్ధరాత్రి అయింది. విందు ముగిసింది. ఆమె ఇంటికి వెళతాననగానే నిన్నలాగానే రాకుమారుడు ఆమె వెంట బయలు దేరాడు. కాని జనం సందడిలో ఎలాగో తప్పించుకొని మసిబొగ్గు ఇంటికి పరుగెత్తింది. కాని, రాకుమారుడు తరుముకు వస్తున్నాడాయే! ఏమీ పాలుపోక ఆమె తోటలో ఒక పొదలో దాగింది. ఆమె ఎటుపోయిందీ రాకుమారుడు కనిపెట్టలేకపోయాడు. తండ్రి ఇంటికి వచ్చేదాకా ఉండి ఆయనతో ఇలా అన్నాడు: "విందుకు వచ్చిన ఆ తెలియని పిల్ల ఇటే వచ్చింది. ఎటుపోయిందో కనిపించలేదు. బహుశా ఈ పొదలో దూరి ఉంటుందేమో!" 'మసిబొగ్గు కాదు కదా!' అని తండ్రికి కొంచెం అనుమానం కలిగింది. గొడ్డలి తెప్పించి పొద నరికించాడు. పొదలో ఎవరున్నారు కనబడడానికి! పొదకు ఆ వైపునుంచి మసిబొగ్గు జారుకొని, గన్నేరు చెట్టుకింద దుస్తులు పడవేసి, తన మామూలు మురికిబట్టలు కట్టుకొన్నది. యధాప్రకారం వంటింట్లో చింకిచాపమీద పడుకుంది. రాకుమారుడూ, తండ్రి ఇంటికివచ్చి చూస్తే వంటింట్లో మసిబొగ్గు నిద్రపోతూ ఉంది.

మూడవ నాడు తండ్రి, తల్లి, ఇద్దరు పిల్లలూ విందుకు వెళ్ళగానే మసిబొగ్గు గన్నేరుచెట్టు దగ్గరకు వచ్చి అడిగింది:

*"పడవేయుము, పడవేయుము*
*పడవేయుము, గన్నేరా!*
*పైడిబట్టలు, వెండిబట్టలు*
*పడవేయుము గన్నేరా!"*

దయగల పిట్ట నిన్నటికంటే కూడా అందమైన బట్టలు తెచ్చి ఇచ్చింది. బంగారురేకుతో చేసిన చెప్పులు తెచ్చి ఇచ్చింది. విందుకు రాగానే ఆమెను చూసినవాళ్ళ ఆశ్చర్యానికి అంతులేదు. రాకుమారుడు ఆమె కోసం ఎదురుచూస్తూ ఉన్నాడు. ఆమె రాగానే చేయిపట్టుకొని తీసుకుపోయి పక్కనే కూర్చోబెట్టుకున్నాడు. ఆ కబుర్లూ, ఈ కబుర్లూ చెప్పాడు. అర్ధరాత్రి అయింది. విందు అయిపోయింది. ఆమె వెళతానని లేచింది. 'ఈసారి ఈమెను వదిలి



పెట్టకూడదు,' అని రాకుమారుడు మనస్సు గట్టిచేసుకొని తానుకూడా వెంటవస్తానన్నాడు. కాని, ఎలాగైతేనేమి, మనుషుల సందడిలో ఆమె రాకుమారుడిని తప్పించుకొని తుర్రున పారిపోయింది. ఇలా పోయేటప్పుడు ఆమె ఎడమకాలి బంగారు చెప్పు మెట్లమీద జారిపడిపోయింది. వెనకకు తిరిగితే ఆలస్యమైతే, ఈ లోగా రాకుమారుడు వస్తే, చిక్కువస్తుందని చెప్పు తీసుకోకుండానే ఆ పిల్ల పారిపోయింది.

రాకుమారుడు ఆ చెప్పు తీసుకొన్నాడు. రెండవనాటి ఉదయం రాజు దగ్గరకు వెళ్ళాడు. "ఈ బంగారు చెప్పు ఎవరి కాలికైతే సరిపోతుందో ఆ పిల్లనే పెళ్ళాడతాను!" అన్నాడు.

ఈ సంగతి విని మసిబొగ్గు సవతితల్లి కూతుళ్ళిద్దరూ మురిసిపోయారు. ఎందుకనంటే వాళ్ళ పాదాలు ఎంతో అందంగా ఉంటాయి. బంగారు చెప్పు తప్పకుండా తమకు సరిపోతుందనుకొన్నారు. పెద్దకూతురు తల్లిని వెంటబెట్టుకొని రాజుకోటకు వెళ్ళింది. ఇద్దరూ బంగారు చెప్పు ఉన్న గదిలోపలికి వెళ్ళారు. కూతురు తొడిగిచూసింది. బొటనవేలు పట్టలేదు.

"వెధవ బొటనవేలు! రాణి అయితే చాలదూ! ఈ దిక్కుమాలిన బొటనవేలు ఉండి ఏమి ఉద్ధరిస్తుంది? కోసివెయ్యి!" అంటూ తల్లి చాకు అందించింది. ఆ వెర్రిపిల్ల రాణి అవుదామనే ఆశతో అన్నీ మరచిపోయి బొటనవేలు కోసివేసింది. కూతురు పాదాన్ని తల్లి బలవంతంగా బంగారు చెప్పులోపలికి తోసింది. చెప్పంతా నెత్తురుతో నిండిపోయింది. ఇద్దరూ రాకుమారుని దగ్గరకు వెళ్ళారు. రాకుమారుడు సంతోషించి పిల్లను, తల్లినీ, గుర్రపుబగ్గీలో తన పక్కన కూర్చోబెట్టుకున్నాడు. పిల్ల తండ్రి ఇంటికి వస్తున్నాడు. బండి గన్నేరు చెట్టు దగ్గరకు రాగానే ఆ చెట్టు కొమ్మ మీద కూర్చొని పిట్ట ఇలా పాడింది:

*"ఎంత పిచ్చి వాడమ్మా!*
*ఈ రాకుమారుడమ్మా!*
*బొటన వేలు నరకగానె*
*పొలతి రాణి ఔతుందా?*

*ఎంత పిచ్చి వాడమ్మా!*
*ఈ రాకుమారుడమ్మా!"*

ఈ పాట వినగానే రాకుమారునికి అనుమానం పుట్టింది. ఆ అమ్మాయి పాదం చూశాడు. నెత్తురు కారుతూ ఉంది. మోసం గ్రహించాడు. తండ్రి ఇంటికి తెచ్చి ఆమెను దించాడు. "ఈమెకు చెప్పు చాలలేదు. రెండవ పిల్ల చేత తొడిగించి చూడండి," అన్నాడు. తల్లి చెప్పు లోపలకు తీసుకుపోయి రెండవ కూతురుతో తొడిగించింది. అంతా సరిపోయింది గాని, మడమ పట్టలేదు. తల్లి ఆ పిల్ల మడమను పిసికి, పిసికి ఎలాగైతేనేమి చెప్పులో తోసింది. పాపం! ఆ పిల్ల మడమ చిట్లిపోయి నెత్తురు కారింది. ఎలాగో ఓర్చుకొని రాకుమారుని దగ్గరకు వచ్చింది. రాకుమారుడు సంతోషించాడు. ఆ పిల్లను బగ్గీ ఎక్కించుకొన్నాడు. బయలుదేరాడు. గన్నేరు చెట్టు దగ్గరకు వచ్చేటప్పటికి పిట్ట మళ్ళీ పాడింది:

*"ఎంత పిచ్చి వాడమ్మా!*
*ఈ రాకుమారుడమ్మా!*
*తెల్లనివన్నీ పాలా?*
*నల్లనివన్నీ నీళ్ళా?*
*ఎంత పిచ్చి వాడమ్మా!*
*ఈ రాకుమారుడమ్మా!"*

రాకుమారునికి మళ్ళీ అనుమానం వచ్చింది. ఆ పిల్ల పాదం చూశాడు. చెప్పు నుంచి నెత్తురు కారుతోంది. మోసం గ్రహించాడు. తిరిగి ఆ పిల్లను ఇంటి దగ్గర దించి, తండ్రితో "నీకింకా కూతుళ్ళెవరూ లేరా?" అని అడిగాడు. "లేకేమి అయ్యా! నా మొదటి భార్య కూతురు ఉంది. అది వట్టి వెర్రిపిల్ల. అది మీకు నచ్చదు," అని తండ్రి బదులు చెప్పాడు. "వద్దు, వద్దు, అది వట్టి మురికి పిల్ల. దాన్ని తీసుకురావద్దు," అని తల్లి అన్నది. "ఆ పిల్లనొకసారి తీసుకురండి. చూస్తాను," అని రాకుమారుడు పట్టుబట్టాడు. మసిబొగ్గు ముఖమూ, చేతులూ కడుగుకొని వచ్చి రాకుమారునికి నమస్కరించింది. రాకుమారుడు ఆమెకు చెప్పు అందించాడు. ఆమె కోసమే చేసినదా అన్నట్లు

ఆ చెప్పు ఆమె కాలికి సరిగా సరిపోయింది. రాకుమారుడు ఆమె ముఖం తేరిపార చూశాడు. గుర్తుపట్టాడు. "ఈ అమ్మాయే నా భార్య," అన్నాడు. తల్లికి, ఆమె పిల్లలకు ఆశ్చర్యమేమిటి, భయం కూడా పుట్టి, వెల వెల పోయారు. మసిబొగ్గును రాకుమారుడు బండి ఎక్కించుకోగానే వాళ్ళు కోపంతో మండిపోయారు. రాకుమారుని బండి గన్నేరు చెట్టు దగ్గరకు రాగానే పిట్ట ఇలా పాడింది:

*"మంచి అందగాడమ్మా!*
*మా రాకుమారుడమ్మా!*
*అందాల రాణి అమ్మా!*
*ఆ పెళ్ళి కూతురమ్మా!*
*పెళ్ళి చూసివద్దామా!*
*పిట్టలార వస్తారా?"*

అని పాడుతూ పిట్ట పెళ్ళికూతురు భుజంమీద వాలింది. బండి కోట లోపలికి వెళ్ళిపోయింది.

# గులాబి మొగ్గ

పూర్వకాలంలో ఒక రాజు, రాణి ఉండేవాళ్ళు. వాళ్ళకు సంతానం లేదు. సంతానం లేనందుకు వాళ్ళకు చాలా విచారంగా ఉండేది. కాని, అదృష్టవశాత్తు, కొంత కాలమైన తర్వాత రాణీకి ఒక కూతురు పుట్టింది. ఆ పిల్ల చక్కనిచుక్క. రాజు ఆ పిల్లను చూసి మురిసిపోయాడు. కుమార్తె పుట్టినందుకు ఒక పెద్ద విందు ఏర్పాటుచేశాడు. చుట్టపక్కాలను, స్నేహితులను, ఇరుగుపొరుగు వాళ్ళనే కాకుండా తన రాజ్యంలో ఉన్న దేవకన్యలను కూడ విందుకు పిలిచాడు. ఆ రాజు రాజ్యంలో పదముగ్గురు దేవకన్యలున్నారు. అయితే, రాజు ఇంట్లో పన్నెండు బంగారుపళ్ళాలే ఉన్నాయి. అందుకని, పదమూడవ దేవకన్యను పిలవలేదు. తక్కిన పన్నెండుగురు దేవకన్యలూ విందుకు వచ్చారు. విందు ముగిసింది. పన్నెండుమంది దేవకన్యలూ రాకుమారికి వరాలు ఇచ్చారు. ఒకరు నీతి, ఒకరు అందం, ఒకరు భోగభాగ్యాలు, ఇలా పన్నెండుమంది అంతా ఆ అమ్మాయికి వచ్చేటట్లు వరాలిచ్చారు. పదకొండవ దేవకన్య రాకుమారిని దీవించడం కాగానే పదమూడవ దేవకన్య అక్కడకు వచ్చింది. తనను విందుకు పిలవనందుకు చాలా కోపంతో ఉంది. పగ తీర్చుకోవాలని అక్కడకు పిలవని పేరంటంగా వచ్చింది. "పదిహేనవ ఏట రాకుమారికి కదురు గుచ్చుకొని చచ్చిపోతుంది," అని శపించింది. పన్నెండవ దేవకన్య ఇంకా దీవించలేదు కాబట్టి ఈ విధంగా వరం ఇచ్చింది: "కదురు గుచ్చుకొని

రాకుమారి చచ్చిపోయినప్పటికీ, నిజంగా చచ్చిపోదు. వంద సంవత్సరాలు నిద్రపోయి లేస్తుంది," అన్నది.

రాజు ఇదంతా విని చాలా దిగులుపడ్డాడు. రాబోయే ఆపద నుంచి కూతుర్ని తప్పించాలనుకొన్నాడు. రాజ్యంలో ఉన్న కదుళ్ళన్నీ తెచ్చి సముద్రంలో పారవెయ్యమని ఆజ్ఞ ఇచ్చాడు. కాలం గడిచేకొద్దీ దేవకన్యల దీవెనలన్నీ నిజమయ్యాయి. రాకుమారి ఎంతో అందంగా తయారైంది. బుద్ధిమంతురాలైంది. ఆమెను చూసినవాళ్ళంతా "గులాబి మొగ్గ" అని పిలిచేవాళ్ళు.

చూస్తూ చూస్తూ ఉండగానే రాకుమారికి పదిహేనేళ్ళు నిండాయి. పదిహేనవ ఏడు నిండిన రోజున రాజు, రాణి కోటలో లేరు. గులాబి మొగ్గ ఒక్కతే రాజభవనంలో ఉంది. కోటలో అటుఇటు పచార్లు చేస్తూ ఉంది. కోటలో ఒక మూల పాడుపడిన చిన్న మేడ ఉంది. రాకుమారి అక్కడకు వెళ్ళింది. మేడమెట్లు ఇరుకుగా ఉన్నాయి. మెట్లెక్కింది. ఎదురుగా చిన్న తలుపు కనపడింది. తలుపు తోసింది. ఒక ముసలి అవ్వ నూలు వడుకుతూ ఉంది, "పెద్దమ్మా! పెద్దమ్మా! ఏం చేస్తున్నావు?" అన్నది గులాబి మొగ్గ. "నూలు వడుకుతున్నానమ్మా!" అన్నది అవ్వ. "ఎంత చక్కగా తిరుగుతున్నదమ్మా కదురు! ఏదీ నన్ను కూడా కొంచెం సేపు వడకనీ," అని గులాబి మొగ్గ బతిమలాడింది. రాట్నం దగ్గరకూర్చొని ఏకు పట్టుకుని, రాట్నం చక్రం తిప్పింది. వెంటనే కదురు బెదిరి, ఎగిరి ఆమె వేలికి గుచ్చుకుంది. గులాబి మొగ్గ నేలమీద పడిపోయింది.

కాని గులాబి మొగ్గ చచ్చిపోలేదు. ఒడలు తెలియకుండా నిద్రపోతూ ఉంది. ఇంతలో రాజు, రాణి కూడా ఇంటికి తిరిగి వచ్చారు. వాళ్ళు కూడా మైమరచి నిద్రలో మునిగారు. గుర్రపుశాలలో గుర్రాలన్నీ నిద్రపోయాయి. రాజుగారి కుక్కలన్నీ ఎక్కడ ఉన్నవి అక్కడ పడి నిద్రపోయాయి. గోడల మీద ఉన్న ఈగలు కూడా గోడలమీదే నిద్రపోయాయి. పొయ్యిలో మంట కూడా నిద్రపోయింది. రాజుగారి వంటింట్లో ఉడుకుతున్న పాయసం ఉడుకుతూనే చల్లారిపోయింది. వంటవాడు, పనిచేసే పిల్లవాడిని ఏదో

పొరపాటు చేసినందుకు జుట్టుపట్టుకొని చెవి మెలిపెడుతున్నాడు. వంటవాడి చేతులు పట్టు విడిపోయాయి. వాళ్ళిద్దరూ అలాగే అక్కడే పడి నిద్రపోయారు. కోటలో ఉన్న మనుషులూ, జంతువులూ, పిట్టలూ – అన్నీ ఈ విధంగా నిద్రమైకంలో మునిగిపోయాయి.

కొంతకాలానికి రాజుగారి భవనం చుట్టూ ముళ్ళపొదలు లేచాయి. పొదలు రోజురోజుకు పెరిగి అల్లుకుపోయాయి. చివరకు భవనం కనపడకుండా కప్పివేశాయి. అన్ని దేశాలలో ఈ వార్త వ్యాపించింది. నిద్రపోతున్న అందాల రాకుమారి గులాబి మొగ్గ సంగతి కూడా అన్ని దేశాల్లో తెలిసింది. చాలామంది రాకుమారులు గులాబి మొగ్గను చూడడానికి దేశదేశాలనుంచి వచ్చారు. కాని పాపం వాళ్ళు అడవిలాగా పెరిగిపోయిన ముళ్ళపొదల్లో చిక్కుకుని ప్రాణాలు విడిచారు.

ఇలా చాలా సంవత్సరాలు గడిచాయి. ఒకనాడు ఒక రాకుమారుడు ఆ పట్టణానికి వచ్చాడు. ఒక ముసలివాడు ఆ రాకుమారునితో కోట కథ అంతా చెప్పాడు. ఏ విధంగా ముళ్ళపొదలు అడవిలాగా పెరిగి ఉన్నదీ, ఆ పొదల వెనుక ఒక పాడుబడిన మేడలో అందాల గులాబి మొగ్గ ఏ విధంగా నిద్రపోతున్నదీ, చాలామంది రాకుమారులు ఆమెను చూడడానికి వచ్చి పొదల్లో చిక్కుకుని ఏ విధంగా ప్రాణాలు విడిచిందీ, రాజు, రాణి, కోటలో ఉన్న అందరూ ఎలా నిద్రమైకంలో ఉన్నదీ వివరంగా చెప్పాడు. ఈ కథ అంతా విని ఆ రాకుమారుడు, “ఇదంతా విని నేను భయపడతాను అనుకొన్నావా? తప్పకుండా గులాబి మొగ్గను చూసి వస్తా!” అన్నాడు. అయితే అదృష్టవశాత్తు ఆ రోజుతోనే వంద సంవత్సరాలు నిండాయి. రాకుమారుడు పొదల దగ్గరకు వచ్చేటప్పటికి ముళ్ళ పొదలన్నీ పూల పొదలుగా మారాయి. రాకుమారుడు సులభంగా పూల పొదలగుండా నడచి కోటలోకి వెళ్ళాడు. రాజుగారి భవనం దగ్గరకు వచ్చాడు. ఎక్కడి కుక్కలు అక్కడే పడి నిద్రపోతున్నాయి. గుర్రపుశాలలో గుర్రాలన్నీ నిద్రపోతున్నాయి. భవనం మీద పావురాళ్ళు కూర్చున్నవి కూర్చున్నట్లుగానే రెక్కల కింద తలలుదూర్చి నిద్రపోతున్నాయి. రాకుమారుడు ఈ విచిత్రం అంతా చూస్తూ



భవనం లోపలికి వెళ్ళాడు. గోడల మీద ఈగలు అలాగే నిద్రపోతున్నాయి. వంట ఇంట్లో వంటవాడు, పనిపిల్లవాడిని కొట్టబోతున్నట్లుగా చెయ్యి చాపి నిద్రపోతున్నాడు.

రాకుమారుడు రాజభవనం దాటి వెళ్ళాడు. అంతా నిశ్శబ్దంగా ఉంది. చివరకు పాడుపడిన మేడదగ్గరకు వచ్చాడు. మెట్లెక్కాడు, తలుపు తీశాడు. గులాబి మొగ్గ నిద్రపోతూ ఉంది. రాకుమారుడు ఆమె అందాన్ని కన్ను

ఆర్పకుండా చూస్తూ నిలబడ్డాడు. వంగి గులాబి మొగ్గను ముద్దు పెట్టుకొన్నాడు. వెంటనే గులాబి మొగ్గ కళ్ళు తెరిచింది. రాకుమారుడిని చూసి నవ్వింది.

రాకుమారుడు, గులాబి మొగ్గ కలిసి రాజుగారి ఇంటికి వచ్చారు. అప్పటికే రాజు, రాణి నిద్రలేచారు. కోటలో నిద్రపోతున్నవాళ్ళంతా లేచారు. ఒకరివంక ఒకరు ఆశ్చర్యంగా చూశారు. గుర్రాలు లేచాయి. ఒడలు విదిల్చి సకిలించాయి. కుక్కలు నిద్రలేచి, పరుగెత్తుతూ మొరిగాయి. పావురాళ్ళు తేలిపోయాయి. గోడల మీద ఉన్న ఈగలన్నీ "ఝుం" అంటూ లేచాయి. వంటింట్లో పొయ్యిలో మంట మళ్ళీ మండింది. పాయసం ఉడకసాగింది. వంటవాడు పసిపిల్లవాడి చెవి గట్టిగా మెలిపెట్టాడు. ఆ పిల్లవాడు గోలగా ఏడ్చాడు.

తర్వాత రాకుమారునికీ, గులాబి మొగ్గకూ మహావైభవంగా పెళ్ళి జరిగింది. వాళ్ళు చాలాకాలం సుఖంగా జీవించారు.

# వరదయ్య నిద్ర

ఒక పెద్ద కొండ దగ్గర ఒక చిన్న ఊరు ఉండేది. ఆ ఊరిలో వరదయ్య ఉండేవాడు. వరదయ్య మేకలను మేపుతూ ఉండేవాడు. ప్రతి ఉదయం మేకల మందను కొండకు తోలుకు పోతుండేవాడు. మేకలు కొండ ఎక్కి మేసేవి. ఒక్కొక్కనాడు కొండమీదే పొద్దుజారిపోయేది. ఇంటికి వెళ్ళటానికి వరదయ్యకు బద్ధకం వేసేది. ఆ రాత్రి కొండమీదే ఉండేవాడు. కొండమీద ఎక్కడ ఉండేవాడు? ఎక్కడ ఉండేవాడంటే... కొండమీద ఒక వైపు చిన్న అడవి ఉంది. అందులో మొండిగోడల ఇల్లు ఉంది. ఆ మొండిగోడల మధ్య మేకలను పెట్టుకొని, గొంగడి పరచుకొని నిద్రపోయేవాడు. ఒకనాడు ఇలాగే జరిగింది. కొండమీద ఉండగానే పొద్దుజారిపోయింది. వరదయ్య మేకలను మొండిగోడల లోపలికి తోలుకుపోయాడు. మేకలూ, తానూ పడుకొన్నారు. కొంచెంసేపైన తర్వాత లేచి చూశాడు. మేకలను లెక్కపెట్టాడు. తెల్లమేకపోతు కనిపించలేదు. ఎక్కడికి పోయిందా అని ఆలోచిస్తూ రేపొద్దున చూద్దాం అని బద్ధకంగా మళ్ళీ పడుకొని నిద్రపోయాడు. తెల్లవారి చూసేటప్పటికి తెల్లమేకపోతు మేకల మధ్య పడుకొని హాయిగా నెమరు వేస్తున్నది. ఇంకొకనాడు కూడా ఇలాగే జరిగింది. తెల్లమేక రాత్రి ఎక్కడికి పోతోందో అతనికి ఎంత ఆలోచించినా తోచలేదు. ఈ రహస్యం ఏమిటో కనుక్కోవాలనుకొన్నాడు. ఒకనాటి రాత్రి మేలుకొని ఉండి తెల్లమేక లేచిపోగానే, దానివెంటనే బయలుదేరాడు. బండలచాటున నక్కుతూ, మేకకు

కనపడకుండా నడుస్తున్నాడు. మేక వెళ్ళి వెళ్ళి ఒక గుహలో ఆగింది. పైనుంచి నానపెట్టిన శనగలు పడుతున్నాయి, మేక తింటున్నది. వరదయ్య పైకి చూశాడు. పైనుంచి ఏదో చప్పుడు వినపడుతున్నట్లు తోచింది. శ్రద్ధగా విన్నాడు. గుఱ్రాల సకిలింపు, గిట్టల చప్పుడు వినిపించాయి. ఔనో, కాదోననుకొని మరికొంచెం సేపు విన్నాడు. సందేహం తీరింది. పైన గుఱ్రాలు ఉన్నాయనీ, వాటి మూతులకు కట్టిన దాణాసంచుల నుండి శనగలు జారిపడుతున్నాయనీ అనుకొన్నాడు. 'ఈ గుఱ్రాలెవరివి? ఇక్కడెవరు ఉంటున్నారు?' అని వరదయ్య ఆలోచించాడు. ఎంత ఆలోచించినా ఏమీ తోచలేదు. ఆలోచించే కొద్దీ ఆశ్చర్యం కలిగింది.

ఇంతలో ఎక్కడినుంచో ఒక భటుడు అక్కడకు వచ్చి వరదయ్యను రమ్మని పిలిచాడు. భటుడిని చూడగానే వరదయ్య విస్తుపోయాడు. ఏం చేస్తాడు? రానంటే ఆ భటుడు ఏమంటాడో? వరదయ్య మాట్లాడకుండా అతని వెంట వెళ్ళాడు. భటుడు వరదయ్యను ఒక ఆవరణ లోపలికి తీసుకుపోయాడు. ఆవరణ చుట్టూ మొండిగోడలున్నాయి. ఇది కొండలోయలో ఉన్నట్లు వరదయ్య కనిపెట్టాడు. చుట్టూ పెద్ద పెద్ద చెట్లు కిక్కిరిసి ఉన్నాయి. వాటి కొమ్మలు ఆవరణంతా కప్పివేశాయి. ఆకుల సందుగుండా సూర్యకాంతి కనబడుతున్నది. ఆవరణలో పచ్చికదిబ్బ ఒకటి ఉంది. దానిమీద పన్నెండుమంది ముసలిరాజులు కూర్చున్నారు. వాళ్ళ ముఖాలు పాలిపోయి ఉన్నాయి. చుట్టూ కూర్చొని వాళ్ళు చదరంగం ఆడుతున్నారు. పక్కనే ద్రాక్షసారాయి జాడీ ఉంది. వరదయ్యను సారాయి ఇవ్వమని ముసలి రాజులు సైగచేశారు. వరదయ్య కాళ్ళు చేతులు వణికాయి. అందరికీ గిన్నెలతో సారాయి ఇచ్చాడు. కొంతసేపటికి అతని భయం తీరింది. తానుకూడా కొంచెం సారాయి పుచ్చుకొన్నాడు. మనస్సు తేలికపడింది. ఇంకా కొంచెంసేపైన తర్వాత మళ్ళీ భయం వేసింది. ఈసారికూడా ఒక గిన్నె సారాయి కడుపులో పోశాడు. మళ్ళీ కొంచెం ధైర్యం వచ్చింది. ధైర్యంతోపాటు ఈ మాటు నిద్రకూడా వచ్చింది. కింద పడుకొని మైమరచి నిద్రపోయాడు.

నిద్ర మెలకువ వచ్చి చూసేసరికి వరదయ్య తాను రోజూ మేకలతో పడుకొనే మొండిగోడల ఇంటిలో ఉన్నాడు. చేతులతో కళ్ళు నులుముకొని చూశాడు, మేకలు లేవు. అటు ఇటు చూశాడు. ఎక్కడ చూసినా గడ్డి మోకాలు ఎత్తున పెరిగి ఉంది. చెట్లన్నీ పూర్వం కంటే చాలా పెరిగినట్లు ఉన్నాయి. కొమ్మలు తలకు తగులుతున్నాయి. తన చూపు సరిగా ఉందా లేదా అని అనుమానపడుతూ, రోజూ మేకలు మేతకు తిరిగే చోటులకు వెళ్ళి చూశాడు. ఒక్క మేక కూడా కనపడలేదు. కొండ కింద దూరంగా ఊరు కనపడుతోంది. దిగులుగా మేకలను వెతుకుతూ కొండ దిగి ఇంటి ముఖం పట్టాడు. తోవలో చాలామంది మనుషులు కనిపించారు. వారిలో తానెరిగిన వాడొక్కడూ లేడు. వాళ్ళ దుస్తులు కూడా వేరుగా ఉన్నాయి. వాళ్ళ మాటలు కూడా కొత్తగా ఉన్నాయి. తన మేకలేమైనాయని వాళ్ళను అడిగాడు. వాళ్ళు తెల్లముఖాలు పెట్టి అతని గడ్డం వంక చూశారు. వరదయ్య గడ్డం తడిమి చూసుకొన్నాడు. మూరెడు గడ్డం పెరిగి ఉంది. ఇదంతా వరదయ్యకు మాయగా ఉంది. ప్రపంచమంతా తారుమారై పోయిందని అనుకొన్నాడు. కాని, కొండ పూర్వం ఉన్న చోటనే ఉంది. ఇళ్ళన్నీ పూర్వం ఉన్నచోటనే ఉన్నాయి. ఆ వూరి పేరుకూడా మారలేదని తెలుసుకొన్నాడు. ఎకాయకి తన ఇంటికి వెళ్ళాడు. ఇల్లంతా పడిపోయి ఉంది. ఇంటిముందు ఎవరో చిన్న పాపాయి ఆడుకొంటూ ఉంది. పాపాయి పక్కన ఒక ముసలి కుక్క ఉంది. వరదయ్యను చూడగానే మొరిగింది. వరదయ్య దాన్ని గుర్తుపట్టి పిలిచాడు. అది మళ్ళీ మొరిగి ఊరుకుంది. ఇంటి ద్వారబంధానికి తలుపులేదు. గుమ్మం దగ్గరకు వెళ్ళి చూశాడు. లోపల ఎవ్వరూ లేరు. పాడుబడ్డ కొంపలా ఉంది. భార్యనూ, పిల్లలనూ పేర్లుపెట్టి పిలిచాడు. ఎవరూ పలకలేదు.

కొంచెంసేపైన తర్వాత కొందరు ఆడవాళ్ళు పిల్లలతో వచ్చి వరదయ్య చుట్టూ మూగారు. "నువ్వెవరవి?", "ఎందుకు వచ్చావు?" అని ప్రశ్నల వర్షం కురిపించారు. తన ఇంటిలోనే తన పెళ్ళాం, పిల్లల గురించి లోకులను అడగడం అతనికి చాలా వింతగా తోచింది. అందుకని "కమ్మరి కనకయ్య



బాగున్నాడా?" అని అడిగాడు. వాళ్ళంతా నోరు కదపకుండా వూరుకొన్నారు. వాళ్ళలో ఒక ముసలమ్మ అన్నదికదా, "అతడు ఈ లోకం దాటి ఏడు సంవత్సరాలైంది." "అయితే దర్జీ వీరయ్య?" అని వరదయ్య అడిగాడు. "పాపం అతను స్వర్గానికి పోయి పదేళ్ళయిందిగా!" అన్నది ముసలమ్మ.

వరదయ్య ముసలమ్మ వంక చూశాడు. ఆమె ముఖం పూర్వం చూసినట్లు అనిపించింది. ఇక అతనికి మరేమీ అడగాలనిపించలేదు. కొంచెం సేపటికి ఆ జనాన్ని తోసుకుంటూ పిల్లవాడిని ఎత్తుకొని ఒక ఆవిడ వచ్చింది. మూడేళ్ళ పిల్ల రెండోచెయ్యి పట్టుకొని ఉంది. ఈ ముగ్గురూ అచ్చంగా తన భార్యను పోలి ఉన్నారు. "నీ పేరేమిటమ్మా?" అని వరదయ్య ఆమెను అడిగాడు. "లక్ష్మి," అని ఆవిడ బదులుచెప్పింది. "నీ తండ్రి పేరు?" వరదయ్య అడిగాడు. "వరదయ్య," లక్ష్మి బదులు చెప్పింది. "ఏమైనాడో? ఇరవై ఏళ్ళనుంచి రేయింబవళ్ళు వెతుకుతున్నాం. ఎక్కడా జాడైనా కనిపించలేదు. మా నాయన వెళ్ళేటప్పటికి నేను ఏడేళ్ళ పిల్లను," అని

లక్ష్మి బిక్కముఖం పెట్టింది. "వరదయ్యను నేనే! నేనేనమ్మా నీ తండ్రిని," అంటూ వరదయ్య కూతురు చంకలో ఉన్న మనుమడిని తీసుకుని ముద్దాడాడు. అక్కడ ఉన్నవాళ్ళంతా గుడ్లు అప్పగించి చూస్తున్నారు. ఎవ్వరికీ నోటమాట రాలేదు. వాళ్ళలో ఒక ముసలివాడు చివరకు అన్నాడు: "అలా చూస్తారేం? మన వరదయ్యే." అప్పుడింకా కొందరిలా అన్నారు, "ఔను వరదయ్యే! ఎంతకాలానికి వచ్చావు వరదయ్యా!"

# చిన్న రాక్షసుడు, దర్జీవాడు

పూర్వకాలంలో ఒక రైతు ఉండేవాడు. అతనికి లేకలేక ఒక కొడుకు పుట్టాడు. ఆ కొడుకు వేలెడంత వుండే వాడు. ఎంతకాలం చూసినా ఒక వెంట్రుకవాసి కూడా పెరగలేదు. ఒకనాడు తండ్రి పొలం దున్నడానికి వెళ్తూండగా ఆ పిల్లవాడు, "నేను కూడా వస్తాను నాన్నా!" అన్నాడు. "వద్దు నాయనా! వద్దు. వచ్చి అక్కడ నువ్వు చేసేదేముంది? ఒకవేళ నువ్వెటైనా పోతావేమో, ఎవరు చూస్తుంటారు నిన్ను?" అన్నాడు తండ్రి. పిల్లవాడు ఏడుపు సాగించాడు. ఇక ఏమీ అనలేక తండ్రి జేబులో వేసుకొని పొలానికి తీసుకుపోయాడు.

పొలంలోకి వెళ్లగానే రైతు కొడుకును జేబులోంచి తీసి నాగటిచాలులో కూర్చోబెట్టి దున్నుతున్నాడు. ఇంతలో ఒక పెద్ద రాక్షసుడు కొండలమీదుగా నడుస్తూ వస్తున్నాడు. "ఆ పొడుగు మనిషిని చూశావా? ఏడిచావంటే ఆ మనిషి నిన్ను తీసుకుపోతాడు," అని తండ్రి కొడుకును భయపెట్టాడు. కాని, ఇంతలో రాక్షసుడు రెండు అంగల్లో అక్కడకు రానే వచ్చాడు. పిల్లవాడిని చేతితో ఎత్తి చూశాడు. ఆ పిల్లవాడిమీద రాక్షసునికి మక్కువ కలిగింది. చేతితో పట్టుకొని తీసుకుపోయాడు.

రైతు ఇదంతా చూస్తూ, ఏమి అంటే రాక్షసుడేమి చేస్తాడోనని భయపడి నోరు మూసుకున్నాడు. ఇక కొడుకు పోయినట్లే అని నిరాశ చేసుకొని ఇంటికి వెళ్ళాడు.



రాక్షసుడు ఆ పిల్లవాడిని అడవిలో ఉన్న తన ఇంటిలోకి తీసుకుపోయాడు. గుండెలమీద పడుకోబెట్టుకొని తాను తినే అన్నమే పెట్టి పెంచాడు. రోజులు గడిచేకొద్దీ మరగుజ్జుగా ఉన్న ఆ పిల్లవాడు – పొడవుగా, లావుగా, బలంగా – రాక్షసుడిలాగానే తయారయ్యాడు. రెండేళ్ళు గడిచిన తర్వాత పెద్ద రాక్షసుడిగా తయారయ్యాడు. అప్పుడు పెద్ద రాక్షసుడు చిన్న రాక్షసుడి బలం పరీక్షించాలి అనుకొని ఒకనాడు అడవిలోకి తీసుకుపోయి: "ఆ చెట్టును పెళ్ళగించు," అన్నాడు. చిన్న రాక్షసుడు సునాయాసంగా చెట్టును వేళ్ళతో సహా పీకేశాడు. చిన్న రాక్షసుడిని పెద్ద రాక్షసుడు ఇంకా బలవంతుడిని చెయ్యాలనుకొన్నాడు. మళ్ళీ రెండేళ్ళు బలమైన ఆహారం పెట్టి పెంచాడు. మళ్ళీ అడవిలోపలికి తీసుకునిపోయాడు. చిన్న రాక్షసుడు అవలీలగా ఒక పెద్ద మఱ్ఱిచెట్టును కూకటివేళ్ళతో సహా లాగాడు. "బాగానే ఉంది అబ్బాయీ! ఇక నువ్వు పనికి వస్తావు," అన్నాడు పెద్దరాక్షసుడు. ఈ మాట అని అతని తండ్రి పొలంలోకి తీసుకునిపోయి వదలిపెట్టాడు.

అప్పుడు రైతు పొలం దున్నుతున్నాడు. రాక్షసుడు తండ్రి దగ్గరకు వెళ్ళి: "నాన్నా! ఇటు చూడు, నన్ను గుర్తుపట్టావా? నేను నీ కొడుకుని," అన్నాడు. రైతుకు అతన్ని చూడగానే భయం పుట్టింది. "నువ్వెవరివో నాకు తెలియదు. వెళ్ళు. నీ దారిన నువ్వు పో," అన్నాడు. "నిజంగా నాన్నా! నేను నీ కొడుకునే. ఏదీ నన్ను కొంచెం దున్ననివ్వు. నేనూ నీలాగే బాగా దున్నగలను," అన్నాడు రాక్షసుడు. కాదంటే ఏమి చేస్తాడోనని భయంపుట్టి రైతు నాగలి వదలిపెట్టి ఆ పక్కనే చూస్తూ కూర్చున్నాడు.

చిన్న రాక్షసుడు మేడి అదిమిపట్టి దున్నుతున్నాడు. దుక్కి మూరెడు లోతు తెగుతున్నది. ఇది చూసి రైతు గాభరాపడి, "మేడి అంత అదిమిపట్టకు, నాకు ఉపకారం కంటే అపకారమే ఎక్కువ చేస్తున్నావు," అని అరిచాడు. ఈమాట విన్న రాక్షసుడు ఎడ్లను విడిచిపెట్టి నాగలి చేత్తో తోస్తూ దున్నుతూ తండ్రితో ఇలా అన్నాడు, "నాన్నా! నేను దున్నుతూ ఉంటాను గాని, నువ్వు ఇంటికి వెళ్ళి అమ్మతో భోజనం తయారుచెయ్యమని చెప్పు." తండ్రి ఇంటికి వెళ్ళాడు. ఆ పూట చిన్న రాక్షసుడు రెండురోజుల దుక్కి దున్నాడు. కాడి, నాగలి, ఎడ్లు కలిపి ఒక గడ్డిమోపులాగా మెడమీద వేసుకొని ఇంటికి బయలుదేరాడు.

ఇంటికి వెళ్ళి బల్లమీద కూర్చొని, "అమ్మా! వంటయిందా?" అన్నాడు. తల్లి భయపడుతూ తల ఎత్తకుండానే, "అయింది," అన్నది. తనకూ తన భర్తకూ వారం రోజులకు సరిపడేంత అన్నం, కూరలు రెండు పెద్ద పళ్ళాల నిండా పెట్టుకొని తెచ్చింది. ఆ అన్నమంతా రెండు ముద్దలు చేసుకొని చిన్న రాక్షసుడు మింగివేసి తండ్రితో అన్నాడు కదా..."నాన్నా! మీరు నాకు చాలినంత అన్నం పెట్టలేరు. నేను విరచలేనంత బలమైన ఇనుపచేతి బెత్తం ఇస్తే నా దారిన నేను పోతాను." తండ్రి చాలా సంతోషించాడు. ఎలాగైనా ఈ రాక్షసుడిని పంపితే మంచిదనుకొని ఎడ్లను బండికి కట్టి బయలుదేరాడు. ఊరి వెలుపల కొలిమి దగ్గరకు వెళ్ళి ఎడ్లు మోయగలిగినంత లావు, పొడవుగల ఇనుప దూలం బండిమీద వేసుకొని ఇంటికి తెచ్చాడు. కాని చిన్న రాక్షసుడు దాన్ని మోకాళ్ళ మీద పెట్టి వంచాడు. అది బెండుకర్రలాగా

పుటుక్కున విరిగిపోయింది. "నాన్నా! నాకు కావలసిన చేతికర్ర నువ్వు తీసుకురాలేవు. నేనే వెళ్ళి వెతుక్కుంటాను," అని లేచాడు.

వెళ్ళి వెళ్ళి ఒక ఊరు చివరకు వచ్చాడు. అక్కడ ఒక కమ్మరి ఉన్నాడు. అతడు చాలా పిసినిగొట్టు. చాలా డబ్బు సంపాదించాడు. ఒక్క దమ్మిడీ కూడా బైటపెట్టేవాడు కాదు. చిన్నరాక్షసుడు అతని కొలిమి దగ్గరకు వెళ్ళాడు. "నీకు సమ్మెట వేసే మనిషి కావాలా?" అని అడిగాడు. కమ్మరి అతని లావు, ఎత్తు చూశాడు. 'ఎంత బలంగా ఉన్నాడు? బాగా గొడ్డులాగా పనిచేస్తాడు,' అనుకొని "జీతం ఎంత కావాలి?" అని అడిగాడు. "నాకు జీతం అక్కర్లేదు. ప్రతి పదిహేను రోజులకు ఒకసారి నువ్వు పనివాళ్ళకు జీతం ఇచ్చేటప్పుడు నీ వీపు మీద రెండు చిన్న దెబ్బలు వేయనిస్తే చాలు. నా సరదా తీరుతుంది," అన్నాడు చిన్నరాక్షసుడు. 'అంతేకదా! రెండు చిన్న దెబ్బలు ఓర్చుకోలేకపోతానా? జీతం కలిసి వస్తుందాయే!' అనుకొని కమ్మరి ఒప్పుకొన్నాడు.

రెండవనాటి ఉదయం చిన్న రాక్షసుడు పనిలో ప్రవేశించాడు. కమ్మరి ఒక ఇనుప కడ్డీ కొలిమిలో ఎర్రగా కాల్చి దిమ్మ మీద పెట్టాడు. సమ్మెట వెయ్యమన్నాడు. చిన్నరాక్షసుడు సమ్మెటతో ఒక్క దెబ్బ వేశాడు. ఇనుపకడ్డీ సంగతి దేవుడెరుగు, దిమ్మకూడా భూమిలో మూరెడు లోతున కుంగి పోయింది. కమ్మరికి కోపం వచ్చింది. "ఇక చాల్లే నాయనా! నీకొక సలాం! నీ పనీ వద్దూ, నువ్వూ వద్దు! దయచెయ్యి!" అన్నాడు. "అయితే నా కూలీ సంగతి ఏమిటి?" అంటూ చిన్నరాక్షసుడు కమ్మరిని ఒక చిన్న దెబ్బ వేశాడు. ఆ దెబ్బతో కమ్మరి ఎగిరి పక్కనున్న గడ్డివామి మీద పడ్డాడు. చిన్న రాక్షసుడు అక్కడ ఉన్న ఒక ఇనుపదూలం చేతికర్రగా తీసుకొని బయలుదేరాడు.

కొంతదూరం వచ్చాడు. అక్కడ ఒక రైతు ఇల్లు కనబడింది. "నీకు పాలేరు కావాలా?" అని అడిగాడు. "కావాలి," అన్నాడు రైతు. కమ్మరి ఒప్పుకొన్న షరతునే రైతును కూడా అడిగాడు. రైతు సంతోషంగా ఒప్పుకొన్నాడు. రెండవ రోజున ఉదయం పాలేళ్ళనందర్నీ అడవికి బండ్లు తోలుకుపోయి కట్టెలు కొట్టుకురమ్మని రైతు పురమాయించాడు. తెల్లవారక ముందే జీతగాళ్ళంతా లేచి బండ్లు కట్టుకొని బయలుదేరబోతున్నారు.

చిన్నరాక్షసుడింకా నిద్రపోతూనే ఉన్నాడు. ఒక జీతగాడు అతని దగ్గరకు వచ్చి లేపాడు, "లే! లే! చాలా పొద్దెక్కింది. వెళ్దాం రా!" అన్నాడు. "మీరు వెళ్ళండయ్యా! ఇప్పుడే ఎందుకు నేను రావడం! నా పని చేసుకొని మీకంటే ముందే ఇంటికి వస్తాలే. మీరు వెళ్ళండి," అని ఆవలిస్తూ అన్నాడు చిన్నరాక్షసుడు.

జీతగాళ్ళంతా బండ్లు తోలుకుని వెళ్ళిపోయారు. తర్వాత రెండు గంటల సేపటి వరకూ చిన్నరాక్షసుడు నిద్రపోతూనే ఉన్నాడు. చివరకు ఎలాగైతేనేమి ఒళ్ళు విరుచుకుంటూ లేచాడు. తీరికగా అన్నం వండుకొని కడుపునిండా తిన్నాడు. మెల్లగా బండికి ఎడ్లుకట్టి అడవికి బయలుదేరాడు. అడవి లోపలికి వెళ్ళాలంటే ఒక్కటే దారి ఉంది. ఎవరైనా ఆ దారి గుండా పోవలసిందే గాని మరొకవైపు పోవడానికి వీలులేదు. ఆ దారిలో బండిని ముందుకు తోలుకుపోయాడు. పుల్లలు, కర్రలు, కంప నిలువు ఎత్తున వేసి దారి పూడ్చాడు. ఇక అటు బండిపోవాలన్నా, అటు నుండి అడవిలోనికి బండి రావాలన్నా వీలులేదు. ఈ పనిచేసి చిన్నరాక్షసుడు అడవి లోపలికి బండి తోలుకుపోతున్నాడు. ఉదయమే వెళ్ళిన జీతగాళ్ళు బండ్లమీద కట్టెలు వేసుకొని ఎదురుగా వచ్చారు, "పదండి, పదండి! మీకంటే ముందే ఇల్లు చేరుకుంటాలే!" అంటూ ఆ బళ్ళను తప్పుకొని చిన్నరాక్షసుడు వెళ్ళిపోయాడు. కొంచెం దూరం వెళ్ళి ఒక చెట్టును అమాంతంగా ఫెళఫెళ విరిచి బండిమీద వేసుకొన్నాడు. ఇంటిముఖం పట్టాడు. కంచె అడ్డం వేసిన చోటికి వచ్చాడు. కంచెదాటి వెళ్ళలేక తక్కిన జీతగాళ్ళంతా బండ్లాపుకొని కళ్ళు అప్పగించి చూస్తున్నారు. వాళ్ళను చూసి, "నా మాట విన్నారు కాదు. హాయిగా ఇంకా కొంచెం సేపు పడుకొని నిద్రపోయే వాళ్ళేనా? ఇంటికి కూడా త్వరగా పోయేవాళ్ళేనా?" అని ఎత్తిపొడుస్తూ చెట్టును ఒక భుజం మీద, బండిని మరొక భుజం మీద పెట్టుకొని ఒక్క గంతు వేసి కంచె దాటాడు. గబగబా ఇంటికి వచ్చాడు. రైతును చూసి, "ఈ చెట్టు ఎలా ఉంది? మంచి చేతికర్ర లాగా లేదూ?" అన్నాడు. రైతు ఈ వింతను చూసి మహా ఆశ్చర్యపడుతూ, "ఏమేవ్!" అంటూ భార్యను పిలిచి, "మన కొత్త జీతగాడిని చూశావా?

చాలా ఉద్దండుడు. అందరికంటే ఆలస్యంగా నిద్రలేచినా, అందరి కంటే ఎక్కువ పనిచేస్తాడు," అన్నాడు.

ఇలా ఒక సంవత్సరం పాటు చిన్నరాక్షసుడు రైతు దగ్గర పనిచేశాడు. సంవత్సరం కాగానే రైతు పాలేళ్ళందరికీ జీతాలిస్తున్నాడు. చిన్నరాక్షసుడు తన జీతం ఇవ్వమని అడిగాడు. ఆ మాట వినగానే రైతుకు చెమటలు పట్టాయి. చిన్నరాక్షసుని చేత దెబ్బలు తినాలనే జ్ఞాపకం వచ్చేటప్పటికి రైతు భయంతో వణికిపోతూ, "నాయనా! నీ షరతు వదులుకో, కావాలంటే దానికి బదులుగా నా పొలంపుట్రా అంతా తీసుకొని నన్ను వదిలిపెట్టు," అని రైతు బతిమలాడాడు. "నాకక్కర్లేదు. పొలం నేనేం చేసుకోను? నేను పాలేరునాయె! పాలేరుగానే ఉంటాను. ఒప్పుకొన్న ప్రకారం నా జీతం నాకు ఇవ్వండి," అన్నాడు చిన్నరాక్షసుడు. ఏం చెప్పాలో తోచక ఒక పక్షం రోజులు గడువిమ్మని రైతు అడిగాడు. తన స్నేహితులను, బంధువులను పిలిచి ఈ పీడ వదలించుకోవడానికి ఏం చెయ్యాలని సలహా అడిగాడు. వాళ్ళందరూ చాలాసేపు తలలుచేర్చి ఆలోచించారు. ఈ పీడాకారపు మనిషిని చంపటమే మంచిపని అని అందరూ నిర్ణయించారు. అయితే, అతన్ని చంపటం ఎలాగ? అందుకు ఒక ఉపాయం పన్నారు. "చిన్నరాక్షసునితో ఊళ్ళో ఉన్న పెద్ద పెద్ద రోళ్ళకుందులన్నీ తెప్పించి, మోటబావి అంచున పెట్టిద్దాం. బావి శుభ్రం చేయమని చెప్పి అతనిని బావిలోకి దించుదాం. వాడి తలమీద కుందులన్నీ వదిలేద్దాం," అనుకొన్నారు.

అంతా అనుకొన్నట్టుగానే జరిగింది. చిన్నరాక్షసుడు బావిలో దిగగానే బావి ఒడ్డున ఉన్న పెద్దమనుషులందరూ కలిసి బావి అంచున ఉన్న కుందుల్ని లోపలికి తోశారు. అవి బావిలో గుబుక్కున పడగానే బావిలో ఉన్న నీరు పైకి చిమ్మింది. "వాడి తల పిసురుపిసురై ఉంటుంది," అని వాళ్ళంతా సంతోషించారు. కాని ఇంతలో బావిలోనుంచి చిన్నరాక్షసుడు కేకవేశాడు, "బావి ఒడ్డున కోళ్ళు ఉన్నట్లున్నాయి. వాటిని తరిమి వెయ్యండి. పాడుకోళ్లు, నెత్తిమీద, కళ్ళలో ఇసుక తోస్తున్నాయి. నా కళ్ళు కనపడడం లేదు," అంటూ బావి శుభ్రం చేసి క్షణంలో చిన్నరాక్షసుడు బావిపైకి వచ్చాడు. ఒక పెద్ద

రోలు కుంది అతని మెడకు తగిలించి ఉంది. ఆ కుంది అతని తలమీద పడి భుజాలమీదకు జారి ఉంటుంది. బావి బైటకురాగానే, "చూడండి! ఎంత మంచి కడియం నా మెడకు చుట్టుకుందో!" అన్నాడు.

రైతుకు మళ్ళీ భయం పట్టుకుంది. మళ్ళీ ఒక పదిహేను రోజులు గడువు ఇవ్వమని చిన్న రాక్షసుడిని అడిగాడు. మళ్ళీ స్నేహితులను, బంధువులనూ పిలిపించి సలహా అడిగాడు. వాళ్ళు ఆలోచించి, ఆలోచించి ఈ విధంగా సలహా చెప్పారు: "ఊరి వెలుపల నూనె గానుగ ఉంది. ఆ ఇల్లు దెయ్యాల కొంప, రాత్రిపూట ఆ ఇంటినిండా దయ్యాలు తిరుగుతూ ఉంటాయి. ఈ రాత్రి ఈ పీడాకారపు మనిషిని నూనె గానుగ ఆడవలసిందిగా చెప్పి పంపిస్తాం. అంతటితో వాడి కథ సమాప్తం అవుతుంది." ఈవిధంగా ఆలోచించి సాయంత్రం కాగానే చిన్నరాక్షసుడికి ఎనిమిది మానికల నువ్వులు ఇచ్చి, నూనె ఆడించి తీసుకుని రమ్మని చెప్పారు. ఆ పక్కజేబులో నాలుగు మానికలు, ఈ పక్క జేబులో నాలుగు మానికలు నువ్వులు పోసుకొని చిన్నరాక్షసుడు చేతులూపుకొంటూ ఊరి వెలుపల నూనె గానుగ ఇంటికి వెళ్ళాడు. గానుగ యజమాని, "అబ్బాయీ! ఉదయం నూనె ఆడించుకో. రాత్రిపూట ఈ ఇంట్లో దయ్యాలు తిరుగుతూ ఉంటాయి. రాత్రి ఈ ఇంటిలోకి వెళ్ళినవాళ్ళెవరూ బతికి బైటికి రాలేదు," అన్నాడు. "మరేమీ ఫరవాలేదులే. ఈ రాత్రే నూనె ఆడించి పట్టుకురమ్మని మా రైతు పంపాడు. రేపు పొద్దుటిదాకా ఆగడానికి వీలులేదు. నా సంగతి నేను చూసుకొంటాలే," అని చిన్నరాక్షసుడు బదులు చెప్పాడు.

గానుగలో నువ్వులు పోసి నూనె ఆడేసరికి సరిగ్గా రాత్రి పన్నెండు గంటలైంది. నూనె అంతా డబ్బాలోకి తోడి పక్కన ఉన్న బల్లమీద కూర్చున్నాడు. ఇంతలో తలుపు దాని అంతట అదే తెరుచుకుంది. ఎవ్వరూ వచ్చినట్లు కనపడలేదు. ఎవరో పీటలు వేశారు, పళ్ళాలు పెట్టారు, మంచినీటి లోటాలు పెట్టారు. పళ్ళాలనిండా రకరకాల భోజనాలు వడ్డించారు. ఇంత జరుగుతున్నా ఒక్క మనిషి కూడా కనిపించలేదు. మన చిన్నరాక్షసుడు ఇదంతా చిత్రంగా చూస్తున్నాడు. ఆ పదార్థాలన్నింటిని చూడగానే అతనికి

నోరువూరింది. ఆకలి పుట్టుకొని వచ్చింది. లేచి వచ్చి ఒక్కొక్క పళ్ళెంలో తనకిష్టం వచ్చిన పదార్థాలు తీసుకొని కడుపునిండా ఆరగించాడు. మంచినీళ్ళు తాగాడు. సర్రున తేన్చాడు. ఇంతలో ఆకస్మాత్తుగా ఎవరో దీపాలు ఆర్పివేశారు. ఇల్లంతా కటికచీకటి కమ్ముకుంది. ఎవరో అతని తలమీద "ఠపీ"మని కొట్టారు. "ఈసారి కొట్టారంటే నేను ఊరుకోను సుమా!" అని అరిచాడు. మళ్ళీ రెండవ దెబ్బ తగిలింది. చిన్నరాక్షసుడు కోపంతో లేచాడు. తిరిగి చెయ్యిచాచి కొట్టాడు. ఈ విధంగా దయ్యాలకు, అతనికీ దెబ్బలాట తెల్లవారే దాకా సాగుతూనే ఉంది. కాని, దయ్యాలతన్ని పట్టుకోలేక పోయాయి. అతడు దెబ్బకు దెబ్బ కొడుతూనే ఉన్నాడు. ఇంతలో తెల్లవారింది, చీకటిపోయింది. దయ్యాలుకూడా పోయాయి.

గానుగ యజమాని వచ్చాడు. సంగతేమిటని అడిగాడు. "మరేమీ లేదు. ముఖంమీద చిన్నచిన్న దెబ్బలు తగిలాయి. అయితేనేమి! దెబ్బకుదెబ్బ ఇచ్చాను. దెబ్బలమాటకేం గాని భలే రాజా భోజనం తిన్నానయ్యా!" అన్నాడు చిన్నరాక్షసుడు. ఇక దయ్యాలపీడ వదిలిపోయిందని గానుగ యజమాని సంతోషించాడు. "నీకెంత డబ్బు కావాలో కోరుకో ఇస్తాను," అన్నాడు. "నాకు డబ్బెందుకయ్యా! నా దగ్గర కావలసినంత డబ్బుంది," అంటూ మళ్ళీ రైతు ఇంటికి వెళ్ళి తన జీతం ఇవ్వమని అడిగాడు.

రైతుకు కోపం ముంచుకువచ్చింది. ఎన్ని ఉపాయాలు పన్నినా ఈ పాడు పీడ విరగడకాలేదే అని విచారిస్తూ ఏమీ తోచక, కాలుకాలిన పిల్లిలా ఇంటిలో అటూఇటూ పచార్లు చేశాడు. అతని ముఖమంతా చెమట కారుతోంది. గాలి కోసమని కిటికీ తీసి బైటకి చూస్తూ అక్కడే నిలుచున్నాడు. చిన్నరాక్షసుడు వెనకగా వచ్చి ఒక తన్ను తన్నాడు. కిటికీతో సహా రైతు గాలిలో ఎగిరిపోయాడు. కొండలు దాటి, అడవులు దాటి ఎక్కడో కానని ప్రదేశంలో వెళ్ళిపడ్డాడు. "అయ్యో! అయ్యో!" అంటూ రైతు భార్య వచ్చింది. బాకీ ఉన్న రెండవ దెబ్బ భార్య మీద పడింది. భర్తపోయిన చోటుకే భార్య కూడా పోయింది.

కొంత కాలానికి ఈ చిన్నరాక్షసుడిని ఒక దర్జీవాడు కలుసుకొన్నాడు.

ఆ కథ ఇలా జరిగింది:

ఒక వేసవికాలపు ఉదయం, దర్జీవాడు దేశాలమీద బయలుదేరాడు. ఉట్టిమీద ఒక వెన్నముద్ద, గూటిలో ఒక గువ్వ మాత్రం ఇంట్లో మిగిలి ఉన్నాయి. గువ్వని చంకన పెట్టుకున్నాడు. వెన్నముద్ద గుడ్డలో కట్టి జేబులో వేసుకుని, బయలుదేరాడు. నడచి నడచి ఒక కొండకొమ్ము మీదకు వచ్చాడు. అక్కడ మన చిన్నరాక్షసుడు కూర్చొని ఉన్నాడు. "ఏమయ్యా! మిత్రమా! బాగున్నావా? కొండమీద కూర్చుని ప్రపంచమంతా ఎలా ఉందో చూస్తున్నట్టున్నావే? నేను దేశాలు తిరగాలని బయలుదేరాను. నాతో వస్తావా?" అన్నాడు దర్జీ ధైర్యంగా. చిన్నరాక్షసుడు అతని వంక పరిశీలనగా చూసి, "ఓరి మరుగుజ్జువాడా!" అన్నాడు. "ఐతే కావచ్చులే. మన ఇద్దరిలో ఎవరు బలం కలవాళ్ళో చూద్దాం పట్టు," అన్నాడు దర్జీ.

దర్జీ ధైర్యం చూసి చిన్నరాక్షసుడు అతని మాట కాదనలేక పోయాడు. "ఐతే చూద్దాం పట్టు," అన్నాడు. ఈ మాట అని ఒక రాయి తీసుకొని గట్టిగా పిండాడు. రాయి పిండిపిండి అయి నీళ్ళు కారాయి. "నువ్వు చేయగలవా ఈ పని?" అని అడిగాడు. "అంతేనా? ఐతే చూడు!" అంటూ దర్జీవాడు తన జేబులో ఉన్న వెన్నముద్ద తీసి గట్టిగా నొక్కాడు. వెన్న చితికి నీళ్ళు కారింది. "ఇప్పుడేమంటావు రాక్షసుడా! నీకంటే నేనే బాగా రాయిని పిండాను," అన్నాడు. రాక్షసుడు అది వెన్న అనే సంగతి తెలుసుకోలేక పోయాడు. తెల్లరాయి అనుకొన్నాడు. దర్జీబలం చూసి ఆశ్చర్యపోయాడు. నోటమాట రాలేదు. చివరకు ఒక పెద్ద రాయి తీసుకొని పైకి ఎగరవేశాడు. రాయి కంటికి కనపడనంత ఎత్తుకుపోయింది. "మరగుజ్జా, నువ్వు కూడా ఈ పని చేసి చూడు!" అన్నాడు. "సరే. సరే. రాయి బాగానే విసిరావు. ఐతేనేమి? నువ్వు విసిరిన రాయి మళ్ళీ నేలమీద పడింది. నేను విసిరేస్తే నేలమీద పడనే పడదు," అంటూ దర్జీ చంకలో ఉన్న గువ్వని విసిరి వేశాడు. ఆ గువ్వ ఇంతసేపటికి వదలిపెట్టినందుకు సంతోషంతో కంటికి కనబడ కుండా ఎగిరిపోయింది. "చూశావా నా గొప్పతనం?" అన్నాడు దర్జీ. "నువ్వు చాలా తెలివిగలవాడివయ్యా! ఇక నువ్వు ఎలా పనిచేస్తావో చూడాలి పద,"

అన్నాడు చిన్నరాక్షసుడు.

చిన్నరాక్షసుడు దర్జీని అడవిలో పనికి తీసుకొనిపోయాడు. అక్కడ ఒక పెద్ద చింతచెట్టు పడి ఉంది. "మనం ఇద్దరం కలిసి దీన్ని లాక్కుపోదాం, పద," అన్నాడు రాక్షసుడు. "మంచిది. నువ్వు మొదలుపట్టుకో! నేను కొమ్మలన్నీ పట్టుకుంటాను. కొమ్మలవైపేగా మరి చెట్టు బరువంతా ఉంటుంది," అన్నాడు దర్జీ. ఆ ప్రకారమే రాక్షసుడు చెట్టుమొదలు భుజంమీద పెట్టుకొని ఈడ్చుకుపోతున్నాడు. దర్జీవాడు మాత్రం హాయిగా కొమ్మల్లో కూర్చున్నాడు. చాలా సులభంగా చెట్టును మోస్తున్న వాడిలాగా ఈలలు వేస్తూ పాటలు పాడుతున్నాడు. రాక్షసుడు చెట్టును చాలాదూరం ఈడ్చుకు వచ్చి అలసిపోయాడు. "నేనిక మొయ్యలేను," అంటూ చెట్టును కింద పడవేశాడు. దర్జీవాడు గబుక్కున కొమ్మలమీద నుంచి దూకి, చెట్టును మోసుకువస్తున్నట్లుగా పట్టుకొని, "అంత లావుగా ఉన్నావు, ఏమి సార్థకం!" అంటూ పకపక నవ్వాడు. కొంచెంసేపు ఆయాసం తీర్చుకుని రాక్షసుడు మళ్ళీ చెట్టుమొదలు భుజాన పెట్టుకొని బయలుదేరాడు. దర్జీవాడు మామూలు ప్రకారం కొమ్మల్లో కూర్చుని దారిపొడవునా ఈలలు వేస్తూ పాటలు పాడుతున్నాడు. ఇంతలో ఒక వెలగ చెట్టు కనపడింది. రాక్షసుడు ఒక పెద్ద కొమ్మ వంచి కాయలు కోస్తున్నాడు. మరగుజ్జు వచ్చి ఆ కొమ్మనే పట్టుకొని కాయలు కోస్తున్నాడు. ఇంతలో రాక్షసుడు ఆ కొమ్మ వదిలిపెట్టి ఇంకొక కొమ్మ వంచాడు. దర్జీ పట్టుకున్న కొమ్మ చటుక్కున పైకి పోయింది. కొమ్మతో పాటు దర్జీ కూడా పైకి వెళ్ళాడు. "ఎంత పనికిమాలిన వాడివయ్యా! ఆ కొమ్మనే వంచి పట్టుకోలేకపోయావు?" అన్నాడు రాక్షసుడు. "పట్టుకోలేక కాదయ్యా! వేటగాళ్ళు మనం ఉన్నవైపు తుపాకీ కాల్చబోతుంటే చూసి పైకి వచ్చాను. నువ్వు కూడా పైకిరా, త్వరగా," అన్నాడు దర్జీ. రాక్షసుడు కూడా చెట్టుమీదకి ఎగరాలని చూశాడు. కాని చెట్టు చాలా ఎత్తుగా ఉంది. అంత ఎత్తు ఎగరలేకపోయాడు. "బండబ్బాయీ!" అని నవ్వాడు దర్జీ. "సరే. ఇక పోదాం పద. ఆ కొండలో మా ఇల్లు ఉంది. అక్కడ మరొక స్నేహితుడు కూడా ఉన్నాడు. వెళ్ళి ఈ రాత్రి మా ఇంట్లో పడుకొందాం పద," అన్నాడు

రాక్షసుడు.

దర్జీ చిన్నరాక్షసుని ఇంటికి వెళ్ళాడు. చిన్నరాక్షసుడు మంచి భోజనం పెట్టాడు. పడుకోవడానికి మంచం ఇచ్చాడు. కానీ దర్జీ ఆ మంచంమీద పడుకొన్నట్టే పడుకొని, అర్ధరాత్రి వేళ లేచి పాకుతూ వెళ్ళి ఇంటిలో ఒక మూల ముడుచుకొని పడుకొన్నాడు. కొంచెం సేపటికి చిన్నరాక్షసుడు ఇనుప చేతి కర్ర పట్టుకొని వచ్చి మంచం మీద "ఫెడేలు"మని కొట్టాడు. దర్జీ చనిపోయాడనుకొని, "నీ మాయలన్నీ మట్టిలో కలిసాయిలే, పొట్టివెధవా!" అన్నాడు.

ఉదయం కాగానే దర్జీ సంగతి పూర్తిగా మర్చిపోయి చిన్నరాక్షసుడూ, పెద్ద రాక్షసుడూ అడవిలోకి వెళ్ళారు. కొంచెం దూరం వెళ్ళగానే దర్జీవాడు ఈలలు వేసుకుంటూ, పాటలు పాడుకొంటూ ఎదురుగా వచ్చాడు. రాక్షసులకు ఎంత భయం పుట్టిందో చెప్పటానికి వీలులేదు. వాళ్ళిద్దరూ 'చచ్చాంరా భగవంతుడా!' అనుకొని పరుగులు తీశారు.

దర్జీవాడు ముక్కుకు సూటిగా నడచిపోయాడు. ఒక పట్టణంలోకి వచ్చాడు. కోటలోపలికి వెళ్ళి రాజుతో తన ధైర్యసాహసాలు వర్ణించి చెప్పాడు. రాజుగారి కొలువులో ఉండి సేవ చెయ్యటానికి వచ్చానన్నాడు. అతని మాటలు నిజమో కాదో పరీక్ష చెయ్యాలనుకొని రాజు, "మా రాజ్యంలో ఇద్దరు రాక్షసులున్నారు. వాళ్ళు ప్రజలను నానా అగచాట్లు పెడుతున్నారు. దొంగతనాలు చేస్తున్నారు. దోపిడీలు చేస్తున్నారు. మనుషుల్ని చంపుతున్నారు. నిజంగా నువ్వు చెప్పినంత ధైర్యం కలవాడవే అయితే, ఒక వందమంది సైనికులను వెంటపెట్టుకుని పోయి వాళ్ళను చంపు, నీకు సగం రాజ్యం ఇస్తాను," అన్నాడు.

"ఎందుకు మహారాజా, వందమంది సైనికులు? నేనొకడిని చాలనూ? ఐనా మీరు తీసుకుపొమ్మన్నారు గనుక, మీ మాట కాదనకుండా వంద మందిని వెంటపెట్టుకుని పోతాను," అన్నాడు దర్జీ.

మరునాడు వందమంది సైనికులతో దర్జీ అడవి లోపలికి వచ్చాడు. "సైనికులారా! మీరిక్కడే ఉండండి. నేను వెళ్ళి రాక్షసులను చూసివస్తాను,"

అన్నాడు. సైనికులు అక్కడే ఆగారు. అటూఇటూ జాగ్రత్తగా చూస్తూ అక్కడే అడవిలో నడుస్తున్నాడు. కొంచెం దూరం వెళ్ళాడు. రాక్షసులిద్దరూ ఒక చెట్టు నీడన పడుకొని నిద్రపోతున్నారు. వాళ్ళు పెట్టే గురకకు చెట్టుకొమ్మలు ఊగుతున్నాయి. 'ఆ! బాగా దొరికారు!' అనుకొన్నాడు దర్జీ. ఒడినిండా రాళ్లు పోసుకొని మెల్లగా వచ్చి వాళ్ళు పడుకొన్న చెట్టు ఎక్కాడు.

ఒక రాయి వెంట ఒక రాయి చిన్నరాక్షసుడి మీద వేశాడు. కొంత సేపటికి చిన్నరాక్షసుడు కోపంతో లేచాడు. పెద్దరాక్షసుడిని చూసి, "కొడతావెందుకు?" అని అరిచాడు. "పిచ్చివాడా! నేను నిన్నెందుకు కొడతాను? కలవరిస్తున్నావా ఏం?" అన్నాడు పెద్దరాక్షసుడు. మళ్ళీ ఇద్దరూ గురకపెట్టి నిద్రపోతున్నారు. ఈ మాటు పెద్దరాక్షసుడి మీద దర్జీ రాళ్ళు వేశాడు. పెద్దరాక్షసుడు అరుస్తూ లేచి, "ఎందుకు కొడతావు?" అన్నాడు. "నేను కొట్టలేదు," అన్నాడు చిన్నరాక్షసుడు. ఇద్దరూ కొంచెం సేపు కీచులాడుకొని మళ్ళీ గురకపెట్టి నిద్రపోయారు. మళ్ళీ దర్జీ ఇద్దరిమీదా రాళ్ళు విసిరాడు. ఒక పెద్దరాయి చిన్న రాక్షసుడి ముక్కుమీద తగిలింది. చిన్నరాక్షసుడు పిచ్చివాడిలాగా అరుస్తూ లేచాడు. "నీ వ్యవహారం ఏమీ బాగుండలేదు. నీకు బుద్ధి చెబుతా ఉండు!" అంటూ పెద్ద రాక్షసుడిని ఒక్క తన్ను తన్నాడు. పెద్దరాక్షసుడు ఎందుకు ఊరుకుంటాడు? చిన్న రాక్షసుడి దవడ పగల గొట్టాడు. ఇద్దరూ కొట్లాటకు దిగారు. చెట్లు పీకి కొట్టుకున్నారు. బండలు ఎత్తి ఒకరిమీద ఒకరు వేసుకున్నారు. చివరకు ఇద్దరూ చచ్చి పడిపోయారు. "మహాబాగా జరిగింది. వాళ్ళ పుణ్యమాయె! నేను ఎక్కిన చెట్టు పెరకలేదు. బతికిపోయాను," అనుకుంటూ దర్జీ మెల్లగా చెట్టు దిగాడు. కత్తి దూశాడు. ఇద్దరు రాక్షసుల గుండెలమీద రెండుమూడు పోట్లు పొడిచాడు. సైనికుల దగ్గరకు రొమ్ము విరుచుకుంటూ వచ్చాడు. "వెళ్ళిచూడండి! రాక్షసులు చచ్చిపడిపోయారు. గుండెల్లో కత్తితో పొడిచాను. అబ్బ! ఎంత కష్టం అయ్యిందనుకున్నారు. చెట్లు పెరికి నామీద వేశారు," అన్నాడు. "మరి మీకు గాయాలేమీ తగల్లేదూ?" అని సైనికులు అడిగారు. "గాయాలే! బొత్తిగా నా తలవెంట్రుక కూడా వాళ్ళు తాకలేకపోయారు!" అన్నాడు దర్జీ. కానీ

సైనికులు అతని మాట వెంటనే నమ్మలేదు. నెత్తురుమధ్య పడి ఉన్న రాక్షసులనూ, వాళ్ళ చుట్టూ పడి ఉన్న చెట్లనూ చూసిగాని నమ్మలేదు.

రాజును హైరానా పెడుతున్న రాక్షసులు చచ్చారు. ఇక రాజుకెలాంటి తొందర లేదు. ఒక మామూలు దర్జీవాడికి సగం రాజ్యం ఇవ్వడం అతనికి నచ్చలేదు. ఏదో ఒక విధంగా ఈ దర్జీని చంపి వెయ్యాలనుకున్నాడు. దర్జీతో అన్నాడు కదా, "నీ పని ఇంకా పూర్తికాలేదు. కోటలో ఒక ఎలుగుబంటి ఉంది. దానితో నువ్వు ఒక రాత్రి గడపాలి. తెల్లవారేటప్పటికి నువ్వు బతికి ఉన్నావంటే అప్పుడు నీకు సగం రాజ్యం ఇస్తాను." ఎలుగుబంటి దగ్గరకు వెళ్ళిన వాళ్ళెవరూ బతికి రాలేదు. అందుకని ఈ ఉపాయంతో దర్జీవాడి పీడ విరగడైపోతుందనుకున్నాడు రాజు. "సరే. నాకు అభ్యంతరం లేదు," అన్నాడు జిత్తులమారి దర్జీ.

సాయంత్రం కాగానే మన దర్జీని ఎలుగుబంటి ఉన్న గుహలో పడవేసి తలుపు మూశారు. ఎలుగుబంటి పంజా ఎత్తి దర్జీ దగ్గరకు వచ్చింది. "మెల్లగా మిత్రమా! మెల్లగా, నీకు మంచి తాయం పెడతాను ఉండు," అంటూ దర్జీ జేబులో నుంచి వేరుశనగకాయలు తీసి తింటూ కూర్చున్నాడు. ఎలుగుబంటికి నోరూరింది. "నాకు కూడా ఇవ్వవా?" అని అడిగింది.



దర్జీ జేబు తడుముకొని తెల్లటి చిన్న చిన్న రాళ్ళు తీసి ఎలుగుబంటి ముందు పోశాడు. ఎలుగుబంటి ఒక రాయి తీసి, పళ్ళకు పట్టించింది. ఎంత కొరికినా అది నలగలేదు. "నేను ఎంత చేతగాని దానిని! వేరుశనగ కాయ కొరకలేకపోయానే!" అనుకొని దర్జీతో "మిత్రమా! వేరుశనక్కాయలు కొరికిపెట్టు," అన్నది. "ఎంత బండదానవు? ఒక వేరుశనగకాయ కూడా కొరకలేకపోయావే! ఎందుకు నీ బలం? కాల్చనా? సరే, నాతో స్నేహంగా ఉండు. నీకు సహాయం చేస్తాను," అన్నాడు దర్జీ. మెల్లగా రాళ్ళు తీసివేసి వేరుశనగకాయలు పెట్టాడు. ఒక్కొక్కటే తీసి పటుక్కున కొరికి ఎలుగుబంటికి వచ్చాడు. "ఈసారి నేను కొరికి చూస్తా ఉండు. నువ్వెలా కొరుకుతున్నావో చూశాగా! ఇక నేను కొరకగలనులే!" అన్నది ఎలుగుబంటి. మళ్ళీ దర్జీ అక్కడ వేరుశనగకాయలు తీసి రాళ్ళు ఉంచాడు. ఎలుగుబంటి పండ్ల బిగువు కొద్దీ కొరికింది. పళ్ళన్నీ ఒకటొకటే విరిగిపోయాయి గాని ఒక్క వేరుశనగ కాయ కూడా నలగలేదు.

ఈ మోసం అట్టే సేపు నడవదని దర్జీ తెలుసుకున్నాడు. కొంచెం సేపటిలో ఎలుగుబంటి రహస్యం తెలుసుకుంటుందని భయపడ్డాడు. మరొక ఉపాయం ఆలోచించాడు. జేబులోనుంచి పిల్లనగ్రోవి తీశాడు. కమ్మగా పాట అందుకున్నాడు. ఎలుగుబంటి పాట విని ఆనందంతో గంతులు వేయసాగింది. కొంచెం సేపైన తర్వాత ఎలుగుబంటి అన్నదికదా: "మిత్రమా! పిల్లనగ్రోవి వాయించడం కష్టమా?" "కాదుకాదు. చాలా సులభం. ఇటుచూడు! వేళ్ళు ఇలా పెట్టాలి. ఇలా కదల్చాలి. తెలిసిందా? అలా చేశావంటే కమ్మని సంగీతం పాడుతుంది," అన్నాడు దర్జీ. "ఐతే నాకు నేర్పుతావా? నేనుకూడా తీరికగా ఉన్నప్పుడు పాడుకొంటాను," అని ఎలుగుబంటి బతిమలాడింది. "సంతోషంగా నేర్పుతాను. కానీ నీ వేళ్ళు చూడనీ, గోళ్ళు చాలా పొడవుగా ఉన్నట్లున్నాయి. కొంచెం కత్తిరించాలి," అన్నాడు దర్జీ. ఎలుగుబంటి అందుకు ఒప్పుకుంది. ఎలుగుబంటి ఒక కాలు వెంట ఒక కాలు ఎత్తిచూపింది. దర్జీ ఉపాయంగా నాలుగు కాళ్ళూ కలిపి గట్టిగా కట్టివేశాడు. "నేను కత్తెర తెచ్చేదాకా అలాగే ఉండు!" అని

ఆ చీకటిలో ఒక మూల కాళ్ళు ముడుచుకొని పడుకొని హాయిగా నిద్రపోయాడు.

ఉదయం కాగానే రాజు ఎలుగుబంటి గుహ దగ్గరకు వచ్చాడు. దర్జీ కులాసాగా పాట పాడుకొంటూ కూర్చున్నాడు. ఇక తన మాట తప్పటానికి వీలులేకపోయింది. సగం రాజ్యం దర్జీకి ఇచ్చాడు. ఈ విధంగా జిత్తులమారి దర్జీ సగం రాజ్యానికి రాజయ్యాడు.

# తన తీర్పు

పూర్వకాలంలో ఒక ముసలి రాణి ఉండేది. ఆమె భర్త చాలా కాలం కిందటే చనిపోయాడు. ఆ రాణీకి ఒక కూతురు ఉంది. ఆమె చక్కని చుక్క. రాకుమారిని దూరదేశంలో ఉన్న ఒక రాకుమారుడికి ఇచ్చి పెళ్ళి చెయ్యటానికి సంబంధం ఖాయమైంది. ప్రదానం కూడా జరిగింది. పెళ్ళి రోజు దగ్గరకు వచ్చింది. కూతుర్ని రాణి రాకుమారుని వద్దకు పంపటానికి అన్ని ఏర్పాట్లు చేసింది. కూతురంటే రాణికి చాలా ప్రేమ. బంగారం, వెండినగలు, విలువ గల దుస్తులు – ఒకటేమిటి, రాజుల ఆడపిల్లలకు కావలసిన అన్ని వస్తువులూ మూటలు కట్టింది. బయలుదేరేముందు రాణి, రాకుమార్తెను గదిలోకి పిలిచి, తన జుట్టు కొంచెం కత్తిరించి మూటకట్టి ఇచ్చి ఇలా అన్నది, “తల్లీ, దీనిని జాగ్రత్తగా ఉంచుకో! తోవలో ఇది నిన్ను కాపాడుతుంది. దీనిలో చాలా మహిమ ఉంది.” రాకుమారి ఆ జుట్టుమూట తీసుకొని చొక్కాలో దాచుకొంది. కన్నీళ్ళు పెట్టుకుని తల్లి వద్ద సెలవు తీసుకుంది. రాణి రాకుమార్తెకు తోడుగా ఒక దాసీపిల్లను కూడా ప్రయాణం చేసింది. ఇద్దరికీ చెరి ఒక గుర్రం సిద్ధం చేసింది. దాసీదాని గుర్రం మీద సామాను మూటలు కట్టారు. రాకుమార్తె గుర్రం పేరు మారుతం. మారుతం మనుషుల మాటలు తెలుసుకోగలదు, మాట్లాడుతుంది కూడా!

రాకుమారి, దాసీ గుర్రాలు ఎక్కి వెళుతున్నారు. కొన్ని రోజుల తర్వాత ఒకనాడు ఒక ఏటి వడ్డున పోతుండగా రాకుమారికి దాహం పుట్టి దాసీతో

ఇలా అన్నది: "నా బంగారు గిన్నెతో కొంచెం నీళ్ళు తెచ్చి ఇవ్వు. దాహంగా ఉంది."

"నేను తీసుకురాను. దాహంగా ఉంటే దిగి తాగిరా! నేను నీ దాసీని కాను," అని దాసీది బదులు చెప్పింది.

రాకుమారి ఏమీ అనలేక గుర్రం దిగి ఏటి నీరు దోసిళ్ళతో తాగింది. బంగారు గిన్నె ఇవ్వమంటే దాసీది ఏమంటుందో అని భయం వేసి అడగలేదు. రాకుమారికి చాలా విచారం కలిగింది. కొంచెంసేపు తల్లిని తలచుకుని ఏడిచింది. ఆమె చొక్కాలో ఉన్న జుట్టుమూట ఇలా అన్నది:

*"ఎంత కష్టము వచ్చె, నెంత కష్టమువచ్చె!*
*నీ యాతనలు చూసి నినుచూసి నీ తల్లి*
*ఎంత వాపోవునో, ఎంత వాపోవునో!"*

రాకుమారి చాలా ఉత్తమురాలు. దాసీది అంత అవమానం చేసినా నోరు తెరిచి ఒక్కమాట అనకుండా తిరిగి గుర్రం ఎక్కి బయలుదేరింది. ఇద్దరూ గుర్రాల మీద స్వారీ చేస్తూ వెళ్తున్నారు. మధ్యాహ్నం అయింది. ఎండ కాలిపోతున్నది. రాకుమారికి మళ్ళీ దాహం అయింది. కొంచెంసేపటికి ఒక నది ఒడ్డుకు వచ్చారు. దిగి, "నా బంగారుగిన్నెతో మంచినీళ్ళు తీసుకురా!" అని రాకుమారి దాసీతో చెప్పింది.

దాసీది రుసరుసలాడుతూ మామూలుపాటే పాడింది. "కావలసి ఉంటే దిగి తాగు. నేను నీ దాసీని కానని చెప్పలే!"

పాపం రాకుమారి ఏమీ అనలేకపోయింది. గుర్రం దిగి నదినీటిని చూస్తూ, "నా గతి ఏమౌతుంది?" అన్నది. ఆమె చొక్కాలో ఉన్న జుట్టుమూట మళ్ళీ ఇలా బదులు చెప్పింది:

*"ఎంత కష్టమువచ్చె, నెంత కష్టము వచ్చె!*
*నీ యాతనలు చూసి, నిను చూసి నీ తల్లి*
*ఎంత వాపోవునో, ఎంత వాపోవునో!"*

రాకుమారి వంగి నీళ్ళు తాగుతూ ఉండగా జుట్టుమూట ఆమె చొక్కాలోనుంచి జారి నదిలో పడింది. నీటిలో కొట్టుకుపోయింది. ఆమె

గమనించలేదు. కాని ఎందుకో తెలియకుండా చాలా భయపడింది. జుట్టుమూట జారిపోవడం, ఏటిలో కొట్టుకుపోవడం దాసి చూసింది. చాలా సంతోషపడింది. దానికి ఆ జుట్టులో ఉన్న మహిమ తెలుసు! ఇక రాకుమారిని తన ఇష్టం వచ్చినట్లు ఆడించవచ్చుననుకొంది. రాకుమారి తిరిగి వచ్చి మారుతాన్ని ఎక్కబోతూ ఉండగా, “మారుతం మీద నేను ఎక్కుతాను. నా గుర్రం మీద నువ్వు ఎక్కు.” అని దాసీది పురమాయించింది. రాకుమారి ఏమీ అనలేకపోయింది. దాసీదాని గుర్రాన్ని ఎక్కింది. దాసీది మారుతాన్ని ఎక్కింది. ఆ రోజు అలా గడిచిపోయింది. మరుసటినాడు బలవంతంగా రాకుమారి పెళ్ళి దుస్తులు విడిపించి దాసీది కట్టుకుంది. తన పాత దుస్తులను రాకుమారితో కట్టించింది. రాకుమారి ఏమీ అనలేకపోయింది.

ఇలా కొన్ని రోజులు ప్రయాణం చేసి చివరకు రాకుమారుని పట్టణం దగ్గరకు వచ్చారు. జరిగిన సంగతులేమైనా ఎవరికైనా చెప్పావంటే చంపుతానని రాకుమారిని దాసీది బెదిరించింది. ఈ వ్యవహారమంతా మారుతం మొదటినుంచీ గమనిస్తూనే ఉంది.

కొత్త రాకుమారీ, కొత్త దాసీ ఇద్దరూ గుర్రాలమీద కోట లోపలికి వెళ్ళారు. వీళ్లను చూడగానే కోటలో అందరూ సంతోషించారు. రాకుమారుడు పరుగెత్తుకు వచ్చి పెళ్ళి కూతరు చేయి పట్టుకొని గుర్రంమీదనుంచి దించాడు. అంతఃపురం మేడమీదికి తీసుకుపోయాడు. కాని, నిజమైన రాకుమారిని మాత్రం కిందనే ఉండమన్నారు.

ముసలిరాజు వీళ్ళు రావడం కిటికీ దగ్గర నిలబడి చూస్తూ ఉన్నాడు. ఈ దాసీ అమ్మాయి చాలా అందంగా, చాలా సుకుమారంగానూ ఉన్నట్లు గ్రహించాడు. అంతఃపురం లోపలికి వెళ్ళి పెళ్ళికూతురును “అక్కడ నిలచి ఉన్న ఆమె ఎవరు?” అని అడిగాడు. అందుకు పెళ్ళికూతురు ఇలా బదులు చెప్పింది: “ఆ పిల్ల నాకు తోడు వచ్చింది. ఇక్కడే ఉంటుంది. ఊరికే ఉంచకుండా ఏదైనా పని చూపించండి.” అంత సుకుమారంగా కనపడుతున్న ఆ అమ్మాయికి ఏ పని చెప్పాలో ముసలిరాజుకు చాలాసేపటి వరకు తోచలేదు. ఆలోచించి ఆలోచించి అన్నాడు: “మనకు చాలా బాతులున్నాయి.

వాటిని చూడడానికి ఒక కుర్రవాడున్నాడు. వాడికి ఈ పిల్ల సహాయం చేయవచ్చు." రాజుగారి బాతులను చూసే పిల్లవాడి పేరు శరభయ్య. ఈ శరభయ్యకే రాకుమారి సహాయం చెయ్యాలి.

కొంచెం సేపైందో లేదో కొత్త పెళ్ళికూతురు, "ఏమండీ! ఒక చిన్న ఉపకారం చేసి పెడుదురూ!" అని రాకుమారుడిని అడిగింది. "తప్పకుండా చేస్తాను. ఏమిటో చెప్పు," అన్నాడు రాకుమారుడు. "అయితే, కసాయివాడిని పిలిపించి నేను ఎక్కి వచ్చిన గుర్రం తల నరికించండి. పాడుగుర్రం! దారిలో నన్ను ఎన్ని తిప్పలు పెట్టిందనుకొన్నారు?" అన్నది కొత్త పెళ్ళికూతురు. అసలు ఆవిడ మనస్సులో ఉన్న సంగతేంటంటే – దారిలో జరిగిన వ్యవహారమంతా మారుతం ఎవరికి చెబుతుందోనని తగని భయంగా ఉంది. వెంటనే కసాయివాడిని పిలిచి రాకుమారుడు ఆజ్ఞ ఇచ్చాడు. కసాయివాడు మారుతం తల నరికేశాడు. రాకుమారికి ఈ సంగతి తెలిసింది. కసాయివాడి వద్దకు వెళ్ళి ఏడ్చింది. మారుతం తల కోట గుమ్మం మీద మేకుతో బిగించమని బతిమాలింది. బతిమలాడగా, బతిమలాడగా కసాయివాడు ఒప్పుకొన్నాడు. కోట గుమ్మం మీద మారుతం తల మేకుతో బిగించాడు.

రెండవనాటి ఉదయం రాకుమారి శరభయ్యతోపాటు బాతుల వెంట కోటగుమ్మం గుండా వెళుతూ, మారుతం తలను చూసింది. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. విచారంతో ఇలా అన్నది:

*"మారుతం! మారుతం! వేలాడుతున్నావా?"*

గుర్రం తల ఇలా బదులు చెప్పింది:

*"ఎంత కష్టమువచ్చె, నెంత కష్టమువచ్చె!*
*నీ యాతనలు చూసి, నినుచూసి నీ తల్లి,*
*ఎంత వాపోవునో, ఎంత వాపోవునో!"*

బాతులను తోలుతూ ఊరి వెలుపలి బీడులోకి వెళ్ళారు. అక్కడొక చిన్న చెరువు ఉంది. ఆ చెరువు ఒడ్డున రాకుమారి జుట్టు ముడి విప్పుకొని దువ్వుకొంటూ కూర్చుంది. ఆమె వెంట్రుకలు బంగారు వెంట్రుకలు. శరభయ్య చూశాడు. ఎండలో ఆమె వెంట్రుకలు తళతళలాడుతున్నాయి. మెల్లగా

రాకుమారి దగ్గరకు వచ్చాడు. ఆమె జుట్టు పీకడానికి, చెయ్యి చాచాడు. రాకుమారి కనిపెట్టింది. ఇలా పాడింది:

*"లేచులే గాడుపులు*
*తాచుపాముల లాగ*
*శరభయ్య తలపాగ*
*ఎగిరిపోవునులే."*

వెంటనే పెద్ద గాడ్పు వీచింది. శరభయ్య తలపాగ లేచింది. చెట్లు దాటి, గుట్టలు దాటి గాలిలో తేలిపోయింది. శరభయ్య దానివెంట పరుగెత్తాడు. తలపాగ తీసుకొని మళ్ళీ అతడు తిరిగి వచ్చేటప్పటికి చాలాసేపు పట్టింది. ఈలోగా రాకుమారి జుట్టు దువ్వుకొని ముడి వేసుకుంది. శరభయ్యకు చాలా కోపం వచ్చింది. రాకుమారితో మాట్లాడడం మానేశాడు. పొద్దు జారిపోయిన తర్వాత బాతుల్ని తోలుకుని కోటకు బయలుదేరారు. రెండవనాటి ఉదయం మళ్ళీ కోటగుమ్మం దగ్గరకు రాగానే గుర్రం తల చూసి రాకుమారి ఇలా అన్నది:

*"మారుతం! మారుతం! వేలాడుతున్నావా?"*

మారుతం ఇలా బదులు చెప్పింది:

*"ఎంత కష్టమువచ్చె, నెంత కష్టమువచ్చె!*
*నీ యాతనలు చూసి, నినుచూసి నీ తల్లి,*
*ఎంత వాపోవునో, ఎంత వాపోవునో!"*

బాతులను బీడులోకి తోలుకుపోయి, రాకుమారి చెరువుగట్టున, జుట్టుముడి విప్పి మళ్ళీ దువ్వుకొంటూ కూర్చుంది. మళ్ళీ శరభయ్య ఆమె జుట్టు పీకడానికి వచ్చాడు. రాకుమారి మళ్ళీ ఇలా అన్నది:

*"లేచులే గాడుపులు*
*తాచుపాముల లాగ*
*శరభయ్య తలపాగ*
*ఎగిరిపోవునులే."*

వెంటనే పెద్ద గాడ్పు వీచింది. శరభయ్య తలపాగ లేచింది. చెట్టులు

దాటి, గుట్టలు దాటి గాలిలో తేలిపోయింది. శరభయ్య దానివెంట పరుగెత్తాడు. తలపాగ తీసుకొని అతడు తిరిగివచ్చేటప్పటికి చాలాసేపు పట్టింది. ఈలోగా రాకుమారి జుట్టు దువ్వుకొని, ముడి వేసుకుంది. చీకటిపడేదాకా ఇద్దరూ బాతులను కాస్తూ ఉన్నారు.

ఇంటికి వెళ్ళిన తర్వాత శరభయ్య ముసలిరాజు దగ్గరకు పరుగెత్తుకు వెళ్ళి "ఆ పిల్ల ఇక నాతో రానక్కర్లేదు!" అన్నాడు.

"ఎందుకని?" ముసలిరాజు అడిగాడు.

"ఎందుకనంటే – ఆ పిల్ల ఏమీ చెయ్యదు. సరికదా, ఎప్పుడూ నన్ను ఎగతాళి చేస్తుంది," అన్నాడు శరభయ్య.

ఏమి జరిగిందో అంతా చెప్పమని రాజు పట్టుబట్టాడు. శరభయ్య చెప్పక తప్పలేదు. ఇలా చెప్పాడు:

"మేం ఉదయం కోట గుమ్మం గుండా వెళ్ళేటప్పుడు దానిమీద ఉన్న గుర్రం తలను చూసి ఆ పిల్ల ఏడుస్తుంది. వాళ్ళిద్దరూ మాట్లాడు కొంటారు. ఆమె అంటుంది కదా:

*"మారుతం! మారుతం! వేలాడుతున్నావా?"*

గుర్రం తల బదులు చెబుతుంది:

*"ఎంత కష్టమువచ్చె, నెంత కష్టమువచ్చె!*
*నీ యాతనలు చూసి, నినుచూసి నీ తల్లి,*
*ఎంత వాపోవునో, ఎంత వాపోవునో!"*

తర్వాత బీడులో ఏమి జరిగిందీ, తన తలపాగా ఎలా ఎగిరిపోయిందీ, తాను దానివెంట ఎలా పరుగెత్తిందీ, సవిస్తరంగా చెప్పాడు. ముసలిరాజు తను ఇదంతా స్వయంగా చూడాలన్నాడు. మామూలుగానే రేపటి ఉదయం కూడా ఆ పిల్లతోపాటు బాతులను తోలుకొని వెళ్ళమని శరభయ్యకు చెప్పాడు.

రెండవనాడు తెల్లవారగానే కోట తలుపుచాటున నక్కి, గుర్రపు తలకూ, రాకుమారికీ జరిగిన సంభాషణ అంతా ముసలి రాజు విన్నాడు. తర్వాత ఎవ్వరికీ కనపడకుండా బీడులో ఒక పొదమాటున దాగి, వాళ్ళు బాతులను తోలుకురావడం, రాకుమారి చెరువుగట్టున కూర్చొని జుట్టు ముడి విప్పుకొని



తల దువ్వుకోవడం చూశాడు. తర్వాత రాకుమారి ఇలా అనడం విన్నాడు:

*"లేచులే గాడుపులు*
*తాచుపాముల లాగ*
*శరభయ్య తలపాగ*
*ఎగిరిపోవునులే."*

వెంటనే పెద్ద గాలి వీచడం, శరభయ్య తలపాగా ఎగిరిపోవడం, శరభయ్య తలపాగా తెచ్చుకొనేలోగా రాకుమారి తల దువ్వుకొని జుట్టు ముడి వేసుకోవడం – అంత ముసలిరాజు కళ్ళారా చూశాడు. మళ్ళీ ఎవ్వరికీ కనబడకుండా తిరిగి ఇంటికి వెళ్ళాడు. సాయంత్రం కాగానే, శరభయ్య, రాకుమారి కోటకు రావడం చూసి ముసలిరాజు రాకుమారిని చాటుగా పిలిచి, "అమ్మాయీ! నీ సంగతి అంతా విచిత్రంగా ఉంది. అసలు నీవెవరో చెప్పమ్మా?" అని బుజ్జగిస్తూ అడిగాడు. "మహారాజా! ఆ సంగతి నేను చెప్పలేను. చెబితే ప్రాణం దక్కదు," అన్నది రాకుమారి. రాజు ఆమె చెప్పేదాకా విడిచిపెట్టలేదు. చివరకు రాకుమారి జంకుతూ, జంకుతూ జరిగిన కథ అంతా పూసగుచ్చినట్లు చెప్పింది. చెప్పటం మేలే అయింది. ఎందుకనంటే ముసలిరాజు వెంటనే రాకుమార్తెలు వేసుకొనే దుస్తులు తెప్పించి, ఆమెకిచ్చాడు. ఆ దుస్తులు వేసుకొనేటప్పటికి ఆమె ఎంత అందంగా ఉందో చెప్పనలవికాదు. ముసలిరాజు చాలా ఆశ్చర్యపోయాడు. కొడుకును రప్పించాడు. అంతా చెప్పాడు. అంతఃపురంలో ఉన్నది రాకుమారి కాదనీ, దాసీ అని అన్నాడు. అసలు రాకుమారి ఈమెయేనని చెప్పాడు. రాకుమారి అందం చూసి రాకుమారుడు మురిసిపోయాడు. అందంకంటే మించిన ఆమె మంచిగుణాలు, ఓర్పు విని ఆశ్చర్యపోయాడు. ఇక ఒక మాట కూడా మాట్లాడకుండా వెళ్ళి పెద్ద విందు ఏర్పాటుచేయించాడు. కోటలో ఉన్న వాళ్ళందర్నీ పిలిచాడు.

రాకుమారుడు అందరికంటే ఎత్తున కూర్చున్నాడు. అసలు రాకుమార్తెను ఒక పక్క, నకిలీ రాకుమార్తెను మరొక పక్కన కూర్చోబెట్టుకున్నాడు. అసలు రాకుమార్తెను ఎవ్వరూ కనుక్కోలేకపోయారు. ఆమె అందం వాళ్ళ కళ్ళు మిరిమిట్లు గొలిపింది.

విందు ముగిసింది. అందరూ కులాసాగా కబుర్లు చెప్పుకొంటున్నారు. ముసలిరాజు తాను ఒక కథ చెబుతానంటూ, రాకుమారి కథ అంతా చెప్పాడు. ఈ విధంగా మోసం చేసిన దాసీని ఏమి చెయ్యాలి అని నకిలీ రాకుమార్తెను అడిగాడు. "చేసేదేమిటి? గుర్రం కాలికి కట్టి చచ్చేదాకా

వీధివీధి తిప్పితే దాని పాపం తీరుతుంది," అని నకిలీ రాకుమారి తీర్పు చెప్పింది.

"ఐతే విను! ఆ దాసీవి నువ్వే. నిన్ను గురించి నువ్వే తీర్పు చెప్పావు కాబట్టి అలాగే చేస్తాం," అని ముసలిరాజు అన్నాడు.

రాకుమార్తెకూ, రాకుమారునికీ మహావైభవంగా పెళ్ళి జరిగింది.

# కథలు చదివిన క్రమం...


1. బంగారుకొండ 3

2. సుందరి, సింహం 11

3. కోడిపెట్ట, కోడిపుంజు 20

4. బంగారు వెంట్రుకలు 27

5. నీలపు దీపం 36

6. పిల్లితోలు పిల్ల 42

7. తోటకూర 50

8. పాపం! పెళ్ళికొడుకు! 57

9. నక్క, గుర్రం 62

10. పన్నెండుగురు రాకుమార్తెలు 65

11. నలుగురు గాయకులు 71

12. పాపయ్య అదృష్టం 76

13. మసిబొగ్గు 83

14. గులాబి మొగ్గ 94


15. వరదయ్య నిద్ర 99

16. చిన్న రాక్షసుడు, దర్జీవాడు 104

17. తన తీర్పు 119

# నీలపు దీపం

## గ్రిమ్స్ కథలు



**జాకబ్** (1785–1863), **విల్హెల్మ్ గ్రిమ్** (1786–1859) జర్మనీకి చెందిన భాషావేత్తలు, సాంస్కృతిక పరిశోధకులు. గ్రిమ్స్ సోదరులుగా ప్రసిద్ధిచెందిన వీళ్ళిద్దరూ 19వ శతాబ్దంలో జానపద కథలను సేకరించి ప్రచురించారు. సిండ్రెల్లా, హాన్సల్ & గ్రెటెల్, స్నో వైట్ వంటి ఎన్నో జానపద కథలు ప్రాచుర్యంలోకి రావటానికి ఈ సోదరులే కారణం. పిల్లల కోసం వీళ్లు చేసిన జానపద కథల మొదటి సంకలనం 1812లో ప్రచురితమయింది. దాంట్లో 86 కథలు ఉన్నాయి. 1857 నాటికి వీటిని ఎన్నోసార్లు సవరించి ప్రచురించారు. మొత్తం మీద 200 కథలు సేకరించి ప్రచురించారు.

ఈ కథలు ఎంతో ఆదరణ పొందాయి. వందకు పైగా భాషలలోకి అనువాదం అయ్యాయి. ఎన్నో కథలను ఎంతో మంది సినిమాలుగా తీశారు.

గ్రిమ్స్ సోదరులు సేకరించిన వాటి నుంచి ఈ సంకలనంలో 17 కథలు ఉన్నాయి. వీటిని ఊట్ల కొండయ్య చక్కగా తెనిగించటమే కాకుండా మన పరిసరాలకు అనుగుణంగా మలిచారు. ఇవి 1958లోనే చిన్న చిన్న పుస్తకాలు గానూ, రెండు సంపుటాలుగాను బొందలపాటి శకుంతల సంపాదకత్వంలో బాలానంద ప్రచురణలు ద్వారా ప్రచురితమయ్యాయి. ఈ కథలకు బాపు బొమ్మలు వేశారు.

ISBN 978-93-83936-17-5
9789383936175